


‘ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి’

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 167

బుధవారం 6-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సమరానికి మన సైన్యమిదే

వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన. కేఎల్ రాహుల్‌కు స్థానం - 12లో



19,550 స్థాయి పైకి నిఫ్టీ

అధిక వెయిటేజీ షేర్ల అండ... మూడో రోజూ ముందుకే - 13లో



గంగుల కుటుంబానికి నోటీసులు!

మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులకు ఈడీ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

- వివరాలు 5లో



జిల్ బైడెన్‌కు కరోనా పాజిటివ్

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భార్య, దేశ ప్రథమ పౌరురాలు జిల్ బైడెన్ కోవిడ్–19 బారినపడ్డారు.

- వివరాలు 6లో



ఉదయనిధిపై చర్యలు తీసుకోండి

సనాతన ధర్మంపై మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మాజీ జడ్జీలు, ఉన్నతాధికారులు సీజేఐకి లేఖ రాశారు.

- వివరాలు 6లో



కోటాపై 50% పరిమితి తొలగించాలి

దేశంలో ప్రస్తుతం రిజర్వేషన్లపై అమల్లో 50% పరిమితిని తొలగించాలని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

- వివరాలు 6లో

తెరపైకి భారత్..!

ఇండియా పేరును మార్చేందుకు కేంద్ర ప్రభుత్వ యత్నం



- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో తీర్మానం ఆమోదించే అవకాశం
- ‘ప్రెసిడెంట్ ఆఫ్ భారత్’ పేరిట ఆహ్వాన పత్రికలు
- ఈ నెల 9న జరిగే విందుకు జీ20 నేతలకు ఆహ్వానం
- నరేంద్ర మోదీ సర్కారుపై ప్రతిపక్షాల ఆగ్రహం
- ‘ఇండియా’ కూటమిని చూసి మోదీ భయపడుతున్నారని ఎద్దేవా
- ‘భారత్’ను తుడిచిపెట్టేయడానికి కొత్త ఖిల్జీలు, కొత్త మొఘల్ రాజులు పుట్టుకొచ్చారు
- విపక్ష నాయకులపై బీజేపీ మండిపాటు

దేశాన్ని నచ్చిన పేరుతో పిలుచుకోవచ్చు

2016లో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

దేశం పేరు మారితే ఆ వెబ్‌సైట్లకు కష్టాలు

ఇది దేనికి సంకేతం?

- వివరాలు 6లో

న్యూఢిల్లీ: భారతదేశం, హిందుస్తాన్, ఇండియా.. ఇవన్నీ ఒకే దేశం పేర్లు. భారతదేశం ప్రపంచ దేశాలకు ‘ఇండియా’గానే తెలుసు. అధికారికంగా అమల్లో ఉన్న పేర్లలో ‘ఇండియా’కూడా ఒకటి. అయితే, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ‘ప్రెసిడెంట్ ఆఫ్ భారత్’గా సంబోధిస్తూ ముద్రించిన ఆహ్వాన పత్రికలను ఆమె తరఫున జీ20 దేశాల అధినేతలకు రాష్ట్రపతి భవన్ పంపించడం తీవ్ర వివాదానికి దారితీసింది. దేశం పేరును మార్చడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. జీ20 శిఖరాగ్ర సదస్సు వేదిక అయిన ‘భారత్ మండపం’లో ఈ నెల 9న రాత్రి జరిగే విందుకు హాజరు కావాలని కోరుతూ ‘ప్రెసిడెంట్ ఆఫ్ భారత్’ తరఫున రాష్ట్రపతి భవన్ ఆహ్వానాలు పంపించింది. ఈ ఆహ్వాన పత్రికను కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం ‘ఎక్స్’లో షేర్ చేశారు. ‘జనగణమన అధినాయక జయహే, భారత భాగ్య విధాత’అనే వ్యాఖ్యను సైతం జోడించారు. జయహో అంటూ ముక్తాయించారు. ఈ పత్రిక సోషల్ మీడియాలో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దేశం పేరును ‘భారత్’గా మార్చడానికి ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నెల 18 నుంచి మొదలయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ మేరకు తీర్మానాన్ని ఆమోదించే అవకాశం ఉన్నట్లు ప్రచారం మొదలైంది. తమ కూటమి పేరు ‘ఇండియా’ను చూసి మోదీ సర్కారు భయపడుతోందని, అందుకే దేశం పేరును మార్చేసే కుతంత్రానికి పాల్పడుతోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. భారత్ అని రాజ్యాంగంలో స్పష్టంగా ఉందని, అదే పేరును

మిగతా 6వ పేజీలో ▶

17న పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవం

గత ఏడాది మాదిరిగానే కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ



- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- సమరయోధులు, అమరుల స్మరణకు ప్రత్యేక కార్యక్రమాలు
- దేశవ్యాప్తంగా ప్రతి గ్రామం నుంచి పిడికెడు మట్టి సేకరణ
- ఢిల్లీలో స్మారక వనం, అమృత స్తూపం ఏర్పాటు

- వివరాలు 3లో

రెండోరోజూ

అదేజోరు

- బీజేపీ టికెట్‌ల కోసం ఆశావహుల దరఖాస్తులు
- తొలిరోజు 182 .. మంగళవారం 178

- వివరాలు 3లో



నాఫ్కో ప్రతినిధి బృందంతో కేటీఆర్

తెలంగాణకు అరబ్ పెట్టుబడులు

మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన పలు యూఏఈ కంపెనీలు..

- తొలిరోజే రూ.1,040 కోట్లకు పైగా పెట్టుబడులు
- నాఫ్కో ప్లాంట్ రూ.700 కోట్లు
- మలబార్ గ్రూప్ రూ.125 కోట్లు

- వివరాలు 5లో

ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయండి



- కోర్టు తీర్పు మేరకు ఎమ్మెల్యేగా గుర్తించండి
- అసెంబ్లీ కార్యదర్శితో డీకే అరుణ భేటీ
- తదుపరి చర్యలు నిలిపివేయాలని ఈసీకి బండ్ల లేఖ

- వివరాలు 3లో

దంచికొట్టిన వాన

హైదరాబాద్‌లో మంగళవారం తెల్లవారుజాము నుంచి కుండపోత

- లోతట్టు ప్రాంతాలు జలమయం.. ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు
- ఇళ్లు, అపార్ట్‌మెంట్లలోకి చేరిన వరద నీరు
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ భారీ వర్షాలు
- వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం
- మరో మూడు రోజులూ వానలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిక
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు



కుత్బుల్లాపూర్‌లోని బౌరంపేటలో ల్యాండ్ మార్క్–2 విల్లాస్‌లో చేరిన వర్షపు నీరు

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రవ్యాప్తంగా వానలు కొనసాగుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాలతోపాటు ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, హైదరాబాద్ జిల్లాల్లో దంచికొడుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. ముఖ్యంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి కురిసిన కుండపోత వాన గ్రేటర్ హైదరాబాద్, శివారు ప్రాంతాలను వణికించింది. ఇక బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మరో మూడురోజులు వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

దంచికొట్టి.. వణికించి..

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో ఎడతెరిపిలేకుండా కురిసిన వాన జన జీవనాన్ని అతలాకుతలం చేసింది. లోత ట్టు ప్రాంతాలు, కాలనీలు జలమయం అయ్యాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు చేరింది. రోడ్లు చెరువులను

మిగతా 2వ పేజీలో ▶

గోదావరిపై

గేట్లన్నీ ఓపెన్!

శ్రీరాంసాగర్ నుంచి సీతమ్మసాగర్ దాకా నీటి విడుదల

- వివరాలు 2లో



నాలాలో కొట్టుకుపోయిన బాలుడి మృతదేహాన్ని తీసుకొస్తున్న సహాయక సిబ్బంది

నాలాలో కొట్టుకుపోయి

బాలుడి మృతి

హైదరాబాద్ శివార్లలోని నిజాంపేట్ ఎన్నారై కాలనీలో ఘటన

- వివరాలు 2లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venkobb CHICKEN

Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate				
₹ 59 per dozen	Ex Farm Live Bird	134 kg	Dressed with Skin	228 kg
	Retail Live Bird	156 kg	Skin Less	257 kg

Issued in the interest of consumers

ఇదండీ సంగతి



దర్యాప్తు చేపడితే.. బాబు, చినబాబు జైలుకే!

ఐటీ నోటీసులపై ఈడీ సుమోటోగా దర్యాప్తు చెయ్యొచ్చు



- ఎన్నికల కమిషన్, విజిలెన్స్ కమిషన్ కూడా విచారణ జరపవచ్చు
- పీఎంఎల్ఏ, ఫెమా, ఆర్బీఐ, కంపెనీ చట్టాల కింద కేసు నమోదుకు అవకాశం
- ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కూడా దర్యాప్తునకు చాన్స్
- ఐటీకి సమాధానం ఇవ్వకుండా తప్పించుకునేందుకు బాబు యత్నం
- 2019 తర్వాత వచ్చినవే ఆ రూ.118.98 కోట్లు అయితే.. 2014 నుంచి ఎన్ని వేల కోట్లు కొల్లగొట్టారో?
- ఇదంతా తెలియాలంటే.. నిష్పాక్షిక దర్యాప్తు అవసరం
- ‘సాక్షి’తో న్యాయవాది, కార్పొరేట్ న్యాయ నిపుణుడు వెంకటరామిరెడ్డి

- వివరాలు 5లో

బాబు బంగ్లాకే ముడుపులు..

మళ్లీ ఆ ముగ్గురే

- అమరావతి కాంట్రాక్టుల తరహాలోనే ‘స్కిల్’ స్కామ్.. సూత్రధారి చంద్రబాబే
- ‘సీమెన్స్’కి తెలియకుండా ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాయ
- కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి మోసం
- నకిలీ ఇన్వాయిస్‌లతో డ్రా చేసి పార్థసానికి అందించిన యోగేశ్
- వాటిని హైదరాబాద్‌కు తరలించి బాబు పీఏస్‌కు అందించిన మనోజ్
- ఆ కొల్లగొట్టిన నిధులు చివరకు చేరింది చంద్రబాబు నివాసానికే!
- మనోజ్, యోగేశ్ గుప్తా, బాబు పీఏస్ పెండ్యాలకు సిట్ నోటీసులు

10 లో


గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలో నీట మునిగిన అపార్ట్‌మెంట్లు. చిక్కుకున్న వారిని తరలిస్తున్న సహాయక సిబ్బంది


భారీ వర్షానికి నీట మునిగిన కూకట్‌పల్లి బస్ డిపో


మూసాపేటలో చెరువులా మారిపోయిన రోడ్డు



ఈదుకుంటూ వెళ్లి.. విద్యుత్ తీగలు సరిచేసి

జూనియర్ లైన్‌మన్ సాహసం

చేగుంట(తూప్రాన్): చెరువులో విద్యుత్ తీగలు తెగి పడిపోవడంతో.. జూనియర్ లైన్‌మన్ ఈదుకుంటూ వెళ్లి సరిచేశాడు. మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి వెళ్లే విద్యుత్ తీగలు ఉల్లితిమ్మాయిపల్లి చెరువులో సోమవారం రాత్రి తెగిపడిపోయాయి. మంగళవారం ఉదయం గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో జూనియర్ లైన్‌మన్ శ్రీనివాస్ చెరువులోకి ఈదుకుంటూ వెళ్లి.. సిబ్బంది కృష్ణ సాయంతో సరిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాడు. విధి నిర్వహణలో శ్రీనివాస్ చూపిన నిబద్ధతపై అధికారులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.


టోలిచౌకి ఫ్లై ఓవర్‌పై భారీగా నిలిచిన ట్రాఫిక్


రాజేంద్రనగర్‌లో వరదలో ఆగిపోయిన బస్సును బయటికి తీసుకొస్తున్న పోలీసులు

దంచికొట్టిన వాన..


టోలిచౌకిలో ఓ హోటల్‌లోకి వచ్చిన వరద నీరు

▶ మొదటి పేజీ తరువాయి

తలపించాయి. పలుచోట్ల రోడ్లపై వరద ఉధృతికి వాహనాలు కొట్టుకుపోయాయి. మియాపూర్‌లో మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఐదు గంటల్లోనే ఏకంగా 14.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరిగి మధ్యాహ్నం వరకు మరో 5.9 సెంటీమీటర్లు వాన పడినట్టు వాతావరణశాఖ ప్రకటించింది. రాజేంద్రనగర్, అత్తాపూర్ డివిజన్ల పరిధిలో పిల్లర్ నంబర్ 193 ప్రాంతం, శివరాంపల్లి, నేషనల్ పోలీస్ అకాడమీ ప్రాంతాల్లో వరద నిలిచి రాకపోకలు స్తంభించాయి. మణికొండ పంచవటి కాలనీలో వరద రోడ్డును ముంచెత్తింది. మంచిరేవుల వద్ద చిన్న గుట్టపై నుంచి బండరాళ్లు దొర్లి ఓఆర్ఆర్ సర్వీస్‌రోడ్డుపైకి వచ్చాయి. ఇక భారీ వర్షం కారణంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ఇచ్చారు.

స్తంభించిన ట్రాఫిక్‌తో యాతన

కొన్ని ప్రధాన రహదారులపై మోకాలి లోతు నీళ్లు నిలవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. కొంత దూరం ప్రయాణించడానికి కూడా అరగంట, గంట సమయం పట్టడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. ఆర్టీసీ బస్సులు వరదలో చిక్కుకుపోయాయి. బేగంపేట, పంజాగుట్ట, మాదాపూర్, దుర్గం చెరువు, మినిస్టర్ రోడ్డు, టోలిచౌకి, భరత్‌నగర్ ఫ్లైఓవర్, ఎల్బీ నగర్, మేడ్చల్, సుచిత్ర, బోయిన్‌పల్లి, సికింద్రాబాద్, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, కొండాపూర్, ఐకియా తదితర మార్గాల్లో ఈ దుస్థితి కనిపించింది. మధ్యాహ్నం తర్వాత పరిస్థితి కాస్త మెరుగుపడింది.

జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో భారీ వర్షాలతో పలు చెరువులు అలుగుపోస్తున్నాయి, వాగులు పొంగుతున్నాయి. దీనితో ఈసీ, మూసీ నదులకు వరద పోటెత్తింది. దీనితో జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ నిండు కుండల్లా మారాయి. ప్రాజెక్టుల గేట్లు ఎత్తి 5వేల క్యూసెక్కులకుపైగా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో మూసీ పరీవాహక ప్రాంతాల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. మూసారాంబాగ్ వంతెన వద్ద వరద మట్టం పెరగడంతో తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేశారు.

ట్రాక్టర్లతో విద్యార్థులను తరలించి..

భారీ వర్షాలు, వరదతో గ్రేటర్ హైదరాబాద్ శివార్లలోని గుండ్లపోచంపల్లి మైసమ్మగూడలో ప్రైవేటు హాస్టళ్లను నిర్వహిస్తున్న సుమారు 15 అపార్ట్‌మెంట్లు జల దిగ్బంధమయ్యాయి. విద్యార్థులంతా హాస్టళ్లలో చిక్కుకుపోవడంతో భయాందోళన వ్యక్తమైంది. అధికారులు ట్రాక్టర్ల సాయంతో హాస్టళ్లలోని విద్యార్థులను బయటికి తరలించారు.

మరో మూడు రోజులూ భారీ వర్షాలు

వాయవ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లోని ఆవర్తన ప్రభావంతో దక్షిణ ఒడిశా, ఉత్తర ఏపీ తీరంలో అల్పపీడనం ఏర్పడిందని.. దాని ప్రభావంతో మరో మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా వానలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇక మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా సగటున 3.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వెల్లడించింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లా మంచిప్పలో 15.75, రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దలింగాపురంలో 15.35, జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో 15 సెంటీమీటర్ల వర్షం కురిసినట్టు తెలిపింది. మొత్తంగా ప్రస్తుత సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలోని 21 జిల్లాల్లో అత్యధికంగా, 12 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు వెల్లడించింది.

అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివీ.. (సెంటీమీటర్లలో)

జిల్లా	ప్రాంతం	వర్షపాతం
నిజామాబాద్	మంచిప్ప	15.75
రాజన్న సిరిసిల్ల	పెద్ద లింగాపురం	15.35
జగిత్యాల	మెట్‌పల్లి	15.08
నిజామాబాద్	గన్నారం	14.88
కామారెడ్డి	గాంధారి	14.45
నిజామాబాద్	డిచ్‌పల్లి	14.20
నిజామాబాద్	జక్రాన్‌పల్లి	13.85
నిజామాబాద్	చిమన్‌పల్లి	13.58
సంగారెడ్డి	కంగ్టి	13.20
నిర్మల్	ముధోల్	13.15
నిజామాబాద్	మదన్‌పల్లి	12.95
కరీంనగర్	ఆసిఫ్‌నగర్	12.85
నిజామాబాద్	గోపన్నపల్లి	12.40
రాజన్న సిరిసిల్ల	ఇల్లంతకుంట	12.08
కామారెడ్డి	సదాశివనగర్	12.08
జగిత్యాల	జగ్గాసాగర్	11.78
నిర్మల్	లింగాపూర్	11.73
కామారెడ్డి	జుక్కల్	11.70
పెద్దపల్లి	కానుకుల	11.68

కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లు: సీఎస్



మూడు రోజులపాటు భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని, అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని.. అగ్నిమాపక, పోలీసు బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సీఎస్ మంగళవారం కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే వివిధ జిల్లాల్లో చెరువులు, కుంటలు నిండి ఉన్నాయని.. వాటికి గండ్లు పడకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాగులు ఉధృతంగా ప్రవహించే కాజ్ వేలు, కల్వర్టులు, వంతెనల వద్ద ముందుజాగ్రత్త చర్యగా భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

వరద బాధితులను ఆదుకోండి

రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వినతి




సాక్షి, హైదరాబాద్: వరద బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సహాయ చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ''అల్పపీడన ద్రోణి ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల చాలా చోట్ల రోడ్లు ధ్వంసమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో పాటు పలుచోట్ల ఇళ్లు కూలి ఆస్తి నష్టం సంభవించింది. ఈ పరిస్థితుల్లో ఆయా ప్రాంతాల్లోని బీజేపీ కార్యకర్తలంతా ముంపు బాధిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలి'' అని విజ్ఞప్తి చేశారు. అలాగే వర్ష ప్రభావం తగ్గే వరకు అప్రమత్తంగా ఉంటూ.. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు.

విశ్వనగరం విలవిల: రేవంత్ ట్వీట్

వరద బాధితులను ఆదుకోవాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ విశ్వనగరం విలవిలలాడుతోందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. 'నువ్వు నిర్మించిన విశ్వనగరం జలవిలయంతో విలవిల్లాడుతోంది. పండుటాకులా వణికిపోతోంది. హైటెక్ హంగుల వీడియోలు, ఫొటోలు పెట్టి సోషల్ మీడియాలో భ్రమలు కల్పించే కేటీఆర్ ఇప్పుడెక్కడ? మనిషి కనిపించడం లేదు. మాట వినిపించడం లేదే!'అని మంగళవారం ట్విట్టర్‌లో రేవంత్ పోస్టు చేశారు. భారీవర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బాధితులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అండగా నిలవాలని రేవంత్ పిలుపునిచ్చారు. 'హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని ఇతర ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనండి. వరదల ప్రభావం తగ్గే వరకు బాధితులకు అవసరమైన నిత్యావసరాలను అందించండి'అని కోరారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, కొడంగల్, మానకొండూరు నియోజకవర్గాలకు చెందిన పలువురు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో విడుదలవుతున్న నీరు


శ్రీరాంసాగర్ నుంచి సీతమ్మసాగర్ దాకా నీటి విడుదల

ఎల్లంపల్లి దిగువన పోటెత్తుతున్న ప్రవాహం

పరీవాహక ప్రాంతాల్లో వానలతో మరింతగా పెరగనున్న వరద

గోదావరిపై గేట్లన్నీ ఓపెన్!

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: పరీవాహక ప్రాంతాల్లో వానలతో గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. ప్రాణహిత, ఇతర ఉపనదులు, వాగుల్లో ప్రవాహాలు పోటెత్తుతుండటంతో.. వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఎగువన శ్రీరాంసాగర్ నుంచి దిగువన సీతమ్మసాగర్ దాకా అన్ని ప్రాజెక్టుల గేట్లెత్తి నీటిని దిగువకు వదిలేస్తున్నారు. మంగళవారం రాత్రి 10గంటలకు శ్రీరాంసాగర్‌లోకి 64వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా.. 16 గేట్లు ఎత్తి 49వేల క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వ పూర్తిస్థాయిలో 90 టీఎంసీలుగా ఉంది. ఇక కడెం ప్రాజెక్టుకు వరద 11వేల క్యూసెక్కులకు తగ్గింది. ఒక గేటు ఎత్తి ఇదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లిలోకి భారీగా 2,92,817 క్యూసెక్కుల వరద చేరుతుండగా.. 30గేట్లు ఎత్తి 3,38,696 క్యూసెక్కులను వదులుతున్నారు. కాళేశ్వరంలో అంతర్భాగమైన పార్వతి (సుందిళ్ల) బ్యారేజీ నుంచి 3,55,000, సరస్వతి(అన్నారం) బ్యారేజీ నుంచి 2,07,746, మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ నుంచి 2,30,320, తుపాకుల గూడెం (సమ్మక్క) బ్యారేజీ నుంచి 2,24,890 క్యూసెక్కులు, దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బ్యారేజీ నుంచి 2,00,675 క్యూసెక్కులను విడిచిపెడుతున్నారు. గోదావరి ఉపనది మానేరుపై ఉన్న మిడ్‌మానేరు ప్రాజెక్టుకు 27వేల క్యూసెక్కులు, లోయర్ మానేరుకు 55 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండటంతో గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. మొత్తంగా బేసిన్ పరిధిలో వరుసగా మూడు రోజులు భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో బుధవారం సాయంత్రానికి గోదావరిలో వరద మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.


లోయర్ మానేరు గేట్ల నుంచి దిగువనకు వెళ్తున్న నీరు

మూసీ నుంచి నీటి విడుదల

హైదరాబాద్ నగరంతోపాటు ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలతో కృష్ణా ఉపనది మూసీలో ప్రవాహం పెరిగింది. ఎగువ నుంచి వరద వస్తుండటంతో.. అధికారులు ముందు జాగ్రత్తగా నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టు ఐదు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.

వర్షాలు.. ప్రమాదాలు..

నాలాలో కొట్టుకుపోయి బాలుడి మృతి

- ఆడుకుంటూ ఇంట్లోంచి బయటికి వచ్చిన మిథున్
- రోడ్డుపై వరదతో నాలా కనిపించక పడిపోయిన బాలుడు
- కిలోమీటర్ దూరంలోని తుర్కచెరువులో మృతదేహం లభ్యం

హైదరాబాద్ శివార్లలోని నిజాంపేట్ ఎన్నారై కాలనీలో ఘటన

భారీ వర్షాలతో ముంచెత్తిన వరద, పైకప్పు తెరిచి ఉన్న నాలా కలసి హైదరాబాద్‌లో మరో చిన్నారిని బలిగొన్నాయి. నాలుగేళ్ల బాలుడు నాలాలో పడి కొట్టుకుపోయి కన్నుమూశాడు. హైదరాబాద్ శివార్లలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్నారై కాలనీలో ఈ దారుణం చోటు చేసుకుంది. చిన్నారి మృతితో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

నిజాంపేట్/ ఆత్మకూర్ (ఎస్)

సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండలం మిడతనపల్లికి చెందిన శ్యామల సంతోష్‌రెడ్డి, దివ్య దంపతులు ఏడేళ్ల కింద హైదరాబాద్‌కు వలస వచ్చారు. సంతోష్‌రెడ్డి ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నారు. ఏడాది క్రితం నిజాంపేటలోని ఎన్నారై కాలనీ స్పెషియల్ గార్డెనియా అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ కొనుక్కుని అందులో నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో వారి కుమారుడు మిథున్‌రెడ్డి (4) ఆడుకుంటూ బయటికి వచ్చాడు. ఈ అపార్ట్‌మెంట్ ముందు నాలా (డ్రైనేజీ) ఉంది. భారీ వర్షంతో రోడ్డుపై వరద పారుతుండటంతో నీరు పోయేందుకు నాలాపై సిమెంట్ పైకప్పును పక్కకు తొలగించి పెట్టారు. ఇంట్లోంచి బయటికి వచ్చిన మిథున్‌రెడ్డి నీటిలో నడుచుకుంటూ వెళ్తూ.. నాలా ఉందని గుర్తించలేక అందులో పడి గల్లంతయ్యాడు. కాసేపటికి తల్లిదండ్రులు బయటికి వచ్చి కుమారుడి కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. చివరికి అపార్ట్‌మెంట్ సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా.. బాలుడు నాలాలో పడిపోయినట్టు గుర్తించారు.

కిలోమీటర్ దూరం కొట్టుకుపోయి..


మిథున్‌రెడ్డి (ఫైల్)

సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు వెంటనే గాలింపు చేపట్టారు. ఘటనా స్థలానికి కిలోమీటర్ దూరంలో ఉన్న నిజాంపేట తుర్కచెరువులోకి బాలుడు కొట్టుకుపోయినట్టు గుర్తించారు. గజ ఈతగాళ్లతో, డీఆర్ఎస్ బలగాల బోట్లతో సుమారు 7 గంటల పాటు వెతకగా.. సాయంత్రం బాలుడి మృతదేహం లభించింది. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే వివేకానంద పరామర్శించి, ఆదుకుంటామని ఓదార్చారు.


బాలుడు నాలాలో పడిపోతుండగా సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాలు

బైక్‌పై వరదను దాటబోయి..


సుధాకర్(ఫైల్)

జిన్నారం: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన కుమ్మరి సుధాకర్ (32) ఓ పని నిమిత్తం బైక్‌పై పక్కనే ఉన్న మంబాపూర్‌కు బయలుదేరాడు. భారీ వర్షాలతో మంబాపూర్‌లోని పటేల్ చెరువు అలుగు పారుతోంది. రహదారిపై వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. సుధాకర్ ఆ వరదలోంచే బైక్‌ను ముందుకు పోనిచ్చాడు. కానీ మధ్యలోకి వెళ్లేసరికి వరద ధాటికి పడిపోయి కొట్టుకుపోయాడు. ఇది గమనించిన స్థానికులు.. ఆయన కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, స్థానికులు కలసి నాలుగు గంటల పాటు గాలించగా.. సుమారు అర కిలోమీటర్ దూరంలో వాగుపక్కన చెట్టుకు చిక్కుకుని ఉన్న సుధాకర్ మృతదేహాన్ని గుర్తించారు.

పిడుగుపాటుకు ముగ్గురు బలి

పొలంలో కలుపుతీస్తూ రైతు మృతి

- వాన పడుతోందని చెట్టుకిందకి వెళ్లి ఇద్దరు కూలీలు మృత్యువాత
- మరికొందరికి తీవ్ర గాయాలు


రాజేశ్వర్‌రావు | సరిత | మమత

చిట్యాల/కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పిడుగుపాటు కారణంగా మంగళవారం ముగ్గురు మరణించారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. చిట్యాల మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన ఆరెపల్లి పెద్ద సమ్మయ్య అనే రైతు పొలంలో మిరపనారు నాటేందుకు ఆయన భార్య కొమురమ్మ, కుమారుడు కుమార్‌తోపాటు అదే కాలనీకి చెందిన కూలీలు పర్లపెల్లి భద్రమ్మ, మైదం ఉమ, చిలువేరు సరిత, నేర్పాటి మమత వెళ్లారు. మధ్యాహ్నం వాన మొదలు కావడంతో నలుగురు కూలీలు భద్రమ్మ, ఉమ, సరిత, మమత సమీపంలోని వేపచెట్టు కిందికి వెళ్లి నిలబడ్డారు. వారిపై ఒక్కసారిగా భారీ శబ్దంతో పిడుగు పడింది. దీనితో సరిత (35), మమత (32) ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఉమ, భద్రమ్మతోపాటు కొంతదూరంలో ఉన్న సమ్మయ్య, కొమురమ్మ, కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇక కాటారం మండలం దామెరకుంటలో పొలంలో కలుపుతీస్తున్న రైతు గూడూరి రాజేశ్వరరావు (46) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సమీపంలో ఉన్న ఆయన భార్య సునీతకు గాయాలయ్యాయి.

'వరద సహాయక పనుల్లో పాల్గొనండి'

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహాయ చర్యల్లో పాల్గొనాలని పార్టీ కేడర్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సూచించారు. అలాగే వరద ముంపు ప్రాంతాల్లో శాశ్వత చర్యలు చేపట్టాలని మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విన్నవించారు. భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తమ్మినేని సూచించారు. చెరువులు, నాలాలు, కబ్జాలకు గురికావడం, వీటిపై ప్రభుత్వానికి దీర్ఘకాలిక దృష్టి లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపించారు.

సకాలంలో జీతం రావట్లేదంటూ హోంగార్డు ఆత్మహత్యాయత్నం

- ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్న రవీందర్
- 55 శాతం కాలిన గాయాలు.. ఉస్మానియాకు తరలించిన పోలీసులు


ఎం.రవీందర్

అబిడ్స్: సకాలంలో జీతం రావట్లేదనే ఆవేదనతో ఓ పోలీసు హోంగార్డు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హైదరాబాద్‌లోని షాహినాయత్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... పాతబస్తీ ఉప్పుగూడకు చెందిన రవీందర్ చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పీఎస్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం గోషామహల్‌లోని ఓ ఏటీఎంకు వెళ్లి తన బ్యాంకు ఖాతాను చూసుకోగా ఇంకా జీతం పడలేదు. వెంటనే గోషామహల్‌లోనే ఉన్న హోంగార్డు కమాండెంట్ కార్యాలయానికి వెళ్లి అక్కడి సిబ్బందితో తన జీతం గురించి వాకబు చేశాడు. చెక్కులు సిద్ధంగా ఉన్నాయని, ఒకట్రెండు రోజుల్లో బ్యాంకు ఖాతాల్లో జీతం డబ్బులు జమ అవుతాయని వారు బదులిచ్చారు. అయినప్పటికీ ఆవేదనకు గురైన రవీందర్ సీసాలో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ సమాచారం అందుకున్న గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగం రవీందర్, ఎస్ఐ లక్ష్మయ్యలు వెంటనే అతన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అతనికి దాదాపు 55 శాతం కాలిన గాయాలైనట్లు వైద్యులు తేల్చారు. ఈ కేసును షాహినాయత్‌గంజ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేయండి

అసెంబ్లీ కార్యదర్శితో డీకే అరుణ భేటీ



సాక్షి, హైదరాబాద్: తనను గద్వాల ఎమ్మెల్యేగా గుర్తించాలంటూ మాజీ మంత్రి డీకే అరుణ మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గెజిట్ జారీ చేయాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆర్డర్ కాపీని ఆమె అసెంబ్లీ కార్యదర్శికి అందజేశారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలంటూ ఇటీవల రాష్ట్ర హైకోర్టు తీర్పును వెలువరించిన నేపథ్యంలో సంబంధిత ఉత్తర్వులను కేంద్ర ఎన్నికల సంఘానికి, అసెంబ్లీ కార్యదర్శికి ఆమె ఇదివరకే అందజే సిన విషయం తెలిసిందే. కాగా, ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం కోసం ఏర్పాటు చేయాల్సిందిగా కోరానని, స్పీకర్ అందుబాటులో లేకపోవడంతో స్పీకర్ కార్యాలయంలో కూడా ఈ కాపీని అందజేసినట్లు డీకే అరుణ వెల్లడించారు.

సుప్రీంలో విచారణ జరిగే వరకు ఆపండి: బండ్ల

తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటిస్తూ రాష్ట్ర హైకోర్టు వెలువరించిన తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేసినట్లు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. సుప్రీంకోర్టులో తాను దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 11న విచారణ జరుగుతుందని, అప్పటి వరకు తదుపరి చర్యలు నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి రాసిన లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు.

బీజేపీ పతనానికి కౌంట్‌డౌన్ మొదలైంది

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



సాక్షి, హైదరాబాద్: బీజేపీకి ఇండియా కూటమి అంటేనే వణుకుపుట్టిందని అందుకే ఇండియా పేరును భారత్‌గా మార్చుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పేర్కొన్నారు. రాజ్యాంగంలో ఎప్పట్నుంచో ఇండియాగా చెప్పుకుంటున్నామని, ఇప్పుడు అత్యవసరంగా ఈ చర్చ ఎందుకు తీసు కొచ్చారో చెప్పాలని మంగళవారం ఓ ప్రకటనలో నిలదీశారు. అందుకోసం ప్రత్యేక సమావేశాలు పెట్టాలనుకో వడంలోనే బీజేపీ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు.

బిగ్‌బాస్ షోను నిషేధించాలి

యువతను చెడుమార్గంలోకి నెట్టేలా ఉన్న బిగ్‌బాస్ షోను వెంటనే నిషేధించాలని నారాయణ సుప్రీంకోర్టుకు విన్నవించారు. బిగ్‌బాస్ అసాంఘిక కార్యక్రమమని దీనివల్ల సమాజంలో నైతిక విలువలు అడుగంటుతాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు దీన్ని సుమోటోగా తీసుకోవాలని కోరారు.

నియంత పాలనలో గురువులకు గౌరవం లేదు

వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: దొర నియంత పాలనలో చదువు చెప్పే గురువులకు గౌరవం లేదని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. సీఎం కేసీఆర్ అనాలోచిత నిర్ణయాలతో 9 మంది ఉపాధ్యాయులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. మంగళవారం ట్విట్టర్ వేదికగా భావితరాల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్న గురువులందరికీ ఆమె ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 317 జీవో తెచ్చి 5 వేల మందిని సొంత జిల్లాలకు దూరం చేశారని షర్మిల మండిపడ్డారు. సీనియర్లు, జూనియర్లు అంటూ ఉపాధ్యాయుల మధ్య చిచ్చు పెట్టారన్నారు. స్పౌజ్ బదిలీలు పూర్తి చేయకుండా 1,600 కుటుంబాలను విడదీశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. 22 వేల పోస్టులు ఖాళీగా ఉంటే 5 వేలతో నోటిఫికేషన్ వేసి చేతులు దులుపుకున్నారని షర్మిల ధ్వజమెత్తారు.

సీఎంకు పోటీగా 1,016 నామినేషన్లు వేస్తాం

లబానా లంబాడాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్



కామారెడ్డి టౌన్: లబానా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చకపోతే యుద్ధానికి సిద్ధమవుతామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్ అన్నారు. మంగళవారం కామారెడ్డిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు మంత్రులు, ఎమ్మెల్యేలు దీనిపై స్పందించడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన చెల్లప్ప కమిషన్‌కు విలువ లేదా అని ప్రశ్నించారు. తమ డిమాండ్లు పరిష్కరించకపోతే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని 9 నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గంలో 116 చొప్పున నామినేషన్లు వేస్తామని చెప్పారు. సీఎం పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో మాత్రం 1,016 నామినేషన్లు వేస్తామన్నారు. త్వరలో కామారెడ్డిలో 25 వేల మందితో ఏక్తా ర్యాలీ నిర్వహిస్తామని, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే తమకు 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్బీ స్టేడియం లేదా ఓఆర్ఆర్ సమీపంలో

పరేడ్‌గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ సభకు అనుమతి నిరాకరణ నేపథ్యంలో ప్రత్యామ్నాయాల పరిశీలన

- సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణ కోసం కమిటీలు
- గాంధీభవన్‌లో సమావేశమైన మురళీధరన్, సునీల్ కనుగోలు, ఠాక్రే, రేవంత్, మధుయాష్కీ
- నేడు బీసీ డిక్లరేషన్ కమిటీ భేటీ
- స్క్రీనింగ్ కమిటీ భేటీ కూడా..
- కేసీ వేణుగోపాల్ రాక



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల నిర్వహణకు ఈ నెల 17న పరేడ్‌గ్రౌండ్స్‌లో అనుమతి లభించదనే అంచనాలతో కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోంది. పరేడ్‌గ్రౌండ్స్‌లో సభ నిర్వహణకు అనుమతివ్వాలని ఈనెల 2వ తేదీనే దరఖాస్తు చేసినప్పటికీ బీజేపీ నేతలు అమిత్‌షా సభ పేరుతో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఈ నేపథ్యంలోనే ఎల్బీ స్టేడియం లేదంటే ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) పరిసరాల్లోని ఖాళీ స్థలం ఎంచుకుని అక్కడ సభ నిర్వహిస్తామని ఆ పార్టీ నేతలు చెపుతున్నారు. తెలంగాణ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోనియాగాంధీ చేత ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను ప్రకటించాలనే వ్యూహంతో పరేడ్‌గ్రౌండ్స్‌లో సభ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. కానీ, అక్కడ ఇప్పటివరకు అనుమతి లభించని కారణంగా మరో స్థలం వెతికే పనిలో కాంగ్రెస్ నేతలు పడ్డారు. సభ ఎక్కడ నిర్వహిస్తారన్న దానిపై నేడు స్పష్టత వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీడబ్ల్యూసీకి సిద్ధం

మరోవైపు, ఈనెల 16,17 తేదీల్లో హైదరాబాద్ వేదికగా సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఇందుకోసం టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి పార్టీ నేతలకు దిశానిర్దేశం కూడా చేసింది. ఈ సమావేశాల నిర్వహణ కోసం ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని కూడా టీపీసీసీ నిర్ణయించింది. గతంలో తిరుపతిలో నిర్వహించిన ప్లీనరీ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సీడబ్ల్యూసీ సమావేశాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు గాను పకడ్బందీగా ముందుకెళుతోంది. ఇందుకోసం మంగళవారం సాయంత్రం గాంధీభవన్‌లో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్, పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు, ఇన్‌చార్జి ఠాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్, రాష్ట్ర నాయకులు మధుయాష్కీ, మహేశ్‌కుమార్‌గౌడ్‌లతో పాటు ఏఐసీసీ కార్యదర్శులు హాజరయ్యారు. కాగా, ఈ సమావేశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించేందుకు ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ బుధవారం హైదరాబాద్‌కు రానున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమై సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణకు సర్వం సిద్ధం చేయనున్నారు.

నేడు కీలక భేటీ

ఇక, టికెట్ల ఖరారులో భాగంగా రాష్ట్రస్థాయిలో జరిగే కసరత్తుకు నేడు తెరపడనుంది. బుధవారం గాంధీభవన్ వేదికగా పార్టీ స్క్రీనింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి కమిటీ చైర్మన్ మురళీధరన్‌తో పాటు సభ్యులు సిద్ధిఖీ, మేవానీ, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు హాజరు కానున్నారు. వీరంతా సమావేశమై పీఈసీ సమావేశంలో వచ్చిన నివేదికలను పరిశీలించి రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన అభ్యర్థుల తుది జాబితాను ఢిల్లీకి పంపనున్నారు. అయితే, స్క్రీనింగ్ కమిటీ సమావేశం ముగిసిన వెంటనే ఈ జాబితాను కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)కి ఈనెల 7వ తేదీనే పంపనున్నట్టు తెలుస్తోంది. అనంతరం సీఈసీ సమావేశమై అధికారికంగా అభ్యర్థుల జాబితాను ఖరారు చేయనుంది. మొత్తంమీద గత 20 రోజులుగా పార్టీ అభ్యర్థిత్వాల కోసం జరుగుతున్న కాంగ్రెస్ కసరత్తు బుధవారం నాటితో రాష్ట్ర స్థాయిలో ముగియనుంది. మరోవైపు బీసీ డిక్లరేషన్ కమిటీ సమావేశం కూడా నేడు జరగనుంది. ఉదయం 10:30 గంటలకు గాంధీభవన్‌లో జరగనున్న ఈ సమావేశంలో బీసీ డిక్లరేషన్‌లో పొందుపర్చాల్సిన హామీలను ఖరారు చేయనున్నారు.

సీడబ్ల్యూసీ భేటీలపై దేశం చూపు రాష్ట్రం వైపు

- 16, 17 తేదీల్లో జరిగే ఈ సమావేశాలను విజయవంతం చేద్దాం
- టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో టీపీసీసీ చీఫ్ రేవంత్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో వీహెచ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, జానారెడ్డి, ఠాక్రే, దామోదర రాజనర్సింహ, షబ్బీర్ అలీ

సాక్షి, హైదరాబాద్: దేశ రాజకీయాల్లో పరిణామాలు వేగంగా మారుతున్నాయని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించనుండటంతో దేశమంతా తెలంగాణవైపు చూస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు, కేడర్ అంతా సమష్టిగా నిలబడి ఈ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 16, 17 తేదీల్లో సీడబ్ల్యూసీ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన టీపీసీసీ విస్తృతస్థాయిలో రేవంత్ మాట్లాడారు. 17న నిర్వహించే బహిరంగ సభలో సోనియాగాంధీ ఐదు గ్యారెంటీ కార్డు స్కీంలను ప్రకటిస్తారని, ఈ సభ ద్వారా తెలంగాణ కాంగ్రెస్ దేశానికి గొప్ప సందేశాన్ని ఇవ్వబోతోందన్నారు.

బీఆర్ఎస్ వైఫల్యాలపై ప్రజల్లోకి జాతీయ నేతలు: ఈ నెల 18న రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఐదు గ్యారంటీ కార్డు స్కీంలను, గత తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజెప్పేందుకు 119 మంది జాతీయ స్థాయి నేతలు అన్ని నియోజకవర్గాలకు వస్తారని రేవంత్ వివరించారు. అదేవిధంగా భారత్‌జోడో యాత్ర ప్రారంభమై ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 7న భారత్‌జోడో యాత్ర సమ్మేళనాల పేరుతో మండల, జిల్లా కేంద్రాల్లో పాదయాత్రలు నిర్వహించి ఉత్సవాలు జరపాలని కోరారు. కాంగ్రెస్ అధిష్టానానికి తెలంగాణ నేతలపై ప్రత్యేక నమ్మకం ఉందని, అందుకే జాతీయ స్థాయిలో మూడు పదవులు ఇచ్చారని, ఇందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు చెబుతున్నానని రేవంత్ తెలిపారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడుతూ సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఈ భేటీలో సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ, ముఖ్య నేతలు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, జానారెడ్డి, మధుయాష్కీ గౌడ్, షబ్బీర్ అలీ, జగ్గారెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, మహేశ్‌కుమార్‌గౌడ్, అజహరుద్దీన్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజూ అదేజోరు

- బీజేపీ టికెట్‌ల కోసం ఆశావహుల దరఖాస్తులు
- తొలిరోజు 182 .. మంగళవారం 178
- 8 ,9, 10 తేదీల్లో ముఖ్య నేతల దరఖాస్తులు!



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీకి పోటీ చేయాలనుకునే బీజేపీ ఆశావహుల నుంచి పార్టీకి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ తొలిరోజున సోమవారం 182 దరఖాస్తులు అందగా, రెండోరోజు మంగళవారం మరో 178 అందినట్టు పార్టీవర్గాల సమాచారం. ముహూర్తాలు, మంచిరోజు చూసుకునే వారికి మంగళవారం అంత మంచిరోజు కాదనే అభిప్రాయం ఉంటుంది. అయితే మంగళవారం కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవడం విశేషం. సిరిసిల్ల నుంచి మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం, మహేశ్వరం నుంచి బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కొలన్ శంకర్‌రెడ్డి, కార్వాన్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గొట్టాల ఉమారాణి తదితరులు దరఖాస్తు చేసిన వారిలో ఉన్నారు. ఈ నెల 10 దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ కావడంతో రాబోయే రోజుల్లో ఆశావహుల తాకిడి మరింత పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ నెల 8, 9, 10 తేదీల్లో మంచిరోజులు ఉండడంతో, పార్టీ ముఖ్య నేతలతో పాటు ఇతరులు కూడా ఈ మూడురోజుల్లోనే ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు సమర్పించే అవకాశాలున్నట్టు చెబుతున్నారు.

క్రిమినల్ రికార్డ్ కోసం ఓ పేజీ

దరఖాస్తులో ఆశావహులు తమపై ఉన్న క్రిమినల్ కేసులు, శిక్షలు పడిన కేసుల వివరాలు, వాటి సంపూర్ణ సమాచారం వెల్లడించాలనే నిబంధన పెట్టారు. మూడు పేజీల దరఖాస్తు పత్రంలో రెండు పేజీలు వ్యక్తిగత సమాచారం, ఇతర వివరాల కోసం కేటాయించగా పూర్తిగా ఒక పేజీ క్రిమినల్ కేసుల సంబంధిత వివరాల కోసం కేటాయించారు. క్రిమినల్ కేసులున్నట్లైతే ఎఫ్ఐఆర్, పోలీస్‌స్టేషన్ చిరునామా, ఫోన్ నంబర్లు, కేసు వివరాలు, ఏయే సెక్షన్ల కింద ఏయే అభియోగాలు మోపారు, వాటిపై అప్పీలుకు వెళ్లారా లేదా? కోర్టు పరంగా ఏవైనా ప్రొసీడింగ్స్ ఉంటే వాటిపై పిటిషన్లు దాఖలు చేశారా? తదితర వివరాలన్నీ తెలియజేయాలని సూచించారు. ఏవైనా కేసుల్లో శిక్ష పడితే వాటి వివరాలు..ఏకోర్టులో, ఏ సెక్షన్ కింద పడింది? అనే వివరాలతో పాటు నమోదైన నేరానికి సంబంధించి క్లుప్తంగా సమాచారం. శిక్ష వేస్తూ వెలువడిన ఉత్తర్వులు, తదితర వివరాలను తెలియజేయాలని పేర్కొన్నారు.

17న పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవం

గత ఏడాది మాదిరిగానే కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహణ

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి
- సమరయోధులు, అమరుల స్మరణకు ప్రత్యేక కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని రాష్ట్రంలో జరుపుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నామని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రస్తుత సర్కార్‌తో పాటు గత ప్రభుత్వాలు విమోచన దినోత్సవాలు అధికారికంగా నిర్వహిస్తామని చెప్పి.. మజ్లిస్ పార్టీని సంతృప్తి పరిచేందుకు ఈ కార్యక్రమాన్ని విస్మరించాయని విమర్శించారు. అయితే కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గతేడాది సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అధికారికంగా విమోచన ఉత్సవాలు నిర్వహించామని, ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరయ్యారని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా పరేడ్ గ్రౌండ్స్‌లోనే కేంద్రం తరఫున ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. మంగళవారం ఆయన 'మేరీ మాటీ మేరా దేశ్'లో భాగంగా 'మనమట్టికి నమస్సులు, మన వీరులకు వందనం' నినాదంతో స్వాతంత్ర్య సమరయోధులు, దేశం కోసం త్యాగాలు చేసిన వారి స్మరణకు చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను గురించి వివరించారు. దేశవ్యాప్తంగా ప్రజలను మరోసారి ఏకతాటి పైకి తెచ్చేందుకు 'నేను పుట్టిన నేల, నన్ను కన్న దేశం' పేరుతో సెప్టెంబర్ 1న కార్యక్రమం ప్రారంభమైందని చెప్పారు. గ్రామస్తులంతా ఇంటినుంచి పిడికెడు మట్టి కానీ, పిడికెడు బియ్యాన్ని కానీ కలశంలో సేకరించేలా ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.



రైతు మోర్చా కార్యక్రమానికి ఎడ్ల బండిపై వస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో బూర నర్సయ్యగౌడ్

7,500 కలశాల ద్వారా ఢిల్లీకి మట్టి

ఈ నెలలో అన్ని గ్రామాల నుంచి పవిత్రమైన మట్టిని సేకరించి, మండల కేంద్రాల్లో దాన్ని గౌరవించి, తర్వాత జిల్లా కేంద్రానికి, అక్కడి నుంచి రాష్ట్ర రాజధానికి చేర్చడం జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్‌లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. చివర్లో ఢిల్లీలోని అమృత్ పార్క్ (అమృత వనం)లో 75 వేల మొక్కలు నాటి సుమారు 7,500 కలశాల ద్వారా తెచ్చిన మట్టిని కర్తవ్యపథ్‌లోని వార్ మెమోరియల్ పక్కనున్న స్థలంలో పెడతామని, అక్కడ అమరవీరుల స్మారక వనాన్ని ఏర్పాటు చేస్తామని కిషన్‌రెడ్డి వివరించారు.

భూములు లాక్కొనేందుకే ధరణి

ఇబ్రహీంపట్నం రూరల్: రైతులు, అమాయకుల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు భూములు లాక్కొనేందుకే ధరణి ఉపయోగపడుతోందని, దీనివల్ల రైతులకు ఒరిగిందేమీ లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్లలో మంగళవారం నిర్వహించిన బీజేపీ రైతు మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి.. బీఆర్ఎస్‌కు భరణిగా మారిందని ఎద్దేవా చేశారు. రైతును రాజును చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి.. తెలంగాణ వచ్చిన తర్వాత ఆత్మహత్యలు చేసుకున్న 7 వేల మంది రైతుల కుటుంబాలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. సమావేశంలో కిసాన్ మోర్చా జాతీయ అధ్యక్షుడు శంభూజీ కుమార్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వుడు నియోజకవర్గాల్లో పరిస్థితేంటి?

- కొత్తగా పార్టీలో చేరుతున్న నేతల వల్ల ప్రయోజనముందా?
- రాష్ట్ర ప్రజల మూడ్ ఎలా ఉంది?
- రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు స్క్రీనింగ్ కమిటీ ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ వరుసగా రెండోరోజూ పార్టీ రాష్ట్ర నేతలతో భేటీ అయ్యింది. కమిటీ చైర్మన్ మురళీధరన్, సభ్యుడు సిద్ధిఖీలు మాజీ మంత్రులు, ఎంపీలతో బుధవారం గాంధీభవన్‌లో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాల్లో పరిస్థితేంటి? కొత్తగా పార్టీలో చేరుతున్న నేతల వల్ల ప్రయోజనముందా? రాష్ట్ర ప్రజల మూడ్ ఎలా ఉంది? అన్న అంశాలపై కమిటీ.. రాష్ట్ర నాయకత్వం నుంచి ఈ మేరకు ఫీడ్‌బ్యాక్ తీసుకుంది.

తెలంగాణలోనే ఎందుకిలా?

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు, పార్టీ టికెట్ ఇచ్చి ప్రోత్సహించిన వారూ బీఆర్ఎస్, ఇతర పార్టీల్లోకి వెళ్లిపోతున్న విషయం భేటీల్లో చర్చకు వచ్చిందని సమాచారం. కాగా మురళీధరన్ స్పందిస్తూ.. 'తెలంగాణలోనే ఎందుకిలా జరుగుతోంది? ఇందుకు పరిష్కారం ఏంటో మీరే మాకు చెప్పాలి..' అని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. దీంతో ఓ నాయకుడు బదులిస్తూ పార్టీ విధేయులకు మాత్రమే ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. ఇందుకు స్పందించిన మురళీధరన్.. పార్టీకి విధేయులుగా ఉన్న వారికి ఈసారి టికెట్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. కమిటీతో భేటీ అయిన వారిలో మాజీ మంత్రులు జానారెడ్డి, వినోద్, పుష్పలీల, ప్రసాద్, దామోదర్‌రెడ్డి, చిన్నారెడ్డిలతో పాటు మాజీ ఎంపీలు మల్లు రవి, పొన్నం ప్రభాకర్, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి తదితరులున్నారు. మాజీ మంత్రులు, ఎంపీలతో సమావేశంలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాలు, అభ్యర్థుల ఎంపిక ప్రాతిపదికలు, సామాజిక సమతుల్యత కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించినట్టు తెలుస్తోంది.

మీరు పోటీ చేసినప్పుడు నేను పరిశీలకుడిని: మల్లు రవి

మురళీధరన్ కేరళలో ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో ఆయన నియోజకవర్గానికే మల్లురవి పరిశీలకుడిగా వెళ్లారు. మురళీధరన్‌తో భేటీ సందర్భంగా ఈ విషయాన్ని మల్లురవి గుర్తు చేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు వినోద్‌రెడ్డి, తదితరులు కూడా మురళీధరన్‌తో, ఆయన కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు.

దేశం పేరు 'భారత్'గా మార్చాలి: శివసేన

సాక్షి, హైదరాబాద్: భారత దేశానికి 'ఇండియా' అనే ఆంగ్ల పేరు అక్కర్లేదని, 'భారత్'గా మాత్రమే కొనసాగాల్సిన అవసరం ఉందని శివసేన రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ స్పష్టం చేశారు. భారత్ పేరును వ్యతిరేకించాల్సిన అవసరం దేశంలోని ప్రతిపక్ష 'ఇండియా' కూటమి పార్టీలకు ఎందుకు వచ్చిందని ఒక ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' పేరుతోనే దేశం మొత్తం తిరిగినప్పుడు.. 'భారత్'ను అధికారికంగా ప్రకటిస్తే వ్యతిరేకించడమెందుకని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 ద్వారా దేశానికి భారత్, ఇండియా పేర్లు ఉన్నాయని, సనాతన భారత్‌కు ఇండియా పేరు అవసరం లేదన్నారు.

మహిళా బిల్లు కోసం ఒత్తిడి తేవాలి

- పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఆమోదింపజేయాలి
- వివిధ రాజకీయ పార్టీలకు కవిత లేఖ



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 18 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపచేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. మహిళా బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంటులో ప్రాతినిధ్యం కలిగిన 47 రాజకీయ పార్టీల అధ్యక్షులతో పాటు దేశంలోని ఇతర పార్టీల నేతలకు కవిత మంగళవారం లేఖ రాశారు. రాజకీయాలకతీతంగా మహిళా బిల్లు కోసం అన్ని పార్టీలు మద్దతు ఇచ్చి ఆమోదించేలా చొరవ తీసుకోవాలని కోరారు. దేశ జనాభాలో మహిళలు 50% ఉన్నా చట్టసభల్లో మాత్రం సరైన ప్రాతినిధ్యం లేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో ఇప్పటికే దాదాపు 14 లక్షల మంది మహిళలు క్రియాశీలక ప్రజా జీవితంలో ఉన్నారని గుర్తుచేశారు. లింగ సమానత్వం కోసం చారిత్రక నిర్ణయం తీసుకోవాలని రాజకీయ పార్టీలకు ఆమె పిలుపునిచ్చారు.

రాజకీయ పార్టీలకు లేఖలు

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎంలు వైఎస్ జగన్, ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీ, కేజ్రీవాల్, నితీశ్‌కుమార్, నవీన్ పట్నాయక్, హేమంత్ సోరెన్, ఏక్‌నాథ్ షిండేతో పాటు మాయావతి, శరద్ పవార్, అఖిలేశ్ యాదవ్, సీతారాం ఏచూరి, చంద్రబాబు, వైఎస్ షర్మిల, చంద్రశేఖర్ ఆజాద్, పవన్ కల్యాణ్, లాలూ ప్రసాద్ యాదవ్, అర్వింద్ దేవేగౌడ, ప్రకాశ్ అంబేడ్కర్‌కు కవిత లేఖలు రాశారు.

రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదు

- కిషన్‌రెడ్డి బీజేపీ సారథి అంటేనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని తేలిపోయింది
- బీజేపీ నాయకత్వంపై మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ధ్వజం



పంజగుట్ట(హైదరాబాద్): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాదని, ఆ విషయం ఆ పార్టీ నేతలకు కూడా తెలుసని, కానీ కార్యకర్తలను మాత్రం మభ్యపెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కిషన్‌రెడ్డి బీజేపీ సారథి అంటేనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని తేలిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈటల రాజేందర్ సహా ఉద్యమకారులందరూ కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరిపిన వాళ్లేనని ఆరోపించారు. ఇటీవల బీజేపీ నుంచి సస్పెన్షన్‌కి గురైన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వాలు అర్ధరాత్రి జీవోలు తీసుకువచ్చినట్లుగా తనపై బీజేపీ నేతలు అర్ధరాత్రి సస్పెన్షన్ విధించారని ఆ పార్టీ నాయకత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో బీజేపీ ఓటింగ్ 22శాతం ఉందని, ఆయన్ను మార్చి ఎవరైనా ఉద్యమకారునికి పదవి ఇస్తారనుకుంటే కిషన్‌రెడ్డికి ఇవ్వడంతోనే పార్టీ ఆంతర్యం అర్థమైందన్నారు. కిషన్‌రెడ్డికి తిరిగి అధ్యక్షపదవి ఇవ్వడం చూస్తుంటేనే బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అని తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ నాయకులు సంప్రదింపులు జరుపుతున్నారని, త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని యెన్నం తెలిపారు. సీఎం కేసీఆర్ అనవసర ప్రాజెక్టులు కట్టి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తుంటే, పక్క రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యకు ఎంతో ఖర్చుచేస్తున్నారని ప్రశంసించారు. అక్కడ వైఎస్ జగన్ విద్యకు ఇస్తున్న ప్రాధాన్యంలో ఇక్కడ ఒక్క శాతం కూడా ఇవ్వలేకపోతున్నామని వ్యాఖ్యానించారు.

సెప్టెంబర్ 17 @ పరేడ్ గ్రౌండ్ పంచాయితీ

- అక్కడ బహిరంగసభ నిర్వహణకు కాంగ్రెస్ సన్నాహాలు
- ఈలోగా అదే గ్రౌండ్‌లో విమోచన దినోత్సవమంటూ కిషన్‌రెడ్డి ప్రకటన

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 17 చుట్టూ పరేడ్ గ్రౌండ్ పంచాయితీ సాగుతోంది. 17న హైదరాబాద్ స్టేట్ విమోచన దినోత్సవాన్ని నిర్వహించే విషయంలో ప్రధాన పార్టీలు పోటీ పడుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలకు కీలకంగా మారిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు...ఈ కార్యక్రమ నిర్వహణను అన్ని పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ నెలలో 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ సమావేశాల నేపథ్యంలో...17న పరేడ్‌గ్రౌండ్స్‌లో కాంగ్రెస్ పార్టీ బహిరంగసభ నిర్వహించాలని భావించింది. ఈ మేరకు బహిరంగసభకు పరేడ్ గ్రౌండ్స్‌ను కేటాయించాలంటూ టీపీసీసీ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ అధికారులకు లేఖ కూడా ఇచ్చారు. ఈ సభ నిర్వహణ ఏర్పాట్ల పరిశీలనకు పార్టీ ముఖ్యనేతలు పరేడ్‌గ్రౌండ్స్‌కు సైతం వెళ్లివచ్చారు. ఇదిలా ఉంటే... కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలకు తెరదించుతూ ఈ ఏడాది కూడా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం ప్రకటించారు. గతేడాది ఈ కార్యక్రమానికి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ముఖ్య అతిథిగా పాల్గొని, పోలీసు, సైనిక బలగాల వందనం స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మాత్రం కేంద్రం తరఫున ఎవరు పాల్గొంటారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్రమే విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించే పక్షంలో..ప్రత్యామ్నాయ వేదికలను కూడా కాంగ్రెస్ పరిశీలిస్తోంది.

ఇక రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17న ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ స్టేట్ విలీనమైన నేపథ్యాన్ని పురస్కరించుకుని జాతీయ సమైక్యతా దినోత్సవం పేరిట గతేడాది ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రభుత్వమే ఉత్సవాలను నిర్వహించే అవకాశాలున్నాయి.



ఒక తప్పును గుర్తుపెట్టుకోవడమంటే,
అది మనసు మీద బరువును మోయడం లాంటిది.
– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 6 సెప్టెంబర్ 2023

ఆదిత్య హృదయం

రెండు వారాల్లో రెండు ప్రయోగాలు! ఒకటి చంద్రుడి పైకి... మరొకటి సూర్యుడి గురించి! భారత శాస్త్రవేత్తలు మన అంతరిక్ష ఆకాంక్షలను మరింత ఉన్నత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. ఆగస్ట్ 23న చంద్రయాన్–3 ప్రయోగంతో ఇప్పటిదాకా పరిశోధనల్లో అసూర్యంపశ్యగా మిగిలిపోయిన చంద్రుడి దక్షిణ ధ్రువప్రాంతంపైకి భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఉపగ్రహాన్ని పంపడం, రోబోటిక్ ల్యాండర్ విక్రమ్– రోవర్ ప్రజ్ఞాన్‌లు చంద్రునిపై సుతిమెత్తగా దిగడం, వాటిలో పరికరాలు పంపుతున్న అపూర్వడేటా దేశ కీర్తిప్రతిష్ఠల్ని పెంచాయి. ఆ విజయ పరంపర సాగుతుండగానే, భూమికి అతి సమీప నక్షత్రం సూర్యుడి అధ్యయనానికి భారత్ తొలిసారి ఉపగ్రహాన్ని పంపడం విశేషం.

చంద్రయాన్–3తో పోలిస్తే, 'ఆదిత్య– ఎల్1' ప్రయోగంలో నాటకీయత తక్కువే. కానీ, సెప్టెంబర్ 2న సక్సెసైన ఈ సౌరశోధనా ఉపగ్రహ ప్రయోగం మరో 4 నెలల్లో కీలకమైన భౌమ– సౌర లాగ్రేంజ్ పాయింట్1 (ఎల్1)కు సురక్షితంగా చేరగలిగితే, ఎన్నో సౌర రహస్యాలు బయటకొస్తాయి. ఇప్పటికే చంద్రునిపై ఆక్సిజన్ జాడ సహా అనేకం కనుగొని, చంద్ర మండలం ఊహిస్తున్న దాని కన్నా ఎక్కువగానే ఆవాసయోగ్యమని మనం తేల్చాం. రేపటి శోధనలో ఆదిత్య హృదయం ఏం వెల్లడిస్తుందో ఆసక్తికరమే. దేశంలోని మరో ఆరు సంస్థల భాగస్వామ్యంతో ఇస్రో చేస్తున్న ఈ రోదసీ గవేషణతో సౌర వర్తన, అంతరిక్ష వాతావరణం, వైపరీత్యాల నుంచి మన అంతరిక్ష ఆస్తుల సంరక్షణ వగైరాలపై లోతైన అవగాహన కలగవచ్చు. అంతరిక్ష పరిశోధనలో అంతకంతకూ భారత్ ముందడుగులు వేస్తున్నదనడానికి ఇది మరో కొండగుర్తు.

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా', అలాగే యూరోపియన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఈసా'లు సూర్యుడి గురించి ఇప్పటికే 20కి పైగా శాస్త్రీయ అంతరిక్ష ప్రయోగాలు జరిపాయి. అమెరికా, యూకేల సాయంతో జపాన్ సైతం తన పరిశోధక ఉపగ్రహాన్ని 2006లో ప్రయోగించింది. అయితే, మన ఇస్రో మాత్రం 'చంద్రయాన్' లాగానే ఈ సూర్య మండల గవేషణలోనూ తనవైన ప్రత్యేక ఆవిష్కరణలు చేయాలని నడుం బిగించింది. ముఖ్యంగా సూర్య గోళానికి వెలుపల విస్తరించి ఉండే కాంతివలయమూ, సౌర వాతావరణానికి పైభాగమైన (కరోనా); సూర్యునిలో భాగమైన వెలుగులు విరజిమ్మే ప్రకాశమండలం (ఫోటోస్ఫియర్); ఆ చుట్టూ వ్యాపించే, సౌర వాతావరణానికి దిగువ ప్రాంతమైన వర్ణమండలం (క్రోమోస్ఫియర్); సౌర పవనాలు – వీటన్నిటిపైనా దృష్టి సారించాలని రంగంలోకి దిగింది. 'ఆదిత్య ఎల్1'లోని శాస్త్రీయ పరికరాల ద్వారా సౌర విద్యుదయస్కాంత క్షేత్రాలనూ, వెలువడే కణ ఉద్గారాలనూ లెక్కించాలని ప్రణాళిక వేసుకుంది. తద్వారా సూర్యుడి ప్రవర్తన గురించి కొత్త అంశాలను వెలికి తీసుకురావాలనేది ప్రధాన లక్ష్యం.

చంద్రయాన్ ద్వారా చంద్రుడు, వెంటనే ఆదిత్య–ఎల్1 ద్వారా సూర్యుడు, ఆ వెంటనే శుక్రుడు, అటు పైన మానవ సహిత వ్యోమనౌకతో అంతరిక్ష యానమైన 'గగన్‌యాన్'... ఇలా వరుసగా అనేక బృహత్ యజ్ఞాలను ఇస్రో చేపడుతోంది. బుధుడి తర్వాత మనకు అత్యంత సమీపంలో ఉన్న శుక్ర గ్రహపు మేళనాన్నీ, అక్కడి వాతావరణాన్నీ అధ్యయనం చేయడం ఒక ప్రాజెక్ట్ ఆలోచనైతే, ముగ్గురు భారత వ్యోమగాముల్ని అంతరిక్షంలోకి పంపి, మళ్ళీ వారిని సురక్షితంగా భూమి మీదకు తీసుకు రావడం మరో ప్రాజెక్ట్ లక్ష్యం. ఇప్పటి వరకు ప్రపంచంలో 3 దేశాలు (అమెరికా, రష్యా, చైనా) మాత్రమే ఇలా మనుషుల్ని అంతరిక్షంలోకి పంపాయన్నది గమనార్హం. ఈ ప్రాజెక్టులన్నిటిలో ఇస్రో ఎంచుకున్న మార్గం ఒక్కటే – వీలైనంత తక్కువ ఖర్చులో ఉన్నత సాంకేతిక నవకల్పన!

తాజా సౌరశోధననే చూస్తే– భూమి నుంచి 15 కోట్ల కి.మీ.ల దూరంలో సూర్యుడుంటాడు. మన ఆదిత్య–ఎల్1 వెళ్ళేది అందులో 15 లక్షల కి.మీ.ల దూరమే. అంటే, భూమి కన్నా ఒక్క శాతం మాత్రమే సూర్యునికి దగ్గరగా వెళుతుంది. అయితేనేం, సూర్య, భూమి రెంటి గురుత్వాకర్షణ శక్తి సమానంగా ఉండి, అందుకు తగ్గట్టు వ్యోమనౌక తిరిగేందుకు కావాల్సిన కేంద్రోన్ముఖ బలాన్ని అందించే పరివేష కక్ష్య (హేలో ఆర్బిట్)లోని కీలకమైన లాగ్రేంజ్ పాయింట్1 (ఎల్1)లో ఈ ఆదిత్య ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు. దీనివల్ల ఎక్కువగా ఇంధనం ఖర్చు కాకుండానే మన ఉపగ్రహం సౌర మండలాన్ని నిరంతరాయంగా పరిశీలించవచ్చు. భూమి నుంచి 9.9 కోట్ల కి.మీ.ల దగ్గరున్నప్పుడు కుజుడి అధ్యయనానికి గతంలో మంగళ్‌యాన్ చేసిన మన అనుభవమూ ఆదిత్యకు పనికొచ్చింది.

ఎల్1 వైపు సాగుతున్న ప్రయాణంలో ఆదిత్య ఉపగ్రహ కక్ష్యను ఇప్పటికి రెండుసార్లు విజయవంతంగా పెంచగలిగాం. సెప్టెంబర్ 10న మూడోసారి కక్ష్య పెంపు ఉండనుంది. వెరసి, ప్రయోగం నాటి నుంచి 125 రోజులకు, అంటే సుమారు నాలుగు నెలలకు పరివేష కక్ష్యలో ఎల్1 వద్ద మన ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ పూర్తవుతుంది. వచ్చే అయిదేళ్ళ పాటు ఈ ఉపగ్రహం సూర్యుడికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, పంపనుంది. అంతా బాగుంటే, ఆ తర్వాత కూడా మరో పదేళ్ళ పైగానే అది పనిచేసే అవకాశం కూడా ఉందట. జ్ఞానమే సమున్నత అధికారమైన ఆధునిక సమాజంలో, దానిపై ఆధారపడ్డ ఆర్థిక వ్యవస్థలో అగ్రరాజ్యాలతో మనం దీటుగా నిలబడేందుకు అంతకు మించి ఇంకేం కావాలి! అనేక దేశాల వల్ల కాని సూర్యచంద్ర శోధనను మనం సాధించగలగడం మన శాస్త్రవేత్తల నిర్విరామ కృషికి నిదర్శనమే! 2020 నుంచి ప్రైవేటీకరణ బాట పట్టిన భారత అంతరిక్ష విధానంతో, 360 బిలియన్ డాలర్ల ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో గణనీయమైన వాటా దక్కించుకోవడానికీ ఇలాంటి శోధనలు, విజయసాధనలు మరింత అవసరమే!

ఎవరి మాటా వినని తాలిబన్లు

విశ్లేషణ



వివేక్ కాట్జూ

అఫ్గానిస్తాన్‌ను తాలిబన్లు తిరిగి ఆక్రమించి మొన్న ఆగస్టు 15 నాటికి రెండేళ్లు పూర్తయ్యాయి. 2020లో అమెరికాతో దోహాలో చేసుకున్న ఒప్పందానికి తాలిబన్లు కట్టుబడలేదు. ఉగ్రవాదుల అడ్డాగా మార్చకపోవడం, లింగ వివక్ష అంశాలతో పాటు, అఫ్గాన్ రిపబ్లిక్‌తో అధికారం పంచుకోవడంపైనా తాలిబన్లు చర్చలు జరిపారు. ఈ క్రమంలో అక్కడ కొత్త రాజ్యాంగం పురుడు పోసుకుంటుందన్న అంచనా తీరా తారుమారైంది. పాశ్చాత్య దేశాలు తమను కూలదోయలేవని తాలిబన్లకు తెలుసు. మొక్కుబడిగా కొన్ని డిమాండ్లు చేయడం, లేదంటే ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తే అంతే చాలన్నట్టుగా అంతర్జాతీయ సమాజం ఉంది. తాలిబన్లతో సంబంధాల విషయంలో భారత్ కూడా ఆచితూచి వ్యవహరిస్తోంది.

అఫ్గానిస్తాన్‌ను తాలిబన్లు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత తిరిగి ఆక్రమించి మొన్న ఆగస్టు 15 నాటికి రెండేళ్లు పూర్తయ్యాయి. అదే రోజు అప్పటి అధ్యక్షుడు అశరఫ్ గనీ దేశం వదిలి పారిపోయారు. తాలిబన్లు తమ ఆయుధ బలం మొత్తాన్ని ఉపయోగించి, అఫ్గానిస్తాన్ ఆద్యంతం అఫ్గాన్ ఎమిరేట్‌ను పునఃస్థాపించారు. అమెరికాపై ఉగ్రదాడికి ప్రతిగా ఆ దేశ మిలిటరీ దళాలు అఫ్గానిస్తాన్ మీద 2001 నవంబరులో యుద్ధం ప్రకటించడంతోనే ఈ అఫ్గాన్ ఎమిరేట్ పతనమైన సంగతి తెలిసిందే. తాలిబన్లు మళ్లీ దేశాన్ని వశం చేసుకోవడానికి ముందు, అమెరికాతో దోహాలో 2020లో చేసుకున్న ఒప్పందానికి కట్టుబడలేదు. మిలిటరీ బలగాలను వెనక్కు తీసుకున్నందుకు ప్రతిగా తాలిబన్లు అఫ్గాన్ ప్రాంతాన్ని ఉగ్రవాదులకు అడ్డాగా మార్చరాదని దోహా ఒప్పందం షరతు విధించింది. దీనితో పాటు, అఫ్గాన్ రిపబ్లిక్‌తో అధికారం పంచుకోవడంపై చర్చలు జరిపేందుకూ తాలిబన్లు అంగీకరించారు. ఈ క్రమంలో అక్కడ కొత్త రాజ్యాంగం పురుడు పోసుకుంటుందని వేసుకున్న అంచనా తారుమారైంది. తాలిబన్లు అఫ్గాన్ నేషనల్ ఆర్మీపై వేగంగా పైచేయి సాధించడంతో అధికారం పంచుకోవడం అన్న మాట పక్కకెళ్లిపోయింది. ఒకవైపు ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖురాసాన్‌తో తాలిబన్లు పోరాడుతూనే ఉన్నారు. మరోవైపు ఉగ్రవాద సంస్థ అల్–ఖైదాతో వారి అనుబంధం పెరుగుతూనే ఉంది. అల్–ఖైదా నేత అయమాన్ అల్–జవాహిరిని 2022 జూలైలో అమెరికా ఒక డ్రోన్ దాడిలో హతం చేసినప్పుడు, ఈ సంబంధం కొనసాగుతున్నట్టు అర్థమైంది.

అఫ్గానిస్తాన్‌లో అమెరికా, నాటోకు గట్టి దెబ్బ తగిలింది. తమ మిలిటరీ దళాలను వెనక్కు తీసుకునే ప్రక్రియను కూడా అవి సాఫీగా నిర్వహించలేకపోయాయి. గడచిన రెండేళ్లుగా, అమెరికా, దాని భాగస్వాములు, అంతర్జాతీయ సమాజ సభ్యదేశాలు తాలిబన్ ప్రభుత్వం మానవ హక్కులు, మరీ ముఖ్యంగా లింగ వివక్షకు సంబంధించిన అంశాల్లో అందరినీ కలుపుకొని పోవాలని డిమాండ్ చేస్తున్నాయి. తాలిబన్ ప్రభుత్వం తాను అన్ని తెగలకు ప్రాతినిధ్యం కల్పించామని చెబుతోంది. అయితే లింగ వివక్షకు సంబంధించిన విషయాల్లో మాత్రం వాళ్లు ఇప్పటికీ షరియా చట్టాల అమలుకే మొగ్గు చూపుతున్నట్లుగా కనిపిస్తుంది. కాకపోతే 1990ల నాటి క్రూరత్వం కొంత తగ్గిందని చెప్పాలి. అంతర్జాతీయ సమాజపు డిమాండ్ల విషయంలో తాలిబన్లు వెనక్కి తగ్గలేదన్నది సుస్పష్టం. ప్రస్తుత అమీర్ (పాలకుడు) అయిన హిబతుల్లాహ్ అఖుండ్‌జాదా చేతుల్లో అధికారం ఉన్నంత వరకూ ఇది అసాధ్యమని కూడా చెప్పు కోవాలి.

తాలిబన్లు ప్రధానంగా పష్తూన్లు. అదే సమయంలో ఇస్లామ్‌ను అనుసరిస్తారు. యాభై ఏళ్ల సంక్షోభం, యుద్ధాల ఫలితంగా అక్కడ సామాజిక మార్పులు చోటు చేసుకుని పష్తూన్ల సంప్రదాయ బలం తగ్గింది. ఈ నేపథ్యంలో తాలిబన్ అగ్రనేతకు అమిర్ అల్–ముమినీన్ హోదా కల్పించడంతో ఆయన మాట మీరడం ఎవరికైనా దుర్లభం. దేశ ఆగ్నేయ ప్రాంతంలో మంచి పట్టున్న అంతర్గత వ్యవహారాల తాత్కాలిక మంత్రి సిరాజుద్దీన్ హక్కానీ, తాలిబన్ల వ్యవస్థాపకుడైన ముల్లా ఒమర్ కుమారుడిగా అదనపు అనుకూలత ఉన్న రక్షణ శాఖ మధ్యంతర మంత్రి ముల్లా యాకూబ్ లాంటి యువ నేతలు మార్పునకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. అయితే, లింగ అంశాల మీద ప్రపంచాన్ని ధిక్కరిస్తున్న హిబతుల్లాహ్, ఆయన వర్గమైన సంప్రదాయ ముల్లాలకు వ్యతిరేకంగా వారు నిలబడ లేకపోతున్నారు.



గత ఏడాది ఫిబ్రవరిలో రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం మొదలైన తరువాత అంతర్జాతీయ సమాజం, అగ్రరాజ్యాల ధ్యాస మొత్తం అటువైపు మళ్లింది. యూరోపియన్ దేశాలపై, అమెరికా–చైనా మధ్య కొనసాగుతున్న పోటీ విషయంలోనూ యుద్ధం ప్రభావం చాలా ఎక్కువే. పైగా ఈ యుద్ధం వల్ల భూ దక్షిణార్ధ గోళంలో చేపట్టిన సంక్షేమ కార్యకలాపాలపై కూడా ప్రతికూల ప్రభావం పడింది. వీటన్నింటి కారణంగా అఫ్గానిస్తాన్ అంశం ఏడాదిన్నర కాలంగా కనుమరుగైంది. అప్పుడప్పుడూ మొక్కుబడిగా కొన్ని డిమాండ్లు చేయడం, ఆంక్షలు విధిస్తామని హెచ్చరిస్తే అంతే చాలన్నట్టుగా అంతర్జాతీయ సమాజం ఉంది. ఇదిలా ఉండగానే, అఫ్గానిస్తాన్ ఆర్థిక పరిస్థితి మరీ దిగజారి, శరణార్థులు ఇతర దేశాలకు వెల్లువెత్త కుండా మానవతా సాయం కొంతవరకూ కాపాడుతోంది. అయితే విదేశాలకు వెళ్లగలిగిన స్థోమత ఉన్నవారు ఇప్పటికీ వెళుతూనే ఉండటం గమనార్హం.

అఫ్గానిస్తాన్ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఇప్పుడు అంతర్జాతీయ సమాజం అనాసక్తంగా ఉంది. ఆఖరికి అక్కడినుంచి పెరిగిపోతున్న మాదకద్రవ్యాల సరఫరా విషయాన్నీ పట్టించుకోవడం లేదు. మరోవైపు, ఏ అగ్రరాజ్యమైనా అక్కడ ఏం చేయగలదు? క్షేత్రస్థాయిలో అక్కడ ఎవరూ లేరు. ఉగ్రవాదుల గుంపు కార్యకలాపాలపై టెక్నాలజీ లేదా మానవ నిఘా ద్వారా ఎంత వరకూ పరిశీలించవచ్చు? అయితే అప్పుడప్పుడూ ఇవి కూడా ప్రభావవంతంగా ఉంటాయనడానికి అల్–జవాహిరిని మట్టుబెట్టడం నిదర్శనం.

పాశ్చాత్య దేశాలు తలుచుకుంటే వాయుమార్గం ద్వారా తమను ఎప్పుడైనా దెబ్బతీయగలవనీ, అయినప్పటికీ తమ ప్రభుత్వాన్ని మాత్రం అవి కూల్చలేవనీ తాలిబన్లకు తెలుసు. ఇలా జరగాలంటే దేశంలో అసంతృప్తి పెరగాలి. కానీ అలాంటి పరిస్థితి ఏదీ కనిపించడం లేదు. ప్రజాగ్రహం లేదా విదేశాల్లో స్థిరపడ్డ ప్రతిపక్ష పార్టీల చర్యలు మచ్చుకైనా లేవు. అంతేకాకుండా అమెరికా, యూరప్, రష్యా, చైనా ప్రయోజనాలేవీ దెబ్బతినకుండా తాలిబన్లు జాగ్రత్త పడుతున్నారు.

అమెరికన్లు, యూరోపియన్ల విషయంలో తాలిబన్లు కొంత సానుకూలంగా వ్యవహరిస్తున్నా పాకిస్తాన్‌తో మాత్రం అంతంత మాత్రంగానే ఉంటున్నారు. తెహరీక్–ఎ–తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ), అఫ్గాన్ తాలిబన్ల సంబంధాలు మతపరమైనవి, వ్యక్తిగతమైనవి, తెగలకు కూడా సంబంధించినవి. టీటీపీ కూడా 'అమీర్'కు విధేయులుగా ఉంటామని ఇప్పటికే ప్రకటించింది. అది ఇరు పక్షాలకూ పవిత్ర సంబంధం లాంటిది.

టీటీపీ నియంత్రణలో తాలిబన్ల సహకారం ఏమాత్రం అందకపోవడంతో పాకిస్తాన్ సైన్యం, నిఘా వర్గాలు చాలా నిస్పృహలో ఉన్నాయి. ఇది కాస్తా ఘర్షణకు దారితీస్తోంది. ఇరువైపులా బాహాటంగా వ్యతిరేకత వెల్లడవుతోంది. ఆగస్టు 14వ తేదీన కాకుల్‌లో పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసీమ్ మునీర్ మాట్లాడుతూ, "అఫ్గాన్ సోదరులను గౌరవిస్తానే ఈ మాట. వారిని బాగా ఆదరిస్తున్న దేశం పాక్. వారు కూడా ఈ గౌరవ మన్ననలకు తగ్గట్టుగా వ్యవహరించాల్సిన అవసరముంది. కనీసం మాకు వ్యతిరేకంగా పనిచేసే వారికి ఆశ్రయమైనా కల్పించకుండా ఉండాల్సింది" అని వ్యాఖ్యానించారు.

ఈ ఆరోపణలను తాలిబన్ అధికార ప్రతినిధి తిరస్కరించడం గమనార్హం. అయినా ఎట్టి పరిస్థితుల్లోనూ తాలిబన్లు టీటీపీని వదులుకోరు. అంతర్జాతీయ సంబంధాల్లో ఉదారత అనేది ఇచ్చిపుచ్చుకునే వ్యవహారం కాదని గ్రహించిన తొలి దేశం పాకిస్తాన్ ఏమీ కాదు.

తాలిబన్లతో సంబంధాల విషయంలో భారత్ కొంచెం ఆచితూచి వ్యవహరిస్తోంది. ఏడాది కాలంగా అఫ్గానిస్తాన్‌లో మన 'టెక్నికల్ టీమ్' ఒకటి పనిచేస్తోంది. భారత్ నుంచి మానవతా సాయం కూడా ఈ పొరుగు దేశానికి అందుతోంది. అయితే అఫ్గాన్ల పరిస్థితిని వాస్తవిక దృక్పథంతో అర్థం చేసుకుని ఆచరణ సాధ్యమైన ఆలోచనలను అమల్లో పెట్టడం మేలు. భద్రతా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుంటూనే వీసాల జారీని కొంత సులువు చేయడం అవసరం. ఈ చర్య ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న సంబంధాలను మరి కొంచెం దృఢతరం చేయగలదు.

వ్యాసకర్త విదేశీ వ్యవహారాల శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

గర్వం కలిగించేలా...



పేరు మనలో గర్వభావం కలిగించేదిగా ఉండాలని నేను నమ్ముతాను. మనం భారతీయులం. ఇండియా అనే పేరు పెట్టింది బ్రిటిష్‌వాళ్లు. మన అసలు పేరైన 'భారత్'ను అధికారికంగా వెనక్కి తెచ్చుకోవడం ఎప్పుడో చేయాల్సింది. ప్రపంచ కప్‌లో మన ఆటగాళ్లు తమ ఛాతీ మీద 'భారత్'ను ధరించాలని బీసీసీఐని కోరుతున్నా.

– వీరేంద్ర సెహ్వాగ్, క్రికెటర్

పచ్చి అబద్ధం



ఇండియా పేరును బ్రిటిష్‌వాళ్లు పెట్టారనడం అబద్ధం. అది 2,400 ఏళ్ల పాతది. సింధు (ఇండస్) నది మీదుగా వచ్చింది. క్రీ.పూ. 5వ శతాబ్దం నుంచి వాడుకలో ఉంది. హెరొడొటస్ (గ్రీకు చరిత్రకారుడు) 'హిస్టరీస్'లో తొలిసారి దీని ప్రస్తావన కనబడుతుంది.

– అద్వైద్, హిస్టారియన్

బ్రాండ్‌వ్యాల్యూ



ఇండియాను 'భారత్' అని పిలవడానికి రాజ్యాంగ అభ్యంతరం ఏమీ లేనప్పటికీ – దేశ అధికారిక రెండు పేర్లలో అదీ ఒకటి – శతాబ్దాలుగా నిర్మాణమైన అమితమైన 'ఇండియా' బ్రాండ్ వ్యాల్యూను ప్రభుత్వం పిచ్చి మూర్ఖత్వంతో అసలు లేకుండా చేయదని ఆశిస్తున్నాను.

– శశి థరూర్, కాంగ్రెస్ ఎంపీ

ఎన్నికల కోసమా?



రాజ్యాంగం ప్రకారం, ఇండియా ఇప్పటికే భారత్ అయినప్పుడు, దాన్ని మళ్లీ భారత్ అని ఎలా మార్చుతారు? వాళ్లు ఇండియా అనే పేరును లేకుండా చేయాలని చూస్తున్నారు. ఇదంతా ప్రతిపక్ష పార్టీలు తమ కూటమి పేరును 'ఇండియా' అన్నందుకేనా?

– సుమంత్ రామన్, జర్నలిస్ట్

మాటను బట్టి...




దేశం పేరు ఇంగ్లిష్, తమిళంలాంటి వాటిల్లో ఇండియాగా; హిందీ, మరాఠీ, ఇంకా ఎన్నో భాషల్లో భారత్‌గా; ఉర్దూ, కశ్మీరీలో హిందోస్తాన్‌గా వాడుకలో ఉంది. మాట్లాడే భాషను బట్టి ఈ పేర్లు మారుతాయి.

– సిద్ధార్థ్ వరదరాజన్, ఎడిటర్

చెత్తపలుకులతో ఎవర్ని మోసగిస్తారు!

అభిప్రాయం



కొమ్మినేని శ్రీనివాసరావు

టీడీపీ అధినేత చంద్రబాబును ప్రధాని మోదీ నమ్మడం లేదట. వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్‌ను మోదీ నమ్ముతున్నారట. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలతో కూడా జగన్ టచ్‌లో ఉండి, లోక్‌సభ ఎన్నికల తర్వాత మద్దతు ఇస్తానని అన్నారట. ఇది నిత్యం తెలుగుదేశం కోసం బట్టలూడదీసుకుని తిరిగే ఓ పత్రిక తాజా పలుకు. ఎలాగోలా ఆంధ్రవరకైనా జనసేనతో పాటు బీజేపీనీ, టీడీపీతో కలపడానికి ఇలా దిగజారి అపోహలు సృష్టించడానికి కొత్తపలుకో, చెత్తపలుకో ఆ పత్రిక యజమాని రాశాడని అర్థమవుతూనే ఉంది. అంతేకాక జగన్ సోదరి షర్మిలకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించడం లేదని తెగ బాధపడ్డారు.

నిజానికి ఈ వారం అతి ముఖ్యమైన అంశం ఏమిటి? చంద్రబాబు నాయుడుకు ఆదాయపన్ను శాఖ 118 కోట్ల రూపాయల బ్లాక్ మనీకి సంబంధించి నోటీసు ఇవ్వడం. ఎవరెవరి ద్వారా ఆ డబ్బు జమ అయిందీ వంటి వివరాలు వెలుగులోకి రావడం. అంటే అదంతా ముడుపుల రూపేణా తీసుకున్న డబ్బేనన్న భావన సహజంగానే ఏర్పడుతుంది కదా? చంద్రబాబు దీనిపై స్పందించాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నా ఆయన స్పష్టత ఇవ్వడం లేదు.

జగన్ సోదరి షర్మిల తెలంగాణలో రాజకీయ పార్టీ పెట్టుకుని నడుపుతున్నారు. ఆమెతో ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానం టచ్‌లోకి వెళ్లింది. పార్టీ విలీనం, తదితర అంశాలపై ఆమె సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, తదితరులను కలిసి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన కొన్ని విషయాలకు వక్రభాష్యం చెబుతూ ఈయన 'కాంగ్రెస్‌ను కమ్మిన జగన్మాయ' అని కథ అల్లేశారు. అందులో తనకు జగన్ పైన ఉన్న విద్వేషాగ్ని అంతటినీ మరోసారి కక్కారు.

ఇంత ద్వేషంలో కూడా ఆయనకు తెలియకుండానే ఒక విషయం అంగీకరించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ వచ్చే ఎన్నికల తర్వాత కూడా పవర్ ఫుల్ గానే ఉంటారనీ, ఒకవేళ కేంద్రంలో ఎవరికి మెజార్టీ రాని పక్షంలో జగన్ సాధించే లోక్ సభ సీట్లు కీలకం అవుతాయని చెప్పకనే చెప్పినట్లయింది. జగన్ తన కేసుల కోసమో, వివేకా హత్య కేసు విషయం గురించో ప్రధాని మోదీ తదితరులతో సన్నిహితంగా ఉంటున్నారని ఆయన చెబుతున్నారు. అదే నిజమైతే వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డి తండ్రి ఎందుకు జైలులో ఉండవలసి వస్తుంది? జగన్ తనపై ఉన్న కేసులను



ఎందుకు కొట్టివేయించుకోలేకపోయారు? చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని పేరుతో సాగించిన వ్యవహారాలలో అవినీతి జరిగిందా, లేదా? సబ్ కాంట్రాక్టర్‌ల నుంచి డబ్బులు వసూలు చేశారా, లేదా? ఆదాయపన్ను శాఖ ఇచ్చిన నోటీసు వాస్తవమా, కాదా? అందులో ఉన్న విషయాలతో ఆయన ఏకీభవిస్తారా, లేదా? వీటి గురించి ఒక్క ముక్క రాయని ఈయన వైసీపీ వారి ఒత్తిడి వల్ల ఆదాయపన్ను శాఖ మళ్లీ నోటీసు ఇచ్చిందని నిస్సిగ్గుగా కథనాన్ని ఇవ్వడం సమర్థనీయమేనా? 'ఎన్టీఆర్ నాణెం' పేరుతో చేసిన రాజకీయం ఈ ఆదాయపన్ను కేసు గురించా, కాదా?

జగన్ పట్ల కాంగ్రెస్ మెతక వైఖరికి రావడం వల్ల తెలంగాణలో సెటిలర్లు కాంగ్రెస్‌కు ఓట్లు వేయకపోవచ్చని ఆ పత్రిక యజమాని ప్రచారం. ఎవరైనా తెలంగాణ రాష్ట్ర పరిస్థితులకు అనుగుణంగా కాకుండా ఏపీ వ్యవహారాలపై ఆధారపడి ఎందుకు ఓట్లు వేస్తారు? రాహుల్ గాంధీని షర్మిల కలిసినప్పుడు అన్నాచెల్లెళ్ల మధ్య తగాదా పెట్టామన్న పేరు రావడం తనకు ఇష్టం లేదనీ తెలుగేతర ప్రాంతాల్లో ఆమె ప్రచార సేవలు వాడుకుంటామనీ అన్నారట. అది ఈయనకు నచ్చలేదు. అదీకాక ఆంధ్రలో తాను రాజకీయాలు చేయననీ, తను పుట్టింది, పెరిగింది, తన అత్తగారి ప్రాంతం అంతా తెలంగాణే కాబట్టి తన కార్యకలాపాలు తెలంగాణలోనేనని షర్మిల పలుమార్లు చెప్పారు. అయితే పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వంటివారికి షర్మిల తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలలో ఉండడం ఇష్టం లేదు. షర్మిలను చేర్చుకుంటే పోటీ పవర్ సెంటర్ అవుతారనో, లేక బీఆర్ఎస్ నేతలు ఎక్కడ ఆంధ్ర సెంటిమెంట్ తెస్తారోనన్న భయం ఉండి ఉండవచ్చు. రేవంత్ రెడ్డికి కూడా సన్నిహితుడైన ఈ పత్రిక యజమాని ఆయనకు ఎక్కడ నష్టం వస్తుందోనని తలచి ఇలాంటి కథలు అల్లుతున్నారు.

వైఎస్ మరణం తర్వాత జగన్ కాంగ్రెస్‌ను నానా ఇబ్బందులకు గురి చేశారని, అలాంటి వ్యక్తితో కాంగ్రెస్ ఎలా రాజీ పడుతుందని కూడా ఆ పేపర్ ఓనర్ చిత్రమైన లాజిక్ తెచ్చారు. జగన్ కాంగ్రెస్‌లో నుంచి వెళ్లేటట్లు చేసి, ఆయన సొంత పార్టీ పెట్టుకుంటే కేసులు పెట్టి వేధించిన సంగతిని పక్కనబెట్టి కాంగ్రెస్‌నే జగన్ వేధించారని రాయడం అంటే పిచ్చిరాతలకు పరాకాష్ఠ అని చెప్పాలి. చంద్రబాబును మోదీ నమ్మడం లేదు కనుక జగన్‌ను కూడా నమ్మకుండా చేయాలంటే ఇలా కాంగ్రెస్‌తో అంటగట్టాలన్న తాపత్రయం ఆయన అక్షరాలలో అడుగడుగునా కనిపిస్తుంది. చంద్ర బాబు తరఫున కేంద్రంలో బీజేపీ పెద్దలను మాయ చేయాలని అతడు ఇలాంటి దుష్టపలుకులు రాస్తున్నారన్న సంగతి ఎవరికి అర్థం కాదు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

కులాన్ని నిలబెట్టడానికేనా?!

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

చేతితో కుట్టిన చెప్పుల లోని కళాత్మకత గురించి మనం మాట్లాడేపుడు వాటి తయారీ వెనుక ఉన్న నిర్బంధం, అమానవీయ చాకిరీ కూడా గుర్తుకు రావాలి. ఊరిలోని పశు కళేబరాల కాళ్ళకి తాళ్ళు కట్టి, తల కిందులుగా వేలాడదీసి కర్రల సాయంతో ఊరి చివరకు మోసుకెళ్ళిన మనుషులు గుర్తుకు రావాలి. ఆ కళేబరం తోలు వలిచి, దానిని అనేక విడతలుగా శుద్ధి చేసి, ముక్కలు చేసి, అతుకులు వేసి నైపుణ్యంగా కుట్టిన కళాకారుని చేయి గుర్తుకు రావాలి. చాలామంది గుర్తు రావాలి, చాలా విషయాలు గుర్తు రావాలి. పంటి బిగువన మైల బట్టలు ఉతికినవారు గుర్తు రావాలి, మలాన్ని దోసిళ్లతో ఎత్తి పోసేవారు, కణకణ మండే నిప్పుల కొలిమిలో దేహాన్ని పనిముట్లుగా వంచినవారు, వేళ్ళు మెలికెలు తిరుగుతూ ఉండడమే వాటి సహజ లక్షణమా అన్నంతగా బుట్టలు, తట్టలు అల్లినవారు, భళ్ళున పగిలే కుండల వంటి జీవితాల వారు గుర్తుకు రావాలి. పనికీ పాటకీ సరే పనికీ కులానికి ఉన్న సంబంధం గుర్తు రావాలి. చేతివృత్తులన్నీ కులవృత్తులేనన్న స్పృహ కలిగి నపుడు వాటిని ప్రభుత్వాలు ఎలా చూస్తున్నాయన్న ఆసక్తి సహజం.

గత నెల జాతీయ పండుగ సందర్భంలో మన ప్రధానమంత్రి కొన్ని పథకాలను ప్రకటించారు. వాటిలో 'విశ్వకర్మ యోజన' ఒకటి. దేశంలో 18 రకాల చేతివృత్తులను గుర్తించి రాబోయే అయిదేళ్ళ కాలంలో ముప్పై లక్షల కుటుంబాలు లబ్దిదారులుగా, 1,300 కోట్ల రూపాయిలు ఈ పథకానికి కేటాయించారు. నైపుణ్యాన్ని పెంచుకునే కాలంలో రోజుకి అయిదు వందలు స్టయిపెండ్ ఇస్తారు. ఆధునిక పరికరాల కొనుగోలుకి పదిహేను వేలు ఇస్తారు. మిగతాది అయిదు శాతం వడ్డీకి ఇచ్చే ఋణ సదుపాయం మాత్రమే. పేద ప్రజల సంక్షేమం కోసమని చెప్పి ప్రభుత్వాలు అనేక పథకాలు ఎన్నికల ముందు ప్రకటించడం ఎప్పటి నుంచో ఉన్నదే. వీటి రూపకల్పనకి ముందు చాలా కసరత్తు జరుగుతుంది. పిల్లలు, వృద్ధులు, మహిళలు, పేదలు, నిరుద్యోగులు, వికలాంగులు – ఇలా చేయూత ఇవ్వాల్సినవారిని గుర్తించడంలో అంతో ఇంతో సమానత్వం వైపు నడిపే పురోగామి దృష్టి ఉంటుంది. మరి విశ్వకర్మ యోజన పథకంలో అటువంటి దృష్టి ఏముంది?

లబ్ధిదారులుగా చేతివృత్తులు, వ్యవసాయ అనుబంధ వృత్తులను పరిగణనలోకి తీసుకోవడం ముందడుగు అవుతుందా? యంత్రం మనుగడ



లోకి వచ్చిందంటేనే ఎక్కువ చాకిరి, తక్కువ ప్రతిఫలం వచ్చే ఫ్యూడల్ దశనుంచి కాస్త ముందుకు జరిగినట్లు. ఇటువంటి సమయంలో చెప్పులు కుట్టుకోవడానికి, కుండలు తయారు చేయడానికి, వడ్రంగి, మగ్గం, జాలరి, క్షురక, కంసాలి తదితర సాంప్రదాయక చేతివృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం పథకాలు ప్రకటించడం ఆశ్చర్యకరం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలను ప్రోత్సహించడం లక్ష్యంగా చెప్పిన ఈ ప్రకటన వెనుక కూడా రాజకీయ వ్యూహమే కనపడుతుంది.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపే మెజారిటీ శ్రామికులకి చేయూతనివ్వాలనీ, సంప్రదాయక నైపుణ్యాలకి అంతర్జాతీయ మార్కెట్టుని సృష్టించి పెట్టాలనీ, అనువంశికంగా చేతివృత్తులను నిలబెట్టుకుంటూ వచ్చే కుటుంబాలను ప్రోత్సహించాలనీ, ఇంకా గురు– శిష్య పరంపరగా చేతివృత్తులను ముందుకు తీసుకు పోవడానికి కృషి చేయనున్నట్లు పథకాన్ని ప్రకటిస్తూ చెప్పారు. ఈ లెక్కన చేతివృత్తులను పునరుద్ధరించడం ద్వారా కుల వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి కేంద్రం పూనుకుంటున్నదా?!

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇపుడు కుండలు అక్కర్లేదు, నాగలి అక్కర్లేదు, చేతితో కుట్టే చెప్పులు అక్కర్లేదు. ఇంకా చాలా అక్కర్లేదు. అక్కరలేక అంచులకి నెట్టబడినవారు కూటికోసం కోటి విద్యలు వెతుక్కోవడానికి పట్టణాలు, నగరాలు చేరుకున్నారు. పల్లెల పాత యూనిట్ అతుక్కోలేనంత చెల్లాచెదురైంది. ఇది అనివార్యమైన మార్పు. ఇంచుమించు యాభై ఏళ్లకి పైగా కులవృత్తులను వదిలి దొరికిన, మెరుగైన చదువు, ఉద్యోగాలలోకి ప్రవేశించడం కోసం, తినో తినకో కడుపుగట్టుకుని తమబిడ్డలను చదివించుకుంటున్నారు. ఇపుడొచ్చి పదీ పరకా ఆశ చూపి సమాజాన్ని మళ్ళీ వర్ణవ్యవస్థ వైపు నడిపే పథకాలు ప్రమాదకరం. కులవృత్తులను 'హస్తకళల' పేరిట గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాదులుగా అనుసంధానించే ప్రయత్నం చేయడమంటే ఫ్యూడల్ సమాజాన్ని రారమ్మని పిలుస్తున్నట్లు. విశ్వకర్మ యోజనకి ఉద్దేశించిన లబ్దిదారులకు ఈ కొద్ది ఆర్థిక ఊరట కలగడాన్ని వ్యతిరేకిస్తామా, అంటే ఆర్థికంగా దిగువ స్థాయిలో ఉన్న ప్రజలందరి శ్రమకి తగిన ప్రతిఫలం లభించేలా చూడడానికే ప్రభుత్వం ఉన్నది. ఈ కేటాయించిన సొమ్ము అదే వర్గాలకి విద్యా ఉద్యోగ రంగాల్లో పురోగామి అవకాశాల ద్వారా అందేట్లు చూడాలి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ మతం సహకారంతో గ్రామీణ భారతంలో మళ్ళీ కుల వ్యవస్థను సడలనివ్వకుండా పటిష్టపరిచే ఇటువంటి ప్రయత్నాలు ఫాసిస్ట్ రాజ్య స్థాపనకి సేతువు కట్టడమే.

వ్యాసకర్త జాతీయ కార్యదర్శి, ప్రరవే
malleswari.kn2008@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.సప్తమి రా.8.07 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** కృత్తిక ప.2.44 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ప.11.34 నుండి 12.24 వరకు, **అమృతఘడియలు:** ప.12.20 నుండి 1.54 వరకు, స్మార్త శ్రీకృష్ణాష్టమి ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.08.

క్లుప్తంగా...

నేడు 'పాలమూరు'పై సీఎం కేసీఆర్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన నార్లాపూర్ పంప్‌హౌస్‌కు ఈనెల 3న విజయవంతంగా డ్రైరన్ నిర్వహించారు. 18న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఆయన పంప్‌హౌస్‌లు, సబ్ స్టేషన్లను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.

బండి సంజయ్‌కు రూ.50 వేల జరిమానా

- క్రాస్ ఎగ్జామినేషన్‌కు గైర్హాజరుపై హైకోర్టు సీరియస్



సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ ఎంపీ, బీజేపీ నేత బండి సంజయ్ తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. కరీంనగర్ శాసనసభ్యుడు గంగుల కమలాకర్ ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌లో అడ్వొకేట్ కమిషనర్ ముందు క్రాస్ ఎగ్జామినేషన్‌కు బండి సంజయ్ గైర్హాజరు కావడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే పలుమార్లు గడువు కోరిన తర్వాత కూడా మళ్లీ గడువు కోరడాన్ని తప్పుబట్టింది. ఎన్నికల పిటిషన్‌లో విచారణను ముగిస్తామని హెచ్చరించింది. ఈ నెల 12న హాజరవుతారని ఆయన న్యాయవాది తెలపడంతో... రూ.50 వేల జరిమానా విధించింది. తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. 2018 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి గంగుల కమలాకర్ బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. అయితే అఫిడవిట్‌లో గంగుల తప్పుడు వివరాలు ఇచ్చారని, ఆయన ఎన్నిక చెల్లదంటూ తీర్పు ఇవ్వాలని పేర్కొంటూ సమీప ప్రత్యర్థి బండి సంజయ్ హైకోర్టులో 2019, జనవరిలో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ చిల్లకూర్ సుమలత మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. ఇరుపక్షాల సాక్ష్యాలను నమోదు చేయడంకోసం న్యాయమూర్తి జూన్‌లో అడ్వొకేట్ కమిషనర్‌గా రిటైర్డ్ జడ్జి శైలజను నియమించారు. అయితే పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సంజయ్ క్రాస్ ఎగ్జామినేషన్‌కు నాలుగుసార్లు గైర్హాజరయ్యారు.

రంగస్థల దిగ్గజం భాస్కర్ షేవాల్కర్ కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా నాటక రంగంలో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన రంగస్థల దిగ్గజం ప్రొఫెసర్ భాస్కర్ షేవాల్కర్ (83) మంగళవారం బ్రెయిన్‌స్ట్రోక్‌తో కన్నుమూశారు. నాంపల్లిలోని ఆయన స్వగృహంలో అకస్మాత్తుగా కింద పడటంతో కుటుంబసభ్యులు మహావీర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అంబర్‌పేట శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఎస్.ఎన్ డ్రామా స్కూల్ అధిపతిగా షేవాల్కర్ విశేష సేవలు అందించారు. ఐదు దశాబ్దాలుగా ఆధునిక తెలుగు నాటకరంగానికి పెద్ద దిక్కుగా ఉండి ఎన్నో నాటకాలకు జీవం పోశారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఆంగ్ల నాటకాలను దేశ వ్యాప్తంగా ప్రదర్శింపజేశారు. ఎక్కువగా ఫ్రెంచ్, జర్మనీ, ఆంగ్ల నాటకాలను తర్జుమా చేయించి అత్యాధునిక పోకడలను తెలుగు రంగస్థలానికి పరిచయం చేశారు. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన రంగధార నాటక గ్రూప్‌నకు ఆయన వ్యవస్థాపక అధ్యక్షులు. భాస్కర్ షేవాల్కర్ సేవలకు అనేక పురస్కారాలు లభించాయి.

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీధర్‌రావు

నాంపల్లి: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడిగా మన్నే శ్రీధర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే, జాతీయ కార్యనిర్వహణ అధ్యక్షుడిగా హైదరాబాద్ జిల్లా దోమల్‌గూడకు చెందిన జంగా శ్రీనివాస్ నియమితులయ్యారు. మంగళవారం మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఏసీగార్డ్స్‌లోని ప్రధాన కార్యాలయంలో వీరిద్దరికి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. శ్రీధర్‌రావు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

30 వీధికుక్కల హతం

అధిక మోతాదులో మత్తు ఇంజెక్షన్లు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్‌లో సుమారు 30కి పైగా వీధి కుక్కలకు అధిక మోతాదులో మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి హతమార్చిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు అందించిన వివరాలివి. నాలుగు రోజుల క్రితం గ్రామంలోని వీధి కుక్కలకు అధిక మోతాదులో మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి హతమార్చారు. వీటిని పంచాయతీ ట్రాక్టర్‌లో తీసుకెళ్లి గొయ్యి తీసి పాతిపెట్టినట్లు తెలిసింది. ఆ చిత్రాలు మంగళవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దర్యాప్తు చేపడితే.. బాబు, చినబాబు జైలుకే!

'సాక్షి'తో న్యాయవాది, కార్పొరేట్ న్యాయ నిపుణుడు వెంకటరామిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు ఆదాయపు పన్ను శాఖ జారీచేసిన నోటీసులపై దర్యాప్తు సంస్థలు విచారణకు స్వీకరించి నేరం రుజువైతే బాబుతో పాటు ఆయన తనయుడు చినబాబు కూడా జైలుకు వెళ్లాల్సి వస్తుందని ప్రముఖ న్యాయవాది, కార్పొరేట్ న్యాయ నిపుణుడు వెంకటరామిరెడ్డి తెలిపారు. ఐటీ అధికారులు జారీచేసిన నోటీసులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సుమోటోగా దర్యాప్తు చేపట్టవచ్చన్నారు. అంతేకాక.. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ), విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా), ఆర్‌బీఐ, కంపెనీ చట్టం, ప్రజాప్రాతినిధ్య చట్టం మేరకు ఎన్నికల కమిషన్, విజిలెన్స్ కమిషన్ లాంటి దర్యాప్తు సంస్థలు కూడా కేసు నమోదు చేయవచ్చని ఆయన వెల్లడించారు. పూర్తి ఆధారాలు, సాక్ష్యాలను ఐటీ శాఖ నోటీసుల్లో పేర్కొందని.. ఇవి నిజమేనని తేలితే చంద్రబాబు, లోకేశ్‌బాబు జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆయన చెప్పారు. పేదల ఇళ్ల నిర్మాణం పేరిట రూ.వేల కోట్ల విలువైన కాంట్రాక్టులను అప్పగించి భారీ మొత్తంలో దోపిడీకి చంద్రబాబు వేసిన స్కెచ్‌ను, అందులోని అవినీతిని ఆదాయపు పన్ను శాఖ బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. డొల్ల కంపెనీలు సృష్టించి రూ.వందల కోట్లు స్వాహా చేసినట్లు కంపెనీల వివరాలు.. చంద్రబాబుకు ఎవరి ద్వారా ఎంతెంత నగదు అందింది.. ఏ కంపెనీ నుంచి ఎంత అందింది.. అన్న వివరాలను పూర్తి ఆధారాలతో సహా ఐటీ శాఖ వెల్లడించింది. ఈ మొత్తం బాగోతంపై న్యాయవాది వెంకటరామిరెడ్డి 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నేరం చేయకపోతే తప్పించుకునే యత్నం ఎందుకు?

ఓ రాజకీయ పార్టీకి అధ్యక్షుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఐటీ శాఖ నోటీసులకు బాధ్యతగా వివరణ ఇవ్వాలి. నేరమేమీ చేయనప్పుడు ఐటీ శాఖ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకునే ప్రయత్నం చేయడం ఎందుకో చెప్పాలి. వారు అడిగిన దానికి సమాధానం ఇవ్వకుండా.. అసలు తనకు నోటీసులు జారీచేసే అధికారమే లేదని బాబు పలుమార్లు లేఖ రాయడం చూస్తుంటే నేరం చేసినట్లు భావించాల్సి వస్తోంది. సెక్షన్–127 ప్రకారం నోటీసులు జారీచేసే అధికారం ఉందని ఐటీ అధికారులు స్పష్టంచేశారు. నేరుగానైనా కావొచ్చు.. తన అనుచరుల ద్వారానైనా కావొచ్చు.. రూ.118.98 కోట్లు బాబుకే అందాయని ఐటీ వివరాలతో సహా కుండబద్దలు కొట్టింది. 2023, ఆగస్టు 4న చంద్రబాబుకు ఐటీ అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులో అదే నెల 11న తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలన్నారు. దీనిని నేరుగా బాబు నివాసమైన ప్లాట్ నంబర్ 1310, రోడ్ నంబర్ 65, జూబ్లీహిల్స్ ఇంటికి పంపారు. ఆయన వద్ద సరైన వివరణ ఉండి ఆ రోజున హాజరై చెప్పి ఉంటే.. ఈ రోజు తలదించుకోవాల్సిన పరిస్థితి వచ్చేదికాదు. కనీసం ఎప్పుడు హాజరై వివరణ ఇస్తారో కూడా చెప్పడంలేదని ఐటీ శాఖ నోటీసుల్లో పేర్కొనడం చూస్తుంటే అందులోని అంశాలు పూర్తి వాస్తవమేనని స్పష్టమవుతోంది.

బోగస్ కంపెనీలు సృష్టించి..

మనోజ్ వాసుదేవ్ పార్థసాని, ఐదు కంపెనీల వాళ్లు ఇచ్చిన మెటీరియల్ పేపర్లు, బాబు పీఏ శ్రీనివాస్‌ను పరిచయం చేసిన ముగ్గురు ఇచ్చిన స్టేట్‌మెంట్లు ఐటీ శాఖ తన నోటీసుల్లో పేర్కొంది. సదరు ముగ్గురు వ్యక్తులు భారత్, దుబాయ్, ఇతర చోట్ల నుంచి నగదు తీసుకొచ్చి ఎవరెవరికి ఇచ్చారో కూడా ఉంది. తాము కాంట్రాక్టులు తీసుకుని.. ఎన్నికల నిధుల కోసం ఖర్చుపెట్టడానికి తెలుగుదేశం పార్టీకి ఇచ్చినట్లు స్టేట్‌మెంట్‌లో వెల్లడించారు. నోటీసుల్లో కూడా నగదంతా షాపూర్‌జీ పల్లోంజీ నుంచి చంద్రబాబుకే అందినట్లు ఉంది. షలక, అన్నై (ఎక్సెల్ ఫ్రమ్ వినయ్ నంగాలియా) నుంచి రూ.33,76,18,207, ఎవరెట్ అండ్ నయోలిన్ (షీట్ ఫ్రమ్ విక్కీ మొబైల్) నుంచి రూ.50,43,00,000, పోర్ ట్రేడింగ్ నుంచి రూ.9,42,00,000, హార్డ్‌రిటన్ షీట్ (లక్‌స్టోన్ అండ్ కో) నుంచి రూ.10,23,00,000, దుబాయ్ నుంచి రూ.15,13,95,000లు చంద్రబాబుకు అందాయని.. ఇందులో రూ.118.98 కోట్లను మాత్రం ఆదాయంలో చూపలేదని కంపెనీల వారీగా వివరాలు వెల్లడించింది. షాపూర్‌జీ పల్లోంజీ నుంచి నగదును తీసుకునేందుకు ప్రైవేట్ డొల్ల కంపెనీలు, బోగస్ కాంట్రాక్టులు సృష్టించారు. బోగస్ కంపెనీలు, బోగస్ కాంట్రాక్టులు, బోగస్ నామినేషన్లు అంటూ.. 'బోగస్' అనే పదాన్ని ఐటీ శాఖ తన నోటీసుల్లో స్పష్టంగా పలుమార్లు పేర్కొంది. సెక్షన్ 132(4), 5(బీ) కింద మనోజ్ స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. ఆయన కూడా అదంతా వాస్తవమేనని సంతకం పెట్టారు. స్టేట్‌మెంట్లు ఇచ్చిన వారు చంద్రబాబు, అతని పీఎస్ పేరుతో పాటు లోకేశ్ పేరును వెల్లడించారు. విక్కీ అనే వ్యక్తి ద్వారా లావాదేవీలన్నీ జరిగినట్లు, నేరుగా చంద్రబాబు కూడా కొన్ని చెప్పినట్లు ఐటీ తన నోటీసుల్లో పేర్కొంది.

అరెస్టు చేసి.. దర్యాప్తు చేపట్టవచ్చు..

ఇప్పటికే ఐటీ అధికారులు పలుమార్లు నోటీసులు జారీచేసినా చంద్రబాబు నుంచి సరైన సమాధానం రాలేదు. ఒకవేళ సమాధానం ఇచ్చినా సంతృప్తి చెందని పక్షంలో పెద్దఎత్తున జరిమానాలు విధించవచ్చు. 25 శాతం అదనపు పన్నుతో పాటు వడ్డీ కూడా విధించవచ్చు. నేరం జరిగినట్లు తేలితే.. రూ.118.98 కోట్లకు 300 శాతం అంటే రూ.356.94 కోట్లు వసూలుచేసే అవకాశం కూడా ఉంటుంది. అంతేకాదు.. అరెస్టుచేసే అధికారం కూడా ఉంటుంది. దుబాయ్ నుంచి కూడా నగదు అందడం.. పలు కంపెనీల నుంచి డబ్బు స్వీకరించడం.. క్విడ్ ప్రో కోతో పాటు మనీలాండరింగ్ కిందికి వస్తుంది. దీంతో ఈడీ కూడా సుమోటోగా దర్యాప్తు చేయాల్సి వస్తుంది. ఈడీనే కాదు.. పీఎంఎల్‌ఏ, ఫెమా, ఆర్‌బీఐ, కంపెనీ చట్టం, ప్రజాప్రతినిధ్య చట్టం మేరకు ఎన్నికల కమిషన్, విజిలెన్స్ కమిషన్ లాంటి దర్యాప్తు సంస్థలు కూడా కేసు నమోదు చేయవచ్చు. అంతేకాక.. సీబీసీఐడీ కూడా దర్యాప్తు చేపట్టవచ్చు.

2019 తర్వాతవే ఆ రూ.118.98 కోట్లు..

ఇక 2019 తర్వాత వచ్చినవే ఆ రూ.118.98 కోట్లు అయితే.. మరి 2014 నుంచి ఎన్ని డొల్ల కంపెనీలు నెలకొల్పారు.. ఎన్ని వేల కోట్లు ప్రజా ధనం కొల్లగొట్టారు.. పూర్తిస్థాయి దర్యాప్తు జరిగితే కానీ ఈ కుంభకోణం వివరాలన్నీ బహిర్గతం కావు. ఇదంతా ప్రజల డబ్బు. దీనిపై ప్రజలెవరైనా కోర్టు ద్వారా నిష్పాక్షిక దర్యాప్తు కోరవచ్చు.

గంగుల కుటుంబానికి ఈడీ నోటీసులు!

- శ్వేతా గ్రానైట్స్ ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపణలు
- ఆ సంస్థతో తనకు ఎలాంటి సంబంధం లేదన్న మంత్రి



సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ కుటుంబ సభ్యులకు ఈడీ అధికారులు మరోమారు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. గంగుల కుటుంబ సభ్యులకు చెందిన శ్వేతా గ్రానైట్స్ విదేశాలకు ఎగుమతుల విషయంలో ఫెమా నిబంధనలను ఉల్లంఘించిందన్న ఆరోపణలపై ఈడీ నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ అంశంపై ఈడీ వివరణ కోరినట్లు తెలియవచ్చింది. గతేడాది నవంబర్‌లో శ్వేతా గ్రానైట్స్ సంస్థలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించడం తెలిసిందే. చైనాకు గ్రానైట్ ఎగుమతుల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొత్తం రూ. 4.8 కోట్ల మేర ఫెమా నిబంధనల ఉల్లంఘనతోపాటు ప్రభుత్వానికి రూ. 50 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 3 కోట్లు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఈ అంశంపై మంత్రి గంగుల స్పందించారు. మంగళవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈడీకి సంబంధించి తనకు నోటీసులేవీ రాలేదని, శ్వేతా గ్రానైట్స్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టంచేశారు. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారమే శ్వేతా గ్రానైట్స్ లావాదేవీలు జరుగుతున్నాయని వివరించారు. శ్వేతా గ్రానైట్స్‌కు ఈడీ నోటీసులనేవి 2008 నుంచి కొనసాగుతున్నవేనన్నారు. ఈ విషయంలో ఆ సంస్థ వ్యాపారం గురించి లేదా తన గురించి ఈడీకి ఎలాంటి సమాచారమైనా ఇస్తానని, పూర్తిగా సహకరిస్తానని మంత్రి సమాధానమిచ్చారు.



దారి వదలాలంటూ రైతులతో వాదిస్తున్న విద్యార్థినులు

రోడ్డెక్కిన పాడి రైతులు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పాడి రైతులు మంగళవారం రోడ్డెక్కారు. పాడి రైతులకు లీటరు పాలకు అదనంగా రూ.4 చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ రాస్తారోకో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌కు చేరుకుని సిరిసిల్ల–వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. 2019 జనవరి నుంచి 56 నెలలుగా పాడి రైతులకు లీటరుకు రూ.4 చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతులు రోడ్డుపై బైఠాయించడంతో 4 కి.మీ. మేర రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. సిరిసిల్ల టౌన్ సీఐ ఉపేందర్, ఎస్సై మల్లేశ్‌గౌడ్, ట్రాఫిక్ ఎస్సై రాజు ఎంత సముదాయించినా వినకుండా రాస్తారోకో చేశారు. పాడి రైతుల ఆందోళనకు బీజేపీ నాయకులు లగిశెట్టి శ్రీనివాస్, రెడ్డబోయిన గోపి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాముని వనిత సంఘీభావం తెలుపుతూ రోడ్డుపై బైఠాయించారు. కాగా, రాస్తారోకోతో కరీంనగర్‌కు పరీక్షలు రాసేందుకు వెళ్లే విద్యార్థులు, ఆస్పత్రికి వెళ్లే రోగులు ఇబ్బందులు పడ్డారు. పరీక్షలకు సమయం దాటిపోతోందని విద్యార్థులు వాపోయారు. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు బలవంతంగా లాక్కెళ్లి స్కూల్ బస్‌లో పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు తరలించారు.

4 ఏళ్లుగా పాడి రైతులకు మోసం: జీవన్‌రెడ్డి

నాలుగేళ్లుగా తెలంగాణ పాడి రైతులను సీఎం కేసీఆర్ మోసగిస్తున్నారని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని పాడిరైతులు సిరిసిల్లలో ఆందోళనకు దిగి ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణకు అరబ్ పెట్టుబడులు

- మంత్రి కేటీఆర్‌తో సమావేశమైన పలు యూఏఈ కంపెనీలు..
- తొలిరోజే సుమారు రూ.1,040 కోట్లకుపైగా పెట్టుబడులు



డీపీ వరల్డ్ గ్రూప్ ప్రతినిధులతో కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: దుబాయ్ తొలిరోజు పర్యటనలో భాగంగా మంత్రి కె.తారకరామారావు మంగళవారం పలు వ్యాపార, వాణిజ్య సంస్థల ప్రతినిధి బృందాలతో సమావేశమయ్యారు. సుమారు రూ.1,040 కోట్లకుపైగా పెట్టుబడులు తెలంగాణలో పెట్టేందుకు తొలిరోజే అంగీకరించాయి. తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులను రప్పించి, యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యంతో పనిచేస్తోందని కేటీఆర్ వారికి వివరించారు. మంత్రి కేటీఆర్‌తో లులూ గ్రూప్ చైర్మన్ యూసుఫ్ అలీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సమావేశమైంది. ప్రతిఏటా సుమారు వెయ్యి కోట్ల ఆక్వా ఉత్పత్తులను ఈ ప్రాంతం నుంచి సేకరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇందుకు అవసరమైన కోల్డ్ స్టోరేజీ, ఫిష్ ప్రాసెసింగ్ యూనిట్ వంటి వాటిపై పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. తమ పెట్టుబడి ద్వారా ఈ ప్రాంతంలో 500 మందికి నేరుగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొంది.

మలబార్ గ్రూప్ పెట్టుబడి రూ.125 కోట్లు

తెలంగాణలో ఇప్పటికే బంగారం రిఫైనరీ రంగంలో తెలంగాణలో పెట్టుబడి పెట్టిన మలబార్ సంస్థ తాజాగా ఫర్నిచర్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం రూ.125 కోట్లు పెట్టుబడిగా పెడుతున్నట్టు తెలియజేసింది. దీనిద్వారా వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ మేరకు కేటీఆర్‌తో మలబార్ గ్రూపు ప్రతినిధి బృందం సమావేశమైంది. ఆ సంస్థ చైర్మన్ ఎంపీ అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రితో మాట్లాడారు.

రూ.700 కోట్లతో నాఫ్కో ప్లాంట్

రాష్ట్రంలో రూ.700 కోట్లతో అగ్నిమాపక సామగ్రి తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు యూఏఈ దిగ్గజ సంస్థ నాఫ్కో ప్రకటించింది. ఈ మేరకు నాఫ్కో కంపెనీ సీఈవో ఖాలిద్ అల్ ఖతీజ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం కేటీఆర్‌తో సమావేశమైంది. న్యాక్‌తో కలిసి అంతర్జాతీయస్థాయి ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలన్న కేటీఆర్ ప్రతిపాదనకు నాఫ్కో అంగీకరించింది. కాగా, తెలంగాణలో తమ కార్యకలాపాల విస్తరణకు రూ.215 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రపంచ దిగ్గజ పోర్ట్ ఆపరేటర్ డీపీ వరల్డ్ ప్రకటించింది. మంత్రి కేటీఆర్‌తో డీపీ వరల్డ్ గ్రూప్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు అనిల్ మెహతా, ప్రాజెక్టు డెవలప్‌మెంట్ డైరెక్టర్ సాలుష్ శాస్త్రి మంగళవారం దుబాయ్‌లో భేటీ అయ్యారు. డీపీ వరల్డ్ హైదరాబాద్‌లో తన ఇన్‌లాండ్ కంటైనర్ డిపో ఆపరేషన్ కోసం రూ.165 కోట్లు, మేడ్చల్ ప్రాంతంలో 5,000 ప్యాలెట్ కెపాసిటీ కలిగిన కోల్డ్ స్టోరేజ్ వేర్‌హౌస్‌ను రూ.50 కోట్లతో ఏర్పాటు చేస్తామని ప్రకటించింది.

సింగరేణిని సామంత ప్రాంతంగా ఉపయోగించుకుంటున్నారు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపాటు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని సామంత ప్రాంతంగా ఉపయోగించుకుంటోందని, రాష్ట్రం ఏర్పడిన నాడు 3,540 బ్యాంక్ బాండ్స్‌తో లాభాల్లో ఉన్న సింగరేణి ఇప్పుడు బకాయిలు రాక నష్టాల పాలైందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణిలో గతంలో 65 వేలున్న కార్మికుల సంఖ్య 42 వేలకు పడిపోయిందని తెలిపారు. కార్మికుల వేతన బకాయిలు 23 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, రూ.2,200 కోట్ల లాభంలో రూ.754 కోట్ల వాటా కార్మికులకు రావాలని చెప్పారు. పరేడ్ గ్రౌండ్స్‌లో తమ సభ నిర్వహణకు అనుమతివ్వాలని, సభ నిర్వహణ విషయంలో బీజేపీ తన కుంచితత్వాన్ని మానుకోవాలని జీవన్‌రెడ్డి హితవు పలికారు.

ఎన్టీపీసీ తెలంగాణ మొదటి యూనిట్ ట్రయల్ రన్ సక్సెస్

జ్యోతినగర్: ఎన్టీపీసీ సంస్థ ప్రతిష్టాత్మకంగా పెద్దపల్లి జిల్లా రామగుండంలో నిర్మిస్తున్న తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్ టీపీపీ) మొదటి యూనిట్ 72 గంటలపాటు నిరంతర విద్యుత్ ఉత్పత్తి చేసింది. ఈ నెల 2న పది గంటల నుంచి మంగళవారం రాత్రి (5వ తేదీ) పది గంటల వరకు 812.0 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. తెలంగాణ స్టేజ్–1లో నిర్మితమవుతున్న 1,600 మెగావాట్ల రెండు విద్యుత్ ప్లాంట్లలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల మొదటి యూనిట్ వివిధ దశల అనంతరం 72 గంటల నిరంతర విద్యుత్ ఉత్పత్తి పూర్తి చేయడంతో వాణిజ్యపరమైన ఉత్పత్తికి అర్హత సాధించింది. రెండురోజుల్లో కమర్షియల్ ఆపరేటింగ్ డేట్/సీవోడీని ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. సీవోడీ ప్రకటన తర్వాత విద్యుత్ కేంద్రాన్ని గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. 800 మెగావాట్ల రెండో యూనిట్ సైతం ఇటీవల సింక్రనైజేషన్ పూర్తి చేసుకుంది. మరో నెల రోజుల్లో రెండో యూనిట్‌ను సైతం పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి దశలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

గౌరవెల్లి ప్రాజెక్టుకు సీసీ కెమెరాలు పెట్టండి

గోదావరి బోర్డుకు ఎన్జీటీ ఆదేశం

- అనుమతులు పొందే వరకు పనులు ఆపేయండి
- తెలంగాణకు తేల్చిచెప్పిన గ్రీన్‌ట్రిబ్యునల్

సాక్షి, హైదరాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నిర్మాణపనులు జరగకుండా పర్యవేక్షించాలని గోదావరి నదీయాజమాన్య బోర్డు(జీఆర్‌ఎంబీ)కి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ) చెన్నై బెంచ్ ఆదేశించింది. సిద్దిపేట జిల్లాకు చెందిన బద్దం భాస్కర్‌రెడ్డి తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను ఆగస్టు 28న ఎన్జీటీ చెన్నై బెంచ్ జ్యుడీషియల్ మెంబర్ జస్టిస్ పుష్ప సత్యనారాయణ, ఎక్స్‌పర్ట్‌మెంబర్ సత్యగోపాల్ విచారించి ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు మంగళవారం విడుదలయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని గౌరవెల్లి ప్రాజెక్టు నుంచి 1.41 టీఎంసీలు తీసుకునేందుకు అనుమతులు ఉండగా, దాని సామర్థ్యాన్ని 8.23 టీఎంసీలకు పెంచారని, దీనికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఎన్జీటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టులో నీటినిల్వ పెంచడంతో అదనంగా 2 వేల హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉందని గుర్తుచేసింది. తెలంగాణ తరఫున వాదనలు వినిపించిన అడిషనల్ అడ్వొకేట్ జనరల్ ప్రాజెక్టు పనులు 85 శాతం పూర్తయ్యాయని ట్రిబ్యునల్‌కు తెలిపారు. ఆయా పనులకు సంబంధించిన ప్రొటెక్షన్ వర్క్స్ మాత్రమే చేస్తున్నామనడం ద్వారా ఆయన పనులు కొనసాగిస్తున్నట్టు ఒప్పుకున్నారని ఎన్జీటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. అన్ని అనుమతులు తీసుకునే వరకు ప్రాజెక్టు పనులు చేయొద్దన్న తమ ఆదేశాలను ఇది ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. ఇకపై తమ ఆదేశాలు ఉల్లంఘించకుండా ప్రాజెక్టు వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని గోదావరి బోర్డును ఆదేశించింది. ప్రాజెక్టుకు అన్ని చట్టపరమైన అనుమతులు పొందే వరకు అక్కడ ఎలాంటి పనులు కొనసాగించరాదని, ఒకవేళ తమ ఆదేశాలను ధిక్కరిస్తే దానికి నీటి పారుదల శాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. తదుపరి విచారణను అక్టోబర్4కి వాయిదా వేసింది.

పోలీసులకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి

ట్రైనింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: విధినిర్వహణలో పోలీసు అధికారుల నైపుణ్యత పెరిగేలా ఉత్తమ శిక్షణ ఇవ్వాలని పోలీస్ ట్రైనింగ్ కళాశాలల ప్రిన్సిపాళ్లను డీజీపీ అంజనీకుమార్ ఆదేశించారు. కేవలం వ్యక్తిగత కార్యాచరణపై దృష్టి పెట్టకుండా టీమ్ స్పిరిట్‌ను పెంపొందించేలా అభ్యర్థులకు శిక్షణ ఉండాలన్నారు. రాష్ట్రంలోని 29 పోలీసు శిక్షణ సంస్థల ప్రిన్సిపల్స్, వైస్ ప్రిన్సిపల్స్, ట్రైనీ అధికారులతో మంగళవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ట్రైనింగ్ ఐజీ తరుణ్‌జోషితో కలిసి అంజనీకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, నిపుణులైన శిక్షకులతో అభ్యర్థులకు ఆన్‌లైన్ సెషన్‌లను నిర్వహించాలని, సాంకేతికతను ఉపయోగించుకోవడంలో వారికి సహాయపడాలని ట్రైనింగ్స్ ఐజీ తరుణ్ జోషిని కోరారు. సాధారణ శిక్షణ తరగతులతో పాటు జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓ, జిల్లా అటవీ అధికారి, విశ్వవిద్యాలయాల సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర విద్యావేత్తలతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. ఇండోర్ మరియు అవుట్‌డోర్ శిక్షణ మాడ్యూల్స్‌ను ఐజీ తరుణ్‌జోషి వివరించారు. శిక్షణ సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు రూ. 17.20 కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికే చాలావరకు పూర్తయ్యాయని ఐజీ రమేశ్ పేర్కొన్నారు.

కోర్టు ధిక్కరణ కేసులో ఇద్దరికి 6 నెలల జైలు

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో విశ్వభారతి ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ఎం.రత్నారెడ్డి, నార్సింగ్ మున్సిపల్ కమిషనర్ పి.సత్యబాబులకు హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష, రూ. 2 వేలు జరిమానా విధించింది. ఈ తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు పది రోజుల గడువు ఇచ్చింది. అప్పటి వరకు తీర్పు అమలును నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేసిన రత్నారెడ్డి, అక్రమ నిర్మాణాలను పాక్షికంగా కూల్చివేసి వదిలేసినందుకు కమిషనర్ సత్యబాబుకు శిక్ష విధిస్తూ జస్టిస్ కె.లక్ష్మణ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2021, అక్టోబర్ 27 నాటి ఉత్తర్వులకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేసినా చర్యలు లేవంటూ వీరిపై దాఖలైన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై ఇటీవల తీర్పు వెలువరించారు. మంచిరేవుల గ్రామంలోని రెండు ఎకరాలను విశ్వభారతి లీజుకు తీసుకుని నిర్మాణాలకు హెచ్‌ఎండీఏకు దరఖాస్తు చేసుకుంది. నిర్దిష్ట గడువులోగా అనుమతులు రాకపోవడంతో చట్ట ప్రకారం వచ్చినట్లుగా భావించి నిర్మాణాలు చేపట్టింది. మున్సిపాలిటీ నోటీసులు జారీ చేయడంతో రత్నారెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. అనుమతులు ఇవ్వనందున నిర్మాణాలు చేపట్టినట్లుగా పిటిషనర్ సమాచారం ఇవ్వలేదని తప్పుపట్టింది. హెచ్‌ఎండీఏ నోటీసుల్ని పిటిషనర్ సవాల్ చేయకుండా నిర్మాణాలు చేపట్టడంపై హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ నమోదు కాగా, ఇటీవల పైవిధంగా తీర్పు చెప్పింది.

'మల్లన్నసాగర్' గెజిట్ ప్రింటింగ్‌కు రాసిన లేఖ సమర్పించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం సిద్దిపేట జిల్లా ముట్రాజ్‌పల్లిలో భూసేకరణకు సంబంధించి గెజిట్ జారీ కోసం ప్రింటింగ్‌కు రాసిన లేఖను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కోర్టును తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. చేసిన పనులను సమర్థించుకునేందుకు తప్పులు చేస్తే సహించేది లేదని చెప్పింది. తదుపరి విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది. ఆర్ అండ్ ఆర్ కాలనీ కోసం 102 ఎకరాల సేకరణ నిమిత్తం 2021, జనవరి 31న ఇచ్చిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ బాలాజీ స్పిన్నర్స్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీన్ని సింగిల్ జడ్జి కొట్టివేయడంతో అప్పీల్ వేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. గతంలో గెజిట్ జారీకి సంబంధించి రిజిస్టర్‌లో ఎంట్రీలు నమోదు చేసిన వారి వివరాలను ప్రభుత్వ న్యాయవాది సంజీవ్‌కుమార్ అందజేశారు.

40 బీసీ కులాలను ఓబీసీ జాబితాలో చేర్చండి

జాతీయ బీసీ కమిషన్‌కు బీబీ పాటిల్, కె.లక్ష్మణ్, శుభప్రద్ పటేల్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలోని వీరశైవ లింగాయత్, లింగ బలిజలతో పాటు 40 కులాలను జాతీయ ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహీర్‌ను.. ఎంపీలు బీబీ పాటిల్, కె.లక్ష్మణ్ కోరారు. మంగళవారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో హన్స్‌రాజ్ గంగారాం ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ విచారణకు రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్, కోశాధికారి దినేశ్ పాటిల్ సహా తెలంగాణ ప్రభుత్వం తరఫున బీబీ పాటిల్, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్‌తో పాటు లక్ష్మణ్ తదితరులు హాజరయ్యారు. తెలంగాణకు చెందిన 40 కులాలు ఓబీసీ జాబితాలో లేకపోవటం వలన ఆ వర్గాలకు చెందిన బీసీలు.. కేంద్రంలో విద్య, ఉద్యోగ పరంగా రిజర్వేషన్ల ఫలాలు కోల్పోతున్నారని జాతీయ బీసీ కమిషన్‌కు నివేదిక సమర్పించారు.

క్లుప్తంగా...

భారత్ మాతాకీ జై

'ఎక్స్'లో షేర్ చేసిన అమితాబ్ బచ్చన్

ముంబై: దేశం మార్పు అంశంపై ఒకవైపు రగడ కొనసాగుతుండగా, మరోవైపు బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో 'భారత్ మాతాకీ జై' అని షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది. జాతీయ జెండాను పోలిన మూడు రంగుల ఎమోజీని సైతం ఆయన షేర్ చేశారు. దేశం పేరును మార్చడానికి అమితాబ్ మద్దతు ప్రకటించారని నెటిజన్లు కొందరు అభిప్రాయపడుతున్నారు.

జిల్ బైడెన్‌కు కరోనా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భార్య, దేశ ప్రథమ పౌరురాలు జిల్ బైడెన్ కోవిడ్ బారినపడ్డారు. సోమవారం ఆమెకు పరీక్షలు నిర్వహించగా, కరోనా పాజిటివ్‌గా తేలినట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ చెప్పారు. జిల్ బైడెన్‌కు స్వల్ప లక్షణాలే ఉన్నాయని తెలిపారు. అధ్యక్షుడు బైడెన్‌కు మాత్రం కరోనా నెగటివ్‌గా నిర్ధారణ అయినట్లు వెల్లడించారు. జిల్ బైడెన్ ప్రస్తుతం డెలావెర్‌లోని ఇంట్లోనే గడుపుతున్నారు. ఈ పరిస్థితుల్లో మరో రెండు రోజుల్లో ఢిల్లీలో జరుగనున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు బైడెన్ హాజరవుతారని శ్వేతసౌధం ప్రకటించింది. గురువారం బైడెన్ భారత్‌కు బయల్దేరి వెళ్తారు.

రాహుల్ సభ్యత్వ పునరుద్ధరణ నోటిఫికేషన్ రద్దు చేయండి

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ ఆగస్టు 7న జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. లక్నోకు చెందిన అడ్వొకేట్ అశోక్ పాండే మంగళవారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం -1951లోని ఆర్టికల్ 102కు చెందిన సెక్షన్ 8(3) ప్రకారం రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడం చెల్లదని పేర్కొన్నారు. కోర్టులో ఆయన అప్పీల్‌పై విచారణ పూర్తయ్యే దాకా లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించలేరని స్పష్టం చేశారు. ఇందులో లోక్‌సభ స్పీకర్, కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంతో పాటు రాహుల్ గాంధీని ప్రతివాదులుగా చేర్చారు. వయనాడ్ లోక్‌సభ స్థానం ఖాళీగా ఉన్నట్లు ప్రకటించాలని, అక్కడ మళ్లీ ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని పిటిషనర్ అశోక్ పాండే కోరారు. మోదీ ఇంటి పేరుపై వ్యాఖ్యల నేపథ్యంలో పరువు నష్టం కేసులో రాహుల్‌పై అనర్హత వేటు పడడం, లోక్‌సభ సభ్యత్వాన్ని కోల్పోవడం, సుప్రీంకోర్టు ఇచ్చిన స్టేతో మళ్లీ దక్కించుకోవడం తెలిసిందే.

ఇది దేనికి సంకేతం? తెరపైకి భారత్..!

అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్న మోదీ సర్కారు అతి త్వరలో మన దేశం పేరును కూడా భారత్‌గా మార్చే ఆలోచనలో ఉందా? జీ 20 దేశాధినేతలకు తాజాగా కేంద్రం లాంఛనంగా పంపిన విందు ఆహ్వానంలో రాష్ట్రపతి హోదాను ఇంగ్లిష్‌లో ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా అని కాకుండా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని పేర్కొనడం ఇప్పుడు సర్వత్రా ఆసక్తి రేపుతోంది. దేశం పేరు మార్పు దిశగా కేంద్రం నుంచి త్వరలో రానున్న ప్రకటనకు ఇది కచ్చితమైన ముందస్తు సంకేతమేనని అనుమానిస్తున్నారు. – నేషనల్ డెస్క్, సాక్షి

త్వరలో సార్వత్రిక ఎన్నికలు

- మెజారిటీ ఓటర్లను ఆకట్టుకోవడం..
- విపక్ష 'ఇండియా' కూటమిని పేరు మార్పుతో దెబ్బ కొట్టడం...
- ఒక్క నిర్ణయంతో రెండు లక్ష్యాల సాధనే ఆంతర్యం?



జీ 20 దేశాధినేతలకు పంపిన విందు ఆహ్వానంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని కేంద్రం పేర్కొనడం రాజకీయంగా పెను దుమారమే రేపుతోంది. కానీ మన దేశం పేరును ఇండియా నుంచి భారత్ గా మార్చాలన్న చర్చ నిజానికి చాలాకాలంగా జరుగుతున్నదే...

- కేంద్రంలో మోదీ సారథ్యంలోని – బీజేపీ సర్కారు కూడా దీన్ని ఎన్నోసార్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా సమర్థిస్తూనే వచ్చింది, వస్తోంది. బ్రిటిష్ వలస వాసనలను సమూలంగా వదిలించుకోవాల్సిందేనని పదేపదే చెబుతోంది. ఆ దిశగా ఎన్నో చర్యలు చేపడుతోంది.
- 150 ఏళ్లకు పైగా అమల్లో ఉన్న ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఎవిడెన్స్ యాక్ట్ వంటి బ్రిటిష్ జమానా నాటి పేర్లకు భారత్ పేరు చేరుస్తూ తీసుకున్న తాజా నిర్ణయం అలాంటిదే.
- ఇటీవల ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఈ మేరకు బిల్లులు ప్రవేశపెడుతూ కేంద్రం అనూహ్య నిర్ణయం తీసుకోవడం తెలిసిందే.
- త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ నెగ్గి హ్యాట్రిక్ కొట్టాలని పట్టుదలగా ఉన్న మోదీ సర్కారు, మెజారిటీ ఓటర్ల భావోద్వేగాలతో ముడిపడ్డ ఇలాంటి మరిన్ని నిర్ణయాలు తీసుకోవడం ఖాయమని పరిశీలకులు అప్పుడే అభిప్రాయపడ్డారు. ఆ అంచనాలు సత్య దూరం కాదనేందుకు తాజా 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' ఆహ్వానాలే నిదర్శనమని భావిస్తున్నారు.

ఒకటో అధికరణాన్నే మార్చేయాలి!

ఈ నేపథ్యంలో దేశం పేరు మార్పుకు సంబంధించి రాజ్యాంగ నిబంధనలు ఏం చెబుతున్నాయి, సుప్రీంకోర్టు ఏం చెప్పింది అన్నది ఆసక్తికరంగా మారింది.

- రాజ్యాంగంలోని తొలి అధికరణే మన దేశాన్ని 'ఇండియా. అంటే భారత్. రాష్ట్రాల సమాఖ్య' అని స్పష్టంగా పేర్కొంటోంది.
- అంటే, ఇండియా, భారత్ రెండింటినీ మన దేశ అధికారిక నామాలుగా ఒకటో అధికరణే గుర్తిస్తోందన్నది ఇక్కడ ఆసక్తికర అంశం.
- ఇప్పుడు వాటిలోంచి ఇండియాను తొలగిస్తూ, భారత్‌ను మాత్రమే ఏకైక అధికారిక నామంగా గుర్తించాలని కేంద్రం భావిస్తోందా అన్నది ఇక్కడ కీలకమైన అంశం.
- అలా జరగాలంటే ఆ మేరకు ఒకటో అధికరణాన్ని సవరించాల్సి ఉంటుంది.

నచ్చిన పేరుతో పిలుచుకోవచ్చు

'భారతా? ఇండియానా? మన దేశాన్ని భారత్ అని పిలుచుకుంటారా? భేషుగ్గా పిలుచుకోండి. అదే సమయంలో ఎవరన్నా ఇండియా అని పిలవాలని అనుకుంటే అలాగే పిలవనివ్వండి'

– 2016లో నాటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ వ్యాఖ్య

గట్టిగా వ్యతిరేకించిన సుప్రీంకోర్టు

- మన దేశం పేరును ఇండియా నుంచి భారత్ గా మార్చాలన్న యోచనను సుప్రీంకోర్టు గట్టిగా వ్యతిరేకించడం విశేషం. ఈ మేరకు కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ 2016లో దాఖలైన పిల్‌ను నాటి సీజేఐ జస్టిస్ టీఎస్ ఠాకూర్ సారథ్యంలోని ధర్మాసనం కొట్టేసింది. ఇలాంటి పిటిషన్లను ప్రోత్సహించే సమస్యే లేదని కుండబద్దలు కొట్టింది.
- 2020లో కూడా ఇలాంటి మరో పిల్‌ను తిరస్కరించింది. దాన్ని విజ్ఞాపనగా మార్చి సరైన నిర్ణయం కోసం కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నాటి సీజేఐ జస్టిస్ ఎస్ ఏ బొబ్డే సూచించారు.

జంబూ ద్వీపం నుంచి ఇండియా దాకా..

అతి ప్రాచీనమని భావించే జంబూ ద్వీపం మొదలుకుని భారత్, హిందూస్తాన్ నుంచి ఇండియా దాకా. ఎన్నో, మరెన్నో పేర్లు. మన దేశానికి ఉన్నన్ని పేర్లు ప్రపంచంలో మరే దేశానికీ లేవేమో!

- ఇంగ్లీష్ వాడకంలో మన దేశాన్ని ఇండియా అని, స్థానికులు భారత్ అని అంటారు. పాలక వర్గం ఇండియా అని, పాలిత (సామాన్య) వర్గం భారత్ అని అంటారు.

జంబూ ద్వీపం

పురాణాలు, ప్రాచీన గ్రంథాలలో మన దేశాన్ని జంబూ ద్వీపం అన్నారు. జంబూ అంటే నేరేడు పండు. అప్పట్లో మన దేశంలో ఆ చెట్లు విస్తారంగా ఉండేవి గనుక ఆ పేరు వచ్చిందని అంటారు. నాటి మన సువిశాల దేశపు ఆకృతి కూడా నేరేడు ఫలం మాదిరే ఉండేదని, అందుకే ఆ పేరు వచ్చిందని కూడా అంటారు. చైనా యాత్రికుడు ఫాహియాన్ కూడా మన దేశాన్ని అదే పేరుతో ప్రస్తావించడం విశేషం. 'జంబూ ద్వీపం ఉత్తరాన విశాలంగా, దక్షిణాన సన్నగా ఉంటుంది. అక్కడి ప్రజల ముఖాలు అలాగే ఉంటాయి' అని తన యాత్రా చరిత్రలో రాసుకొచ్చాడు.

హిందూస్తాన్, ఇండియా

బ్రిటిష్ వలస పాలన దాకా మనకు హిందూస్తాన్ అనే పేరు వాడుకలో ఉండేది. తర్వాత బ్రిటిష్ వారు మన దేశం పేరును ఇండియాగా మార్చారు. ఈ రెండు పేర్లూ సింధు నది నుంచి వచ్చినట్టు చెబుతారు. నాటి భారత ఉప ఖండానికి సింధు నది సరిహద్దుగా ఉండేది. దానికి ఈవలి వైపున ఉన్న దేశం అనే అర్థంలో తొలుత తురుష్కులు ముఖ్యంగా పర్షియన్లు మనను హిందూస్తాన్ అని పిలిచారు. సింధులో 'స' అక్షరాన్ని వాళ్లు 'హ'గా పలుకుతారు గనుక అలా పేరు పెట్టారు. అలా సనాతన ధర్మం పేరు హిందూ మతంగా మారింది.

భారత్

భరతుడనే పౌరాణిక చక్రవర్తి పేరిట మన దేశానికి భారత్ అని పేరు వచ్చినట్టు ఐతిహ్యం. విశ్వామిత్రుడు, మేనక సంతానంగా పుట్టి ముని కన్యగా పెరిగిన శకుంతలకు, మహారాజు దుష్యంతునికి పుట్టినవాడే భరతుడు.

▶ మొదటి పేజీ తరువాయి

ఉపయోగిస్తే తప్పేమిటని అధికార బీజేపీ నాయకులు ఎదురు దాడికి దిగారు.

పేరు మార్చే హక్కు ఎవరికీ లేదు: శరద్ పవార్

మనకు ఇండియా అంటే భారత్, ప్రపంచదేశాలకు మన దేశం కేవలం ఇండియాగానే తెలుసని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. కేవలం భారత్ అనే పేరును వాడాల్సిన అవసరం ఇప్పటికిప్పుడు ఏమొచ్చిందని ప్రశ్నించారు. బీజేపీయేతర పార్టీల కూటమికి ఇండియా అనే పేరుపెట్టడం బీజేపీకి మింగుడు పడడం లేదని, అందుకే దేశం పేరును భారత్ మార్చాలని కోరుకుంటోందని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఆక్షేపించారు. ఇండియాను మార్చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన బీజేపీ తొమ్మిదేళ్ల తర్వాత చేస్తున్నది కేవలం పేరు మార్చడమేనని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని 'ఇండియా'ఓడిస్తుందన్నారు. ప్రతిపక్ష 'ఇండియా'కూటమి తమ పేరును 'భారత్'గా మార్చుకుంటే, ఆ పేరును కూడా బీజేపీ మార్చేస్తుందా? ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రశ్నించారు. దేశం పేరు మార్చే హక్కు ఎవరికీ లేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ తేల్చిచెప్పారు. ''భారత్.. అంటే ఇండియా. రాష్ట్రాల సమాహారమే ఇండియా అని రాజ్యాంగంలోని ఆర్టికల్ 1 చెబుతోంది. అలాంటి రాష్ట్రాల సమాహారంపై మోదీ ప్రభుత్వం దాడి చేస్తోంది. డిజిటల్ ఇండియా, స్టార్టప్ ఇండియా, న్యూ ఇండియా అనే పేర్లను బీజేపీ ప్రభుత్వమే తీసుకొచ్చింది. ఇండియా షైనింగ్ అంటూ గతంలో బీజేపీ ఎన్నికలకు వెళ్లింది. ప్రధాని మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు. దేశాన్ని విభజిస్తున్నారు. దేశం పేరును మార్చాలనుకుంటే కచ్చితంగా అడ్డుకుంటాం''కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ హెచ్చరించారు. 'ఇండియా'పేరుకు లెక్కగట్టలేనంత బ్రాండ్ విలువ ఉందని, దేశం పేరును మార్చే పిచ్చి పనిని బీజేపీ చేయదని తాను భావిస్తున్నానని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ చెప్పారు.



ఆహ్వాన పత్రిక

భారత్ కాకుండా ఇంకెలా పిలవాలి?: రాజీవ్ చంద్రశేఖర్

మన దేశం పేరు భారత్ అయినప్పుడు 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్'అని పేర్కొంటే తప్పేమిటని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ నిలదీశారు. ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. భారత్‌ను భారత్ అని కాకుండా ఇంకేలా పిలవాలని ప్రశ్నించారు. ప్రాచీన కాలం నుంచి భారత్ అనే పేరు వాడుకలో ఉందని బీజేపీ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ గుర్తు చేశారు. భారతమాత, వందేమాతరం మన రక్తంలోనే ఉన్నాయని చెప్పారు. భారత్ అనే పేరును తుడిచిపెట్టేయడానికి కొత్త ఖిల్జీలు, కొత్త మొఘల్ రాజులు పుట్టుకొచ్చారని ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు. మన దేశం 'రిపబ్లిక్ ఆఫ్ భారత్'అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఉద్ఘాటించారు. మన నాగరికత అమృతకాలం వైపు సాగుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. 'భారత్'ను ఓడించడానికే ప్రతిపక్ష కూటమి 'ఇండియా'అనే పేరు పెట్టుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి భారత్ అంటే నచ్చదని చెప్పారు.

'ఇండియా'ను ఇక మరచిపోదాం: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: జీ20 దేశాధినేతలకు రాష్ట్రపతి ద్రౌపదీ తరఫున రాష్ట్రపతి భవన్ పంపించిన ఆహ్వాన పత్రికలో భారత్ అనే పేరును ఉపయోగించడం పట్ల వీహెచ్‌పీ హర్షం వ్యక్తం చేసింది. ఇండియా అనే పేరును ఇకపై మరచిపోదామని దేశ ప్రజలకు పిలుపునిచ్చింది. 'ప్రెసిడెంట్ ఆఫ్ భారత్'ను మనం గర్వకారణంగా భావించాలని వీహెచ్‌పీ జాతీయ అధికార ప్రతినిధి వినోద బన్సల్ పేర్కొన్నారు. 'ఇండియా' బదులు 'భారత్'ను ఉపయోగించాలని ఆర్ఎస్ఎస్ అధినేత భగవత్ ఇటీవల అన్నారు.

ముడుపుల కేసులో గెయిల్ ఈడీ అరెస్ట్

న్యూఢిల్లీ: గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్ల నుంచి ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలపై గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా(గెయిల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ప్రాజెక్టులు) కేబీ సింగ్‌ను కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) అరెస్ట్‌చేసింది. కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చినందుకు ఈయన రూ.50 లక్షల లంచం తీసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. కేబీ సింగ్‌తోపాటు మరో నలుగురిని సీబీఐ అరెస్ట్‌చేసింది. వీరిలో వడోదర కేంద్రంగా పనిచేసే అడ్వాన్స్‌డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ డైరెక్టర్ సురేందర్ కుమార్ ఉన్నారు. ఈ కేసులో ఢిల్లీ, నోయిడా, విశాఖపట్నంలో సీబీఐ సోదాలు జరుగుతున్నాయి.

దేశం పేరు మారితే ఆ వెబ్‌సైట్లకు కష్టాలు

తమ పేరులో .ఇన్ కలిపి ఉన్న వెబ్‌సైట్లకు ఎదురుకానున్న ఐడెంటిటీ సమస్యలు

ఇండియా పేరు భారత్‌గా మారితే దేశంలోని వేలాది వెబ్‌సైట్లకు కష్టాలు మొదలుకానున్నాయి. ఎందుకంటే చాలా వెబ్‌సైట్లు తమ పేర్లలో .ఇన్ అనే డొమైన్‌ను వాడుతున్నాయి. ఇన్నాళ్లూ ఇండియా పేరు ఉంది కాబట్టే ఇండియా స్పెల్లింగ్‌లోని తొలి రెండు అక్షరాలు అయిన ఐఎన్‌లను ఆయా వెబ్‌సైట్ల పేరు చివరన పెట్టుకున్నాయి. .ఇన్ డొమైన్‌ను కంట్రీ కోడ్ టాప్ లేయర్ డొమైన్(టీఎల్‌డీ) అంటారు. దేశం పేరు ఇండియా నుంచి భారత్‌కు మారితే .ఇన్ అనే డొమైన్ భారత్ అనే కొత్త పేరును ప్రతిబింబించదు. అప్పుడు భారత్ అనగానే ఠక్కున స్ఫురించేలా కొత్త టీఎల్‌డీ(డొమైన్)కు మారితే బాగుంటుంది. భారత్ ఇంగ్లిష్ స్పెల్లింగ్‌లోని బీహెచ్ లేదా బీఆర్ ఇంగ్లిష్ అక్షరాలతో కొత్త డొమైన్‌ను వాడాలి. అంటే .బీహెచ్ లేదా .బీఆర్ అని ఉంటే సబబుగా ఉంటుంది. కానీ ఈ రెండు డొమైన్‌లను ఇప్పటికే వేరే దేశాలకు కేటాయించారు. దీంతో వెబ్‌సైట్ పేరు చూడగానే ఇది భారత్‌దే అని గుర్తుపట్టేలా ఉండే కొత్త డొమైన్ మనకిప్పుడు అందుబాటులో లేదు. అదే ఇప్పుడు అసలు సమస్య. ఎన్ఐఎక్సై వారు ఇన్‌రిజిస్ట్రీ సంస్థ ద్వారా .ఇన్ డొమైన్‌ను రిజిస్టర్ చేశారు. ప్రత్యేకమైన అవసరాల కోసం ఇందులోనే సబ్‌డొమైన్‌లను సృష్టించి కొన్ని సంస్థలకు కేటాయించారు. ఉదాహరణకు జీఓవీ.ఇన్ అనే డొమైన్‌ను భారత ప్రభుత్వ రంగ సంస్థలు వాడుకుంటున్నాయి. ఎంఐఎల్.ఇన్ అనే డొమైన్‌ను దేశ సైన్యం వినియోగిస్తోంది. ఒక్కో డొమైన్ ఒక్కో దేశాన్ని వెంటనే స్ఫురణకు తెచ్చేలా ప్రాచుర్యం పొందాయి. ఉదాహరణకు .సీఎన్ అనగానే చైనా వెబ్‌సైట్లు, .యూఎస్ అనగానే అమెరికా వెబ్‌సైట్లు, .యూకే అనగానే బ్రిటన్ వెబ్‌సైట్లు గుర్తొస్తాయి. భారత్‌లోని చాలా ప్రముఖమైన వెబ్‌సైట్లు సైతం తమ ఐడెంటిటీ(గుర్తింపు)ను నిలబెట్టుకున్నాయి. మార్కెట్లో ప్రాచుర్యం పొందాయి. ఇప్పుడు ఒక్కసారిగా డొమైన్ మారిపోతే కొత్త డొమైన్‌తో ఆయా వెబ్‌సైట్లకు మళ్లీ అంతటి గుర్తింపు రావడం చాలా కష్టం.

.బీహెచ్, .బీఆర్ మనకు రావేమో!.బీహెచ్, .బీఆర్ అనే భారత్‌కు సరిగ్గా సరిపోతాయి. కానీ ఇప్పటికే .బీహెచ్‌ను బహ్రెయిన్ దేశానికి, .బీఆర్‌ను బ్రెజిల్ దేశానికి, .బీటీను భూటాన్‌కు కేటాయించారు. దీనికి మరో పరిష్కారం ఉంది. డొమైన్‌లోని అక్షరాలను పెంచుకుని .BHARAT, లేదా .BHRT అనే కొత్త డొమైన్‌కు తరలిపోవడమే. కొత్త డొమైన్‌కు మారినాసరే ఆయా వెబ్‌సైట్లు పాత డొమైన్‌లనూ కొనసాగించవచ్చు. వీటి నిర్వహణలో వచ్చే ఇబ్బందేమీ లేదు. అయితే ఆయా సంస్థల అసలు వెబ్‌సైట్ ఏది అనేది గుర్తించడం కష్టమవుతుంది. నకిలీ వెబ్‌సైట్ల బెడద ఒక్కసారిగా పెరిగిపోతుంది. బ్యాంకింగ్ రంగంలో ఇలాంటి సమస్య తలెత్తితే ఇక అంతే సంగతులు. కొత్త డొమైన్ ప్రాచుర్యం పొందాక పాత డొమైన్‌లకు.. ఇవి ఏ దేశానికి చెందినవబ్బా ? అనే కొత్త అనుమానం నెటిజన్లకు కలిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికైతే డొమైన్ పేరు సమస్య ఒక్కటే పొంచి ఉంది. నిజంగానే దేశం పేరు మారితే ఇలాంటి కొత్త రకం సమస్యలు ఏమేం వస్తాయో ఇప్పుడే చెప్పలేం. చూద్దాం.. ఈ డొమైన్‌ల కథ ఏ మలుపు తిరుగుతుందో!

– సాక్షి, నేషనల్ డెస్క్

పార్లమెంట్‌లో 'మోదీ చాలీసా' వద్దు

ప్రజల సమస్యలను లేవనెత్తుతాం: కాంగ్రెస్

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో మోదీ చాలీసాను తాము కోరుకోవడం లేదని, ప్రజా సమస్యలను లేవనెత్తుతామని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత సోనియా గాంధీ నేతృత్వంలో మంగళవారం కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశమైంది. పార్టీ ఎంపీలు హాజరయ్యారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ప్రత్యేక సమావేశాల అజెండాపై ప్రతిపక్షాలతో ప్రభుత్వం చర్చించడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి ప్రభుత్వం ఆ పని చేయలేదని, విపక్షాలను విశ్వాసంలోకి తీసుకోలేదని కాంగ్రెస్‌ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆక్షేపించారు.

రిజర్వేషన్లపై 50% పరిమితి తొలగించాలి: పవార్


జల్‌గావ్: దేశంలో ప్రస్తుతం రిజర్వేషన్లపై అమల్లో 50 శాతం పరిమితిని తొలగించాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధినేత శరద్ పవార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ కోటాను ఇంకా 15 నుంచి 16 శాతం పెంచాలని అన్నారు. ఆయన మంగళవారం మహారాష్ట్రలోని జల్‌గావ్‌లో మీడియాతో మాట్లాడారు. దేశంలో మరికొన్ని ఇతర వెనుకబడిన కులాలకు(ఓబీసీ) రిజర్వేషన్లు కల్పించానికి వీలుగా కోటాను పెంచాల్సిందేనని అన్నారు. ఓబీసీ కోటాలో మరికొన్ని కులాలకు రిజర్వేషన్లు ఇస్తే ఇదే ఓబీసీల్లోని పేదలకు అన్యాయం జరుగుతుందని చాలామంది చెబుతున్నారని, ఈ అంశాన్ని విస్మరించవద్దని సూచించారు. మరికొన్ని కులాలను చేర్చడం వల్ల ఓబీసీల్లోని పేదలకు అన్యాయం జరగకుండా ఉండాలంటే రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించి, కోటాను మరో 15–16 పెంచడమే పరిష్కార మార్గమని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పార్లమెంట్‌లో తాము మద్దతు ఇస్తామని శరద్ పవార్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో తమకు రిజర్వేషన్లు కల్పించాలని మహారాష్ట్రలో మరాఠా సామాజికవర్గం ప్రజలు పోరాడుతున్నారు.

ఆదిత్య ఎల్1 కక్ష్య దూరం మరోసారి పెంపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): సూర్యుడి సంబంధ పరిశోధనల కోసం ఇస్రో ఇటీవల ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహానికి రెండో సారి కక్ష్య దూరం పెంపు ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశారు. ఉపగ్రహంలో ఇంధనాన్ని మండించి కక్ష్య దూరాన్ని పెంచడంతో ఈ ప్రక్రియ విజయవంతమైంది. బెంగళూరులోని ఇస్రో టెలిమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ నుంచి ఈ ప్రక్రియను చేపట్టారు. మారిషస్, బెంగళూరు, పోర్టుబ్లెయిర్‌లలోని గ్రౌండ్‌స్టేషన్ల నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ప్రక్రియను నిశితంగా గమనించారు. రెండోసారి కక్ష్య దూరం పెంపుదలతో ఉపగ్రహం భూమికి దగ్గరగా 282 కిలోమీటర్లు, భూమికి దూరంగా 40,225 కిలోమీటర్ల కక్ష్యలోకి చేరుకుంది. అంటే ప్రస్తుతం 282 x40,225 కిలోమీటర్ల దీర్ఘవృత్తాకార కక్ష్యలో అది తిరుగుతోంది. మొదటి విడతలో 245x22,459 కి.మీ.ల కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టిన విషయం తెల్సిందే. రెండో విడతలో ఉపగ్రహాన్ని 282x40,225 కి.మీ.ల కక్ష్యలోకి తీసుకొచ్చారు. ఈనెల 10వ తేదీన మరోసారి కక్ష్య పెంచుతారు.

ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోలు మృతి

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని అటవీప్రాంతంలో మరోసారి పోలీసులు, మావోల మధ్య కాల్పుల ఘటన జరిగింది. సుక్మా జిల్లా చింతగుఫా పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. సీఆర్‌పీఎఫ్ 223 బెటాలియన్ జవాన్లు, జిల్లా రిజర్వ్ గార్డ్, పోలీసుల బృందం తాడిమెట్ల– దులేడ్ అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం కూంబింగ్ మొదలుపెట్టింది. ఆరు గంటల ప్రాంతంలో జవాన్ల బృందంపై మావోలు మెరుపుదాడి చేశారు. దీంతో జవాన్లు ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో మావోయిస్టులు అడవిలోకి పారిపోయారు. అనంతరం కాల్పులు జరిగిన ఘటనాస్థలిలో జవాన్లు గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను భద్రతా సిబ్బంది గుర్తించారు. వీరిని సోధి దేవా, రవా దేవాగా గుర్తించారు. వీరిద్దరిపై తలో రూ.లక్ష చొప్పున రివార్డు ఉంది.



చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై క్షేమంగా దిగిన ల్యాండర్ విక్రమ్ 3డీ చిత్రమిది. అనాగ్లిఫ్ టెక్నిక్‌ను ఉపయోగించి ఇస్రో ఈ చిత్రాన్ని రూపొందించింది.

ఉదయనిధి తల తెస్తే రూ.10 కోట్లిస్తా

సరిపోదంటే ఇంకా ఇస్తా: అయోధ్య స్వామీజీ పరమహంస ఆచార్య ప్రకటన

న్యూఢిల్లీ: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్‌పై విమర్శలు, బెదిరింపులు ఎక్కువయ్యాయి. అయోధ్యకు చెందిన స్వామీజీ పరమహంస ఆచార్య ఒక అడుగు ముందుకేసి ఉదయనిధి తలకు వెలకట్టారు. ఆయన తల నరికి తెస్తే రూ.10 కోట్లు ఇస్తానని ప్రకటించారు. 'రూ.10 కోట్లు సరిపోదంటే చెప్పండి. ఇంకా ఇస్తా. సనాతన ధర్మాన్ని దారుణంగా కించపరిచే వాళ్లను వదిలే ప్రసక్తే లేదు. దేశంలో కనిపిస్తున్న అభివృద్ధి అంతా సనాతన ధర్మం వల్లే సాధ్యమైంది. భారత్‌లోని 100 కోట్ల మంది ప్రజల మనోభావాలను దెబ్బతీసిన తమిళనాడు రాష్ట్ర మంత్రి బేషరతు క్షమాపణ చెప్పాల్సిందే' అని స్వామీజీ ఆగ్రహంగా మాట్లాడారు. స్వామీజీ వ్యాఖ్యలపై తమిళనాడులోని వెల్లూర్‌లో డీఎంకే నేతలు నిరసన వ్యక్తంచేశారు. స్వామీజీ దిష్టిబొమ్మను దగ్ధంచేశారు.

ఉదయనిధిపై బెంగళూరులో కేసు

సాక్షి బెంగళూరు: సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి, డీఎంకే నేత ఉదయనిధిపై బెంగళూరులోని బనశంకరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బెంగళూరు దక్షిణ బీజేపీ విభాగం అధ్యక్షుడు ఎన్ఆర్ రమేశ్ ఈ కేసు దాఖలు చేశారు. 'వంద కోట్లకుపైగా జనాభా ఆచరించే సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని పిలుపునిచ్చిన ఉదయనిధిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఉదయనిధి తన వ్యాఖ్యల ద్వారా రాజ్యాంగ ఆశయాలకు తూట్లు పొడిచారు. ఇలాంటి ప్రమాదకర వ్యాఖ్యల ద్వారా ప్రేరేపితులైన డీఎంకే కార్యకర్తలు సనాతన ధర్మం ఆచరించే ప్రజలపై దాడులకే తెగబడే ప్రమాదం ఉంది. అందుకే ఉదయనిధిపై చర్యలు తీసుకోండి' అని రమేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

పుతిన్‌తో త్వరలో కిమ్ జోంగ్ ఉన్ భేటీ!

ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయనున్న రష్యా



సియోల్: ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ రష్యా అధినేత పుతిన్‌తో సమావేశం కాబోతున్నారా? ఇందు కోసం త్వరలోనే రష్యాకు బయలుదేరి వెళ్తారా? నిజమేనని అమెరికా అధికార వర్గాలు చెబుతున్నాయి. అమెరికాకు బద్ధ వ్యతిరేకి అయిన కిమ్ జోంగ్ ఉన్ ఇటీవలి కాలంలో పుతిన్‌కు స్నేహ హస్తం అందిస్తున్నారు. ఇద్దరు నేతలు ముఖాముఖి భేటీ అవుతుండడం చర్చనీయాంశంగా మారింది. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యా వద్ద ఆయుధ నిల్వలు వేగంగా నిండుకుంటున్నాయి. అందుకే ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు కొనుగోలు చేయాలని రష్యా నిర్ణయించినట్లు సమాచారం. పుతిన్, కిమ్ సమావేశంలో ఇదే అంశంపై చర్చించే అవకాశం ఉంది. రష్యాకు అందించే సహాయానికి బదులుగా ఆహారం, అత్యాధునిక ఆయుధ టెక్నాలజీని తమకు అందజేయాలని పుతిన్ నుంచి కిమ్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరువురు నేతలు చివరిసారిగా 2019 ఏప్రిల్‌లో కలుసుకున్నారు.

సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోండి

సీజేఐకు ప్రముఖుల లేఖ

న్యూఢిల్లీ: సనాతన ధర్మంపై తమిళనాడు రాష్ట్ర మంత్రి, డీఎంకే సీనియర్ నేత ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు భిన్న వర్గాల నుంచి నిరసన సెగలకు కారణమవుతున్నాయి. తాజాగా మాజీ న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు సైతం ఉదయనిధిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశారు. 14 మంది మాజీ జడ్జీలు, 130 మంది ఉన్నతాధికారులు, 118 మంది మాజీ సైన్యాధికారులుసహా 262 మంది సీజేఐకు లేఖ రాశారు. 'ఉదయనిధి వ్యాఖ్యలు దేశంలోని అత్యధిక జనాభాకు వ్యతిరేకంగా చేసిన విద్వేష ప్రసంగంతో సమానం. ఈ ప్రసంగం భారత రాజ్యాంగం మౌలిక స్వరూపంపై దాడిలా తోస్తోంది. దేశ లౌకిక భావనను కాపాడేందుకు తక్షణం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి చర్యలకు ఉపక్రమించాలి. రాష్ట్ర ప్రభుత్వ పాలనలో తీవ్ర జాప్యం ఒక రకంగా కోర్టు ధిక్కారమే. ఆయనపై చర్యలు తీసుకునేందుకు తమిళనాట డీఎంకే సర్కార్ నిరాకరించడమూ కోర్టు ధిక్కారమే. ఇది శాంతి భద్రతల అంశాన్ని అపహాస్యం చేయడమే అవుతుంది. తమిళనాడు ప్రభుత్వ నిర్లిప్త వైఖరిని కోర్టు ధిక్కారంగా భావించి ఈ అంశంలో డీఎంకే సర్కార్‌ను జవాబుదారీని చేయండి. శాంతిభద్రతల కోసం, విద్వేష ప్రసంగాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోండి' అని ప్రముఖులు ఆ లేఖలో పేర్కొన్నారు.

తూలిపడ్డ నితీశ్



పట్నా: బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ మంగళవారం పట్నా యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో వేదికపై తూలి కిందపడిపోయారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పట్నా వర్సిటీలో జరిగిన కార్యక్రమంలో శిలాఫలకం వద్దకు వెళుతుండగా కాలు మడతపడి కింద పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆయనను పైకి లేపారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023

వరద కాలువను తలపిస్తున్న మూసాపేట్ ప్రధాన రహదారి



● భాగ్యనగరి.. వరద గోదారి!

కాలనీలా.. కాల్వలా!



దంచికొట్టిన వాన.. ముంచెత్తిన వరద

- లోతట్టు ప్రాంతాలు విలవిల
- అపార్టుమెంట్లు జలమయం
- చెరువులను తలపించిన నగర దారులు
- మంగళవారం రికార్డుస్థాయిలో 20 సెం.మీ వర్షపాతం
- నగరంలో భారీగా ట్రాఫిక్ జాం
- బారులు తీరిన వాహనాలు.. గంటలకొద్దీ నరకయాతన
- విద్యా సంస్థలకు సెలవులు
- బాచుపల్లి ప్రగతినగర్ నాలాలో కొట్టుకుపోయి బాలుడి మృతి
- రెజిమెంటల్ బజార్‌లో కూలిపోయిన పురాతన భవనం
- అప్రమత్తమైన డీఆర్‌ఎఫ్ బృందాలు, పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో

ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లు కుండపోతగా కురిసిన వర్షం నగరంలో బీభత్సం సృష్టించింది. జన జీవనాన్ని అతలాకుతలం చేసింది. లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు వరద ఉద్ధృతిలో కొట్టుకుపోయాయి. బాచుపల్లి ప్రగతినగర్ కాలనీ వద్ద ఉన్న నాలాలో పడి బాలుడు మృతి చెందాడు. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులకు చెట్లు నేలకొరిగాయి. రెజిమెంటల్ బజార్‌లో పురాతన భవనం కూలిపోయింది. అందులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

......................................రోడ్లు చెరువులను తలపించాయి. మ్యాన్ హోళ్లు ఓపెన్ చేసినా.. పై నుంచి భారీ ఎత్తున వస్తున్న నీళ్లతో.. ప్రధాన రహదారిపైనే మోకాళ్ల లోతు నీళ్లు నిలిచాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆరాంఘర్ జాతీయ రహదారిపై, శ్రీనగర్ సమీపంలో ఆర్టీసీ బస్సులు వరదలో చిక్కుకుపోయాయి. డీఆర్‌ఎఫ్ బృందాలు, ట్రాఫిక్ పోలీసులు అతికష్టం మీద ఆ బస్సులను వరద నుంచి బయటకు తీశారు..

......................................మొత్తమ్మీద మంగళవారం రికార్డు స్థాయిలో సుమారు 20 సెంటిమీటర్ల వరకు వర్షపాతం నమోదైంది. తెల్లవారు జామున నుంచి ఉదయం 8 గంటల వరకు 14.7 సెం.మీ.. తిరిగి మధ్యాహ్నం వరకు మరో 5.9 సెం.మీ మేర వర్షం కురిసినట్లు వాతావరణశాఖ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఎడతెరిపిలేని వర్షాల కారణంగా హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని విద్యాసంస్థలకు సెలవులను ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

కుండపోత వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ జీహెచ్ఎంసీ, డిజాస్టర్ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి ఎవరూ బయటికి రావద్దని అలర్ట్ ప్రకటించింది.

వర్ష సమస్యలపై కాల్ చేయండి	
	● జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్ : 040- 21 11 11 11
	● డయల్ 100
	● ఈవీడీఎం కంట్రోల్‌రూమ్: 9000113667

కూకట్‌పల్లిలో ట్రాఫిక్ జాం



కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జాం..

● నగర రహదారులపై వరద చేరడంతో వాహనాలు బారులుతీరి భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఎర్రగడ్డ మెయిన్ రోడ్డుపై భారీగా వరద రాకపోకలకు అంతరాయం కలిగించింది. మూసాపేట నుంచి అమీర్ పేట వరకు, కూకట్ పల్లి వై జంక్షన్ నుంచి కూకట్‌పల్లి వరకు మొత్తం ట్రాఫిక్ స్తంభించింది. మధ్యాహ్నం వరకు పలు ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

● శంషాబాద్ వెళ్లే దారిలో మంచిరేవుల వద్ద నార్సింగ్ ఓఆర్‌ఓ పక్కన భారీ కొండ చరియ నుంచి మట్టి కరిగిపోవడంతో బండరాళ్లు దొర్లిపడ్డాయి. బండరాళ్లు రోడ్డు అంచు వరకు వచ్చి ఆగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

➤ మూసారాంబాగ్ వద్ద మూసీ ఉద్ధృతి



ఉద్ధృతంగా మూసీ..

జంట జలాశయాలు హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌కి భారీగా వరద వచ్చి చేరుతోంది. గేట్లు ఓపెన్ చేసి దిగువన వరదనీరు విడుదల చేస్తుండటంతో మూసీలోకి ఉద్ధృతి పెరిగింది. మూసారాం బాగ్ – అంబర్ పేట బ్రిడ్జి పై నీరు నిలవడంతో మూసీలోకి మళ్లించారు. బల్దియా అధికారులు మూసీ పరివాహక ప్రాంతాలు అలర్ట్‌గా ఉండాలంటూ హెచ్చరిక జారీ చేశారు. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అంటూ మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు .



లింగంపల్లి బ్రిడ్జి వద్ద వరద ప్రవాహం

కుండపోతగా..

మహానగర పరిధిలో మంగళవారం తెల్లవారు జామున కుండపోత వర్షం రికార్డు సృష్టించింది. రాత్రి నుంచి ఉదయం 8 గంటల వరకు మియాపూర్‌లో అత్యధికంగా 14.7 సెంటీమీటర్లు.. కూకట్‌పల్లి 14.3, శివరాంపల్లి 13, గాజుల రామారావు 12.5, బోరబండ 12.5, జీడిమెట్ల 12.1, షాపూర్, మూసాపేట్, జూబ్లీహిల్స్ 12, కుత్బుల్లాపూర్ 11.5, మాదాపూర్ 11.4, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ 11.2, బేగంపేట్, కేపీహెచ్‌బీ, అల్వాల్, శేలింగంపల్లి 10, ముషీరాబాద్ 9.9, గోషామహల్ 9.5, మలక్‌పేట్ 9.4, ఫలక్‌నుమా 9.2, కార్వాన్ 8.8, సరూర్‌నగర్ 7.9, ఎల్బీనగర్, అంబర్‌పేట్ 6.6, మల్కాజిగిరి, మౌలాలిలో 4.7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటల వరకు పలు ప్రాంతాల్లో 5.9 సెంటీమీటర్ల వరకు వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

మూసాపేట్ రహదారిపై వరద నీటిలో వాహనదారుల కష్టాలు



మియాపూర్ పటేల్ చెరువుకు గండి

శేరిలింగంపల్లి: లింగంపల్లి అండర్ బ్రిడ్జి వద్ద భారీగా వరదనీరు వచ్చి చేరడంతో లింగంపల్లి నుంచి గచ్చిబౌలి వైపు రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో వాహనదారులు లింగంపల్లి నుంచి లింగంపల్లి ఆర్‌ఓబీ మీదుగా గచ్చిబౌలి వైపు వెళ్లారు. పటేల్‌చెరువుకు గండి పడటంతో కింది భాగంలో ఉన్న శ్రీరాంనగర్, శాంతినగర్, దీప్తిశ్రీనగర్ కాలనీల్లో వరద చేరింది.

లోతట్టు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

పురానాపూల్ బ్రిడ్జిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం సందర్శించారు. జియాగూడలోని కేఎస్ స్వామి నగర్‌లోని లోతట్టు ప్రాంతవాసుల పరిస్థితిని సమీక్షించారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట హైదరాబాద్ ఆర్డీఓ సూర్యప్రకాష్, ఎమ్మార్వో జ్యోతి సంబంధిత అధికారులు ఉన్నారు.



చెరువును తలపిస్తున్న విమాన్‌నగర్ కాలనీ

నీట మునిగిన కాలనీలు..

భారీ వర్షంతో బస్తీలతో పాటు కొత్త కాలనీలు నీట మునిగాయి. వరద నీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. నాలాలు పొంగి ప్రవహించి బస్తీలపై ప్రభావం చూపాయి. చింతల్‌లోని గణేష్ నగర్, కల్పనా సొసైటీ, శ్రీనివాస్ నగర్ కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. జీడిమెట్ల నుంచి వచ్చే కాలువ నిండి పొంగిపొర్లుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్,లింగంపల్లి, కూకట్‌పల్లి, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, మియాపూర్, చందానగర్, శేరిలింగంపల్లి, ఖైరతాబాద్, పంజాగుట్ట, ఎల్‌బీనగర్, హయత్ నగర్, ప్రగతి నగర్, జీడిమెట్ల, సుచిత్ర, కొంపల్లి, దూలపల్లి, దుండిగల్, గండిమైసమ్మ, మల్లంపేట్, బౌరంపేట్, సురారం, జీడిమెట్ల, షాపూర్ నగర్, చింతల్, గాజులరామారం, రాజేంద్రనగర్, అత్తాపూర్, కాటేదాన్, నార్సింగి, మణికొండ, గండిపేట, బండ్లగూడ తదితర అన్నీ ప్రాంతాల్లో వర్షం బీభత్సం సష్టించింది.

కుప్పకూలిన పురాతన భవనం

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లోని ఓ పురాతన భవనం కుప్పకూలింది. భవనంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. 6 నెలల క్రితం జీహెచ్ఎంసీ అధికారులు భవన యజమానిని ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం ఆ భవనం ఖాళీగా ఉంది. మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో భవనం ముందు భాగం ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. వెంటనే జీహెచ్ఎంసీ బేగంపేట సర్కిల్ ఏసీపీ కిష్టఫర్ చైన్‌మెన్లు ప్రకాష్, నర్సింగ్‌రావు, జగదీష్, పాండులు అక్కడికి చేరుకుని చుట్టు పక్కల ఉండే వారిని అప్రమత్తం చేశారు. పురాతన భవనాలకు నోటీసులు జారీ చేశామని ప్రజలు జీహెచ్ఎంసీకి సహకరించాలని కోరారు. భవనాలు ఖాళీ చేయకపోతే తామే ఖాళీ చేయిస్తామని హెచ్చరించారు.





మణికొండలోని ఓ స్వీట్ షాపులోకి చేరిన వరద నీరు



మోకాల్లోతు నీటిలో ఓక్షిత ఎన్‌క్లేవ్ ప్రాంతం



జలమయమైన టోలిచౌకీ రహదారి..



పురానాపూల్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



అయోధ్యనగర్‌లో వరదనీరు చేరిన ఓ ఇంట్లో నివాసితులతో మాట్లాడుతున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే వివేకానంద్, జోనల్ కమిషనర్ మమత..



బాలానగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో..



అల్వాల్: వెంకటాపురం భూదేవినగర్‌లోని ఆర్‌యూబీ వద్ద భారీగా వరద నీరు

ఇంకెన్నాళ్లు నాలా మరణాలు?

- సిటీలో ప్రతిసారీ ఇదే తీరు
- ఎవరిది పాపం..ఎవరికి శాపం?



సాక్షి, సిటీబ్యూరో: విశ్వనగరానికి బాటలు పరుస్తున్న హైదరాబాద్ మహానగరంలో వానలొస్తే..నాలాలు ఉప్పొంగడం...అందులో పడి ఎవరో ఎవరో ఒకరు చనిపోవడం మామూలైపోయింది. అన్నిరంగాల్లో అద్భుతాలు సాధిస్తున్నప్పటికీ, మిగతా నగరాల కంటే వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ వరద కాలువల్లో పడి ప్రాణాలు పోవడం గుండెల్ని పిండి వేస్తోంది. అభం శుభం తెలియని చిన్నారులకు నూరేళ్లు నిండుతుండటం ఎందరినో కలచివేస్తోంది. తాజాగా సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రోడ్లు, కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి. ఈ పరిస్థితుల్లో నిజాంపేట ప్రగతినగర్‌లో నాలుగేళ్ల పసిబాలుడు మిథున్‌రెడ్డి నాలాలో పడి మృతి చెందితే ఆ పాపం ఎవరిది? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హెచ్చరించినా.. వర్షాల వల్ల ప్రజలు మరణించే పరిస్థితులుండరాదని మునిసిపల్ మంత్రి కేటీఆర్ పలు దఫాలుగా హెచ్చరించినా, దారుణం జరిగిపోయింది. గత మూడేళ్లుగా నాలాల్లో పడి చిన్నారులు మరణిస్తుండటం తొలచివేస్తోంది. రెండేళ్ల క్రితం నేరేడ్‌మెట్‌లో సుమేధ అనే బాలిక మరణించడం తెలిసిందే. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గత ఏప్రిల్‌లో పనులు జరుగుతున్న ప్రాంతాల్లో రక్షణ ఏర్పాట్లు లేక సికింద్రాబాద్ కళాసిగూడలో మౌనిక అనే చిన్నారి మృతి చెందింది. తాజా ఘటనలోనూ నాలాపై కప్పు సరిగ్గా లేకపోవడం వల్లే బాలుడు అందులో పడి మరణించాడు. స్థానికుల నిర్లక్ష్యం, అధికారుల అశ్రద్ధ ఇందుకు కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నాలాల్లో మరణాలు...

- 2017 నుంచి నాలాల్లో పడి ఎందరో మరణించారు.
- 2017 ఫిబ్రవరిలో యాకుత్‌పురా నియోజకవర్గంలో నాలాలోపడి జకీర్ అబ్బాస్ (2) అనే బాలుడు మరణించాడు.
- 2018 జనవరిలో చందానగర్ రెడ్డి కాలనీకి చెందిన శివకుమార్ అనే నాలుగేళ్ల బాలుడు నాలాలో పడి మరణించాడు.
- 2018 జూన్‌లో సత్యరాఘవేంద్రనగర్ కాలనీ ఓపెన్ నాలాలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు.
- 2018 సెప్టెంబర్‌లో సరూర్‌నగర్‌లో నాలాలో పడి హరీష్(24) అనే యువకుడు గల్లంతయ్యాడు.
- 2018 అక్టోబర్‌లో బోరబండలో రాజయ్య అనే వ్యక్తి నాలాలో పడి మరణించాడు.
- 2019 సెప్టెంబర్‌లో నాగోల్ దగ్గరి ఆదర్శనగర్ నాలాలో పడి పోచంపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌కుమార్ మరణించాడు.
- 2019లోనే ఇద్దరు అర్చకులు ద్విచక్రవాహనంపై వెళ్తూ నాలాలో పడిపోగా ఒకరు మృతి చెందారు.
- 2020 సెప్టెంబర్ నేరేడ్‌మెట్‌లో నాలాలో పడి సుమేధ(12) అనే బాలిక మృతి చెందింది.
- 2020 నవంబర్‌లో సరూర్‌నగర్ కోదండరామ్‌నగర్‌లో మార్నింగ్‌వాక్‌కు వెళ్లిన వృద్ధురాలు ,సమీంలోని మరో ప్రాంతంలో ఇంకో వ్యక్తి నాలాలో పడి మృతి చెందారు.
- 2021 జూన్‌లో ఓల్డ్‌బోయిన్‌పల్లిలో ఆనంద్ సాయి అనే ఏడేళ్ల బాలుడు నాలాలో పడి మరణించాడు.
- 2021 సెప్టెంబర్‌లో మణికొండలో నాలా కోసం తవ్విన గుంతలో పడి రజనీకాంత్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందాడు.
- 2023 ఏప్రిల్‌లో సికింద్రాబాద్ కళాసిగూడలో నాలాలో పడి మౌనిక అనే నాలుగేళ్ల బాలిక మరణించింది.

రెయిన్ అలర్ట్	లోతట్టు ప్రాంతాల్లో తీరని వెతలు	ఠారెత్తిస్తున్న క్యాబ్‌లు	జంట జలాశయాల గేట్ల ఎత్తివేత	మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత	మైసమ్మగూడలో వరదనీటిలో చిక్కుకున్న హాస్టళ్లు	అధికారులు అప్రమత్తంగా ఉండాలి: తలసాని	వివరాలు 8లో ▸
● భారీ వర్షాల నేపథ్యంలో పోలీసుల అప్రమత్తత	● నిలిచిన వరద నీటితో జనం అవస్థలు ● పర్యటించిన మేయర్, కమిషనర్	● వర్షం కారణంగా బుకింగ్‌లో జాప్యం ● రెట్టింపు చార్జీలతో నిలువుదోపిడి					


కూకట్‌పల్లిలోని ఐడీపీఎల్ నాలాలో నురుగు ప్రవాహం


నిండుకుండలా మారిన హుస్సేన్‌సాగర్


హుస్సేన్‌సాగర్ నుంచి దిగువకు నీటిని వదిలిన దృశ్యం


మేడ్చల్ ఏడవ వార్డులో వరద నీటిని ఎత్తిపోస్తున్న స్థానికులు


జలమయమైన బేగంపేటలోని అల్లంతోట బావి కాలనీ...

రెయిన్ అలర్ట్!

- భారీ వర్షాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం
- కీలక నాలాలు, వాటర్ లాగింగ్ ఏరియాలపై దృష్టి

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పోలీసు విభాగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీ ఘటనలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ సహాయక చర్యల్లో ట్రాఫిక్ పోలీసులతో పాటు శాంతిభద్రతల విభాగం అధికారులూ పాల్గొంటున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలు కురిసినప్పుడు నగరంలో ప్రధానంగా రెండు అంశాలు ఆందోళన కలిగిస్తాయి. నగర వాసుల్ని అమాంతం మింగేసే నాలాలు ఒక ఎత్తైతే.. రోడ్డుపై ఎక్కడికక్కడ ఆగిపోయే వాహనాలు మరో ఎత్తు. ఈ రెంటితో పాటు కాలనీలను ముంచెత్తే వరద నీరు అటు జీహెచ్ఎంసీతో పాటు ఇటు పోలీసు విభాగానికీ సవాల్ విసురుతుంది. ఈ మూడింటినీ దృష్టిలో పెట్టుకున్న ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు.

- ఠాణాల వారీగా తమ పరిధిలో ఉన్న కీలక, ప్రధానమైన నాలాలపై నిఘా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.
- జీహెచ్ఎంసీ అధికారులు నగరంలో దాదాపు అన్ని నాలాలకు ఫెన్సింగ్ నిర్మించారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ నిర్మాణాలు జరగలేదు. మరోపక్క కొన్ని నాలాలు, నాలా వంతెనలపై ఉన్న పాత ఫెన్సింగ్ దెబ్బతిన్నాయి. ఈ ప్రాంతాలను గుర్తించడంతో పాటు అక్కడ నిఘా ఏర్పాటు చేస్తున్నారు.
- అత్యవసరమైన చోట ప్రజలు అటు వైపు వెళ్ళకుండా తాత్కాలిక బారికేడింగ్ వేస్తున్నారు. ఆయా ప్రాంతాల వివరాలను స్థానిక జీహెచ్ఎంసీ అధికారులకు తెలపడం ద్వారా సమస్య పరిష్కారమయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు.
- వర్షాల నేపథ్యంలో వాటర్ లాగింగ్ ఏరియాలతో భారీ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. కొన్ని చోట్ల నీటిలో వాహనాలు ఆగిపోతున్నాయి. ఈ రెండూ వాహనచోదకులకు నరకాన్ని చవి చూపించే అంశాలే.
- ట్రాఫిక్ జామ్స్, వాటర్ లాగింగ్ ఏరియాల క్లియరెన్స్ అంశాల్లో ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని శాంతిభద్రతల విభాగం అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.
- శివార్లలోని కొన్ని కాలనీలు చెరువుల్ని తలపించి వాటితో బయటి ప్రాంతాలకు సంబంధాలు తెగిపోతాయి. గతంలో వర్షాలు కురిసినప్పుడు ఇలా మారిన ప్రాంతాల జాబితాలను పోలీసులు సిద్ధం చేశారు. ఆ ఏరియాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.


సౌభాగ్యనగర్‌లో వరదనీటిలో పర్యటిస్తూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మేయర్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

లోతట్టు ప్రాంతాల్లో తీరని వెతలు

- నిలిచిన వరద నీటితో జనం అవస్థలు
- ఆయా ప్రాంతాల్లో పర్యటించిన మేయర్, కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: ఎప్పటిలాగే నగరం జలమయమైంది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలు యథావిధిగా మోకాళ్ల లోతు నీటిలో మునిగాయి. ఇళ్లల్లోకి వాన నీరు చేరి జనం అవస్థలపాలయ్యారు. ఇక రోడ్లన్నీ చెరువులుగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలున్నప్పటికీ, ముందస్తు జాగ్రత్త చర్యల్లో బల్దియా విఫలమైంది. వెల్లువెత్తిన విమర్శలతో మంగళవారం పది గంటల తర్వాతే...మేయర్ క్షేత్రస్థాయి పర్యటనలు చేశారు. అందిన ఫిర్యాదుల కనుగుణంగా డీఆర్ఎఫ్ బృందాలు ఆయా ప్రాంతాల్లో సహాయకచర్యలు చేపట్టాయి. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ కొన్ని ప్రాంతాల్లో పర్యటించారు.

- ఫతేనగర్ ఆర్‌యూబీ, కుత్బుల్లాపూర్‌లోని అయోధ్యనగర్, గణేష్ నగర్ వరద ముంపు ప్రాంతాల్లో మేయర్ విజయలక్ష్మి పర్యటించారు. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ప్రజల ఇబ్బందులు పరిశీలించారు.
- హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాల గేట్లు తెరచినందున మూసీ లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు.
- మేయర్ వెంట ఖైరతబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దొత్రే ఉన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీలత బేగంపేట తదితర లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి ప్రజల ఇబ్బందులు తెలుసుకున్నారు.

మియాపూర్‌లో పర్యటించిన కమిషనర్

మియాపూర్ సర్కిల్‌లో పటేల్ చెరువు తెగిపోయిన ప్రాంతాన్ని కమిషనర్ రోనాల్డ్‌రాస్ స్థానిక ఎమ్మెల్యే గాంధీతో కలిసి పరిశీలించారు. తెగిపోయిన చెరువుకట్టకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని, చెరువులోని వరదను మత్తడి ద్వారా పంపించాలని అధికారులను ఆదేశించారు. వర్షాల సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఎఫ్‌టీఎల్ దాటిన హుస్సేన్‌సాగర్

హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ 513.41 మీటర్లు కాగా, మంగళవారం ఉదయం 11 గంటలకు 513.42 మీటర్లకు చేరుకుంది. ఎండబ్ల్యూఎల్ 514.75 మీటర్లు అయినందున ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు పేర్కొన్నారు.

డీఆర్ఎఫ్ బృందాలు వివిధ ప్రాంతాల్లో నిలిచిపోయిన నీటిని తరలించడంతోపాటు ఆయా ప్రాంతాల్లో నీళ్లలో నిలిచిపోయిన అంబులెన్సు, బస్సులను సురక్షితంగా బయటకు పంపించాయి.

మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేత



దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌లోని మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపి వేశారు. మూసీనదిలో వరద ఉధృతి ఎక్కువ కావడంతో వంతెనపై వాహనాలను పోలీసులు నిలిపి వేశారు. మూసారాంబాగ్ వంతెనను తాకుతూ వరదనీరు ప్రవహిస్తుండంతో అప్రమత్తమైన పోలీసులు..వాహనాలను వేరే దారిలో మళ్లించారు. అదే విధంగా మూసీ పరివాహక కాలనీల ప్రజలను అప్రమత్తం చేశారు.


భాగ్యనగర్ కాలనీలో..


బల్కంపేట అండర్‌బ్రిడ్జి వద్ద..


మాదాపూర్‌లో..


లాలాపేటలో డిప్యూటీ మేయర్ పరిశీలన..


ఉప్పరి బస్తీలో నేలకూలిన వృక్షం


ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో..


ఓల్డ్ అల్వాల్‌లో ఇళ్లలోకి ప్రవహించిన వర్షం నీరు..


కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో ఎదురుగా జలమయమైన రహదారి

ఠారెత్తిస్తున్న క్యాబ్‌లు, ఆటోలు

- వర్షం కారణంగా బుకింగ్‌లలో తీవ్ర జాప్యం
- రెట్టింపు చార్జీలతో ప్రయాణికులపై నిలువుదోపిడీ


సాక్షి, సిటీబ్యూరో: ఆటోలు, క్యాబ్‌లు ప్రయాణికులను ఠారెత్తిస్తున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆటోవాలాలు, క్యాబ్‌వాలాలు చార్జీలను రెట్టింపు చేసి ప్రయాణికులపైన నిలువుదోపిడీకి పాల్పడుతున్నారు. మరోవైపు బుకింగ్‌లలోనూ తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుంది. అత్యవసర పరిస్థితుల్లో క్యాబ్‌లను ఆశ్రయించే వారు గంటల తరబడి పడిగాపులు కాయవలసి వస్తోంది. చివరి నిమిషంలో క్యాబ్ బుక్ అయినా డబుల్ చార్జీలు చెల్లించుకోవలసి వస్తోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే నగరంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో అనేక చోట్ల రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజారవాణా అస్తవ్యవస్థమైంది. పలు మార్గాల్లో సిటీ బస్సుల రాకపోకలకు సైతం అంతరాయం కలిగింది. దీంతో ఉదయాన్నే విధులకు వెళ్లవలసిన ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రయాణికులు ఆటోలు, క్యాబ్‌లను ఆశ్రయించారు. సాధారణ రోజుల్లో తార్నాక నుంచి సికింద్రాబాద్‌కు ఆటోలో వెళ్లేందుకు రూ.120 కంటే ఎక్కువ ఉండదు. కానీ మంగళవారం ఏకంగా రూ.250 వరకు చెల్లించవలసి వచ్చినట్లు రమేష్ అనే ప్రయాణికుడు తెలిపారు. బోడుప్పల్ నుంచి ఉప్పల్ మెట్రో స్టేషన్‌కు ఓలా ఆటో సాధారణంగా అయితే రూ.60 నుంచి రూ.80కి లభిస్తుంది. కానీ వర్షం కారణంగా ఏకంగా రూ.150 దాటింది. ఇక సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, బేగంపేట, తదితర రైల్వేస్టేషన్‌లకు చేరుకున్న దూరప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

అమాంతంగా పెరిగిన క్యాబ్ చార్జీలు...

సాధారణ రోజుల్లోనే ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్ పేరిట క్యాబ్ సంస్థలు అడ్డగోలుగా చార్జీలు పెంచేస్తాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో క్యాబ్‌ల కొరతను సాకుగా చూపుతూ చార్జీలను రెట్టింపు చేశారు. తార్నాక నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 వరకు సాధారణ రోజుల్లో రూ.450 నుంచి రూ.500 వరకు ఉంటే మంగళవారం ఇది రూ.870 కి చేరినట్లు ఒక ప్రయాణికుడు విస్మయం వ్యక్తం చేశారు. ఐటీ నిపుణులు, ఉద్యోగులు, ఉదయం పూట ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు వెళ్లే ఉద్యోగుల ఒత్తిడి కారణంగా క్యాబ్‌లకు డిమాండ్ పెరిగింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అమీర్‌పేట్ వరకు రూ.1650 వరకు వసూలు చేసినట్లు ఒక ప్రయాణికురాలు విస్మయం వ్యక్తం చేశారు.

మెట్రో కిటకిట...

మెట్రో రైళ్లకు అనూహ్యంగా డిమాండ్ పెరిగింది. వర్షం దృష్ట్యా చాలామంది మెట్రో రైళ్లను ఆశ్రయించారు. నాగోల్–రాయదుర్గం, ఎల్బీనగర్–మియాపూర్ రూట్‌లలో ప్రయాణికుల రద్దీ భారీగా పెరిగింది. ఉదయం, సాయంత్రం ఎక్కువ మంది మెట్రోలపైన ఆధారపడి ప్రయాణం చేశారు. దీంతో రెండు రోజులుగా మెట్రో ప్రయాణికుల సంఖ్య సుమారు 5.50 లక్షలకు చేరినట్లు అంచనా. ప్రతి 3 నిమిషాలకో మెట్రో రైలు నడిపించారు.





జంట జలాశయాల గేట్లు ఎత్తివేత

సాక్షి,సిటీబ్యూరో/మణికొండ/బండ్లగూడ: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జంట జలాశయాలు నిండుకుండలా మారాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు హిమాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్‌లోకి వచ్చి చేరుతోంది. ఇప్పటికే రెండు రిజర్వాయర్లు పూర్తి స్థాయి నీటి మట్టాలు గరిష్ఠ స్థాయికి చేరాయి. దీంతో జలమండలి అధికారులు మంగళవారం జంట జలాశయాలకు సంబంధించిన 12 గేట్లు ఎత్తి దిగువకు 5.500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఉస్మాన్‌సాగర్ మొత్తం నీటి మట్టం సామర్థ్యం 1790.00 అడుగులు (3.900టీఎంసీ) కాగా, ప్రస్తుతం 1789.30 అడుగులు (3.739 టీఎంసీ)లకు చేరింది. ఎగువప్రాంతాల నుంచి 1600 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుండగా ఆరు గేట్లు రెండు అడుగుల వరకు ఎత్తి దిగువన 1380 క్యూసెక్కులను విడుదల చేశారు.

- అదేవిధంగా హిమాయత్ సాగర్ నీటి నిల్వ సామర్థ్యం 763.50 అడుగులు (2.970 టీఎంసీ)లు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 1763.50 అడుగు (2.96 టీఎంసీ)లకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి నాలుగు వేల క్యూసెక్కుల నీరువచ్చి చేరుతుండటంతో ఆరు గేట్లు రెండు అడుగుల మేరకు ఎత్తి దిగువ భాగాన 4120 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు. దీంతో మూసీ పరివాహక ప్రాంతాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సంబంధిత శాఖల అధికారులకు జలమండలి ఎండీ దానకిశోర్ సూచించారు.

జలదిగ్బంధంలో హాస్టళ్లు



మైసమ్మగూడలో వరదనీటిలో చిక్కుకున్న హాస్టళ్లు



మేడ్చల్‌రూరల్: వర్షాలతో గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడ అతలాకుతలమైంది. వర్షపు నీటితో స్థానికంగా ఉన్న చెరువులు, కుంటలు అలుగులు పారాయి. మైసమ్మగూడలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలు, పదుల సంఖ్యలో హాస్టళ్లు నీటిలో మునిగాయి. మొదటి అంతస్తుల వరకు నీటిలో మునిగిపోవడంతో విద్యార్థులు జల దిగ్బంధంలో చిక్కుకున్నారు. ఆహారం, విద్యుత్ సరఫరా లేకపోవడం, బయటకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రాంగణం చెరువును తలపించింది. రెస్క్యూ టీమ్స్, మున్సిపల్ సిబ్బంది, పోలీసుల సాయంతో విద్యార్థులను జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో హాస్టళ్ల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు.

ఈవీఎండీకి 53 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: ఎడతెగని వర్షం నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఈవీడీఎం డీఆర్ఎఫ్ విభాగానికి ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 53 ఫిర్యాదులందాయి. ఇందులో రోడ్లపై నీరు నిలిచి చెరువులుగా మారిన ప్రాంతాలు 28 కాగా, 20 ప్రాంతాల్లో చెట్లు కూలాయి. రెండు వాహనాలు నీట మునిగాయి. రెండు ప్రాంతాల్లో గోడలు కూలాయి. వీటిల్లో 46 పరిష్కారం కాగా, మిగతావి పురోగతిలో ఉన్నట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మంత్రి తలసాని ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని స్థాయిల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, వాటర్ వర్క్స్ ఎండీ దాన కిషోర్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎక్కడ ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎగువ నుండి భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్ వాటర్ లెవెల్స్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. నాలాల వద్ద నిఘా ఉంచాలన్నారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు కూడా అవసరమైతేనే బయటకు రావాలని, అత్యవసర సేవలకు జీహెచ్ఎంసీ కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కోరారు.

ఔటర్ పక్కన కూలిన బండరాయి



మణికొండ: భారీ వర్షం కారణంగా మంగళవారం ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఓ గుట్ట కూలింది. నార్సింగి నుంచి పోలీస్ అకాడమీకి వెళ్లే సర్వీసు రోడ్డును ఆనుకుని బండ రాళ్లతో కూడిన చిన్న గుట్ట ఉంది. ఈ గుట్టలోని ఓ పెద్ద బండరాయి అకస్మాత్తుగా కిందకు పడిపోయింది. అయితే పూర్తిగా సర్వీసు రోడ్డుపైకి పడకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అటుగా వెళ్లే వారు ఊపిరి పీల్చుకున్నారు. అక్కడ వదులుగా ఉన్న కొండను తొలగించాలని, లేకుంటే మరోసారి అది వాహనాలపై పడే ప్రమాదం పొంచిఉందని వాహనదారులు పేర్కొన్నారు.

48 గంటలైనా దొరకని ఆచూకీ

– ఆందోళనలో లక్ష్మి కుటుంబ సభ్యులు

ముషీరాబాద్: దామోదరం సంజీవయ్య నగర్ బస్తీకు చెందిన లక్ష్మి అనే మహిళ నాలాలో గల్లంతై 48 గంటలు గడుస్తున్నా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాలకృత్యాల కోసం వెళ్లినప్పుడే గల్లంతై ఉండొచ్చని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న నాలా పరివాక ప్రాంతమంతా గాలించినా ఆచూకీ లభించలేదని గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. బుధవారం సూర్యాపేట, చౌటుప్పల్ ప్రాంతాల్లోనూ గాలిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు డబుల్ బెడ్రూం ఇంటితోపాటు గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామన్నారు.

క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.15, నల్ల వంకాయ.18, పొడుగువంకాయ.18, బెండకాయ.18, పచ్చిమిర్చి.28, బజ్జీమిర్చి.35, క్యాప్సికం.28, పచ్చికాకరకాయ.20, పందిరిబీర.15, క్యాబేజీ.13, క్యారెట్.26, దొండకాయ.18, గుండు బిన్నీస్.40, గింజచిక్కుడు.45, గోకరకాయ.23, కీర.35, దోసకాయ.18, బీట్‌రూట్.21, ఉల్లిగడ్డ.26, ఆలుగడ్డ.21, చామగడ్డ.28, మొరంగడ్డ.35, కందగడ్డ.45, గుమ్మడికాయ.13, క్యాలిఫ్లవర్ 18, సొరకాయ.9, పొట్లకాయ.13, అరిటికాయ.10, మునగకాయ.4, ఉల్లిపొరక.55. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

మర్యాదపూర్వకంగా



ఈటల రాజేందర్‌తో కీర్తిరెడ్డి

శ్రీనగర్‌కాలనీ: బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షురాలు జూటూరు కీర్తిరెడ్డి మంగళవారం ఎమ్మెల్యే, బీజేపీ తెలంగాణ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ప్రమాదానికి గురైనందున ఆయనను పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈటల సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ప్రొ.గుంటి రవీందర్‌ను సత్కరిస్తున్న వీసీ

బంజారాహిల్స్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న డా.బీఆర్..అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగాధిపతి ప్రొ. గుంటి రవీందర్‌ను మంగళవారం యూనివర్సిటీ వీసీ సీతారామారావుతో పాటు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ అవార్డు తనపై బాధ్యతను మరింత పెంచిందని ప్రొ.రవీందర్ తెలిపారు. సమాజాభివృద్ధికి, గిరిజన హక్కుల కోసం తాను కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొ. ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ఏవీఆర్ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



యువకులకు కండువాలు కప్పిన కాంగ్రెస్ నేత రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ డివిజన్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుమార్, మల్లేష్ ఆధ్వర్యంలో పలువురు యువకులు పార్టీలో చేరారు. వీరికి మంగళవారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో కరణ్, బాలు, ముస్తఫా, సతీష్,, మారుతి, మనోజ్, విజయ్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా పక్షపాతి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్ : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపడుచుల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. మంగళవారం రహమత్‌నగర్ డివిజన్‌కు చెందిన 30 మంది యువతులకు షాదీ ముబాకర్, కల్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు .అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, ఖైరతాబాద్ మండల ఆర్ఐ సందీప్, నాయకులు దుబాయ్ నజీర్, జాఫర్ హుస్సేన్, జబ్బార్‌ఖాన్, ఫయాజ్, గఫూర్, ధనూజ, కాసాల అరుణ్‌కుమార్, రవిశంకర్, షేక్‌చోటు. గడ్డం శ్రీధర్, జగన్, అబ్దుల్ సమద్, రాకేష్, సురేందర్, సమీనా తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ ప్రధాన రహదారులపై నిలిచిన వరదనీరు



గ్రీన్‌ల్యాండ్స్ చౌరస్తాలో వరద బీభత్సం

దంచి కొట్టిన వాన.. జనం హైరానా..

బంజారాహిల్స్: గడిచిన రెండురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం దాకా కుండపోత వర్షంతో ఖైరతాబాద్ డివిజన్‌లో రహదారులు జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, ఖైరతాబాద్, సోమాజిగూడ, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో లోతట్టు ప్రాంతాల్లోని బస్తీలు నీటమునిగాయి. జూబ్లీహిల్స్‌లో అత్యధికంగా 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఫిలింనగర్, చింతల్ బస్తీ, ఇందిరానగర్, కమలాపురి కాలనీ, శ్రీనగర్ కాలనీ, ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తా తదితర ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. వరదనీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లలో మట్టి నిండి పోవడంతో పలు ప్రాంతాలు నీట మునిగాయి. పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ మాన్సూన్ బృందాలతో పాటు ట్రాఫిక్ పోలీసులు వరదనీరు సాఫీగా వెళ్లేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్వయంగా రంగంలోకి దిగి సహాయక చర్యలను పర్యవేక్షించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, జోనల్ కమిషనర్ వెంకటేష్, సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి తదితరులు పలు ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. పంజాగుట్ట ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. పలు ప్రాంతాల్లో ఇంజిన్లలోకి వరదనీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించినా అప్పటికే రోడ్లపైకి చేరిన విద్యార్థులు అవస్థలు ఎదుర్కొన్నారు.



కమలాపురి కాలనీలో సహాయక చర్యలను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

వెంగళరావునగర్ : భారీ వర్షాలకు వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. వరదనీరు పోటెత్తడంతో అనేక చోట్లద్విచక్ర వాహనాలు, ఆటోలు, తోపుడుబండ్లు కొట్టుకుపోయాయి. పలుచోట్ల భారీ చెట్లు నేలకొరిగాయి. మధురానగర్‌కాలనీ, వెస్ట్ శ్రీనివాస్ నగర్‌కాలనీ, సారథీస్టూడియో, జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని శ్రీకృష్ణానగర్ ఏ, బి బ్లాక్‌లలో పరిస్థితి తీవ్రంగా ఉంది. మారుతీనగర్‌లో భారీ వృక్షం కూలి పక్కనే ఉన్న విద్యుత్ స్థంభాలపై పడటంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.





ఏరులై పారుతున్న వరదనీరు..

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఖైరతాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వం ముందు చూపులేకుండా చేస్తున్న పనులతో కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అవుతుందని, ప్రజల ఇబ్బందులు మాత్రం తీరడం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి డివిజన్ పరిధిలో ముంపునకు గురైన బుడగజంగం బస్తీ, బీజేఆర్‌నగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించారు. ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో రోడ్లపై నీరు నిలవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో రూ. కోటితో పనులు చేపట్టినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎస్ఎన్‌డీపీ నిధుల కింద రూ. 3 కోట్లతో పనులు మంజూరయ్యాయని చెబుతున్నారని, ప్రజా ధనం వృథా కాకుండా శాశ్వత ప్రతిపదికన పనులు పూర్తి చేయాలన్నారు. వరద నీటిని ఎప్పటికప్పుడు తరలించేందుకు మోటార్లు ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయం ఎదుట రోడ్లపై నిలిచిన నీటిని ఎత్తిపోసిన తర్వాతే బస్తీలవైపు వస్తామంటూ అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.



ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

ఘనంగా వేలూరు లింగయ్య గుప్తా జయంతి



వృద్ధులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖైరతాబాద్: వాసవీ సేవా కేంద్రం వ్యవస్థాపకులు, వాసవీ క్లబ్ హైదరాబాద్ మాజీ అధ్యక్షులు దివంగత వేలూరు లింగయ్య గుప్తా 99వ జయంతి వేడుకలను మంగళవారం వాసవీ సేవా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా కేంద్రం అధ్యక్షుడు ఆలంపల్లి రవికుమార్ అధ్యక్షతన వృద్ధాప్య పెన్షన్లు, స్వయం ఉపాధి నిమిత్తం మహిళలకు కుట్టుమిషన్లు, ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలంపల్లి రవికుమార్ మాట్లాడుతూ వేలూరు లింగయ్య గుప్తా ఆర్యవైశ్య సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వేలూరు శీలేందర్ గుప్త, వేలూరు కిషోర్ గుప్తా, కొండ్లె మల్లికార్జున్‌లతో పాటు సేవాకేంద్రం ప్రధాన కార్యదర్శి కొల్పూరు రమేష్, కోశాధికారి పంపాటి జ్ఞాన్ చందర్, గుగ్గిల అశోక్‌కుమార్, పుప్పల వరకుఆర్, పొద్దుటూరు రాజేశ్వరరావు, ఉప్పల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ కృష్ణ శర్మ సేవలు ఎనలేనివి

శ్రీనగర్‌కాలనీ: భారతీయ సంప్రదాయ కళలకు జీవంపోస్తూ, చిన్నారులకు నృత్య కళలను నేర్పుతూ కూచిపూడి నృత్య గురువు లక్ష్మీకృష్ణ శర్మ చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, అవధానుల ప్రసాద్ శర్మ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ కళ్యాణ్‌నగర్ వెంచర్–3లోని శ్రీ గీతిక కూచిపూడి అకాడమీ వార్షికోత్సవ వేడుకలు విజయవంతమైన సందర్భంగా మంగళవారం అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్రీ గీతిక అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శన అద్వితీయమని, వారిలో 25మంది చిన్నారులను తానా సభలకు ప్రదర్శన నిమిత్తం పంపనున్నట్లు అవధానుల ప్రసాద్‌శర్మ తెలిపారు. ఈ సందర్భంగా గురువు లక్ష్మీశర్మను ఘనంగా సన్మానించారు. వార్షికోత్సవ వేడుకల్లో చిన్నారుల ప్రదర్శనను తిలకించిన హీరోయిన్ శ్రీలీల అభినందించడం చాలా సంతోషంగా ఉందని లక్ష్మీకృష్ణశర్మ అన్నారు. కార్యక్రమంలో కల్యాణ్‌నగర్ వెంచర్-3 ప్రెసిడెంట్ నరసింహారావు, ఉదయ్‌నగర్‌కాలనీ ప్రెసిడెంట్ శ్రీకాంత్, అకాడమీ డైరెక్టర్ అనంత కృష్ణ శర్మ, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



లక్ష్మీ కృష్ణ శర్మను అభినందిస్తున్న మాజీ కార్పొరేటర్ శేషుకుమారి తదితరులు

మ్యారేజీ బ్యూరో మీడియేటర్లను ఆదుకోవాలి

పంజగుట్ట: మ్యారేజీ బ్యూరో మీడియేటర్ వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమను ఆదుకోవాలని మ్యారేజీ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్రా శ్రీనివాస్ గౌడ్, మహిళా గౌరవాధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, గౌరవ సలహాదారు చంద్రావతి మాట్లాడుతూ .. కులాలు, మతాల వారీగా వివాహ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంలో మ్యారేజీబ్యూరోల పాత్ర ఎంతో ఉందన్నారు. తమ అసోసియేషన్‌లో ఎందరో నిరుపేదలు ఉన్నారని వారిలో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలో వెయ్యిగజాల స్థలంలో తమకు భవనం కట్టించి ఇవ్వాలని, మ్యారేజీ బ్యూరో సభ్యులకు ప్రమాద బీమా, పింఛన్, హెల్త్‌కార్డులు, బస్సు రవాణా చార్జీల్లో రాయితీ కల్పించాలని కోరారు. సమావేశంలో రవీందర్ గౌడ్, రాజేష్ గంగపుత్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పలువురికి మంజూరైన షాదీముబారక్, కళ్యాణలక్ష్మీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రులు ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందిన వారు తమ పరిసరాల్లోని ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి, ఎన్.శేషుకుమారి, ఆకుల రూప, నయీముద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, ఆంజనేయులు, నర్సింహ్మా, నారాయణరాజు పాల్గొన్నారు.

విశ్వకర్మ బాయ్స్ హాస్టల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

పంజగుట్ట: విశ్వకర్మ బాయ్స్ హాస్టల్ సికింద్రాబాద్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని విశ్వకర్మ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సి.ఆర్.సూర్యరాజ్ తెలిపారు. కుల ధృవీకరణ పత్రం, కాలేజీలో జాయినింగ్ లెటర్, ఆధార్‌కార్డు తీసుకువస్తే ఎంత మందికైనా అడ్మిషన్ ఇస్తామన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రధానకార్యదర్శి సంగమేశ్వర్, జాయింట్ సెక్రటరీ తూఫ్రాన్ ప్రభాకర్ రావుతో కలిసి మాట్లాడారు.. గత మూడు దశాబ్దాలుగా బాయ్స్ హాస్టల్ నిర్వహిస్తున్నామని, కొంతమంది ఇటీవల పనికట్టుకుని హాస్టల్‌పై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కరోనా సమయంలో విద్యాసంస్థలను మూసివేయడంతో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో హాస్టల్ నిర్వహణ నిమిత్తం భవనాన్ని కొన్ని షరతులతో అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. కొందరు జేఏసీ పేరుతో తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి పైసాకు లెక్కలు ఉన్నాయని ఎవరికైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో వేణుగోపాల్, గోల్కొండ సుభాష్, వినోద చారి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

జేబు దొంగ అరెస్ట్



నిందితుడు శివ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయంలో భక్తుల కళ్లుగప్పి దొంగతనాలకు పాల్పడుతున్న జేబుదొంగను జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజశేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..హబీబ్‌నగర్ పరిధిలోని మాంగార్‌బస్తీకి చెందిన పాత నేరస్తుడు శివ ఆదివారం భక్తుడిలా నటిస్తూ పెద్దమ్మగుడికి వచ్చాడు. అక్కడకు వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని వారి నుంచి నగదు తస్కరిస్తున్నాడు. కోకాపేటకు చెందిన మోహనలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఉండగా అదను చూసి ఆమె బ్యాగులోంచి రూ.30వేలు తస్కరించిన శివ పథకం ప్రకారం సమీపంలో ఉన్న మరో మహిళా దొంగకు అందజేశాడు. దీనిని గుర్తించిన బాధితురాలు గుర్తించి కేకలు వేయడంతో ఇతర భక్తులు అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరు యువకులకు జైలు



నిందితులు సాయి నిఖిల్, శేఖర్

బంజారాహిల్స్: అక్రమంగా ఓ ఇంట్లోకి ప్రవేశించడమే కాకుండా అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులకు న్యాయస్థానం రెండు రోజుల జైలుశిక్ష విధించింది. మాసాబ్ ట్యాంక్ ఎస్ఐ శేఖర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నెహ్రూనగర్‌కు చెందిన కే.సాయి నిఖిల్, బీ.శేఖర్ సోమవారం రాత్రి ఓ ఇంట్లోకి ప్రవేశించి అనుమానాస్పదంగా తిరుగుతుండగా బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం నాంపల్లిలోని 12వ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ రాజేంద్రకుమార్ ఎదుట హాజరుపర్చారు. కేసు విచారించిన న్యాయమూర్తి నిందితులకు రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు

రహమత్‌నగర్ : రహదారుల పైన అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేస్తే చలాన్లు విధించడంతో పాటు వాటిని సీజ్ చేస్తామని ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కొమురయ్య అన్నారు. మంగళవారం రహమత్‌నగర్, బోరబండ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పై పార్కింగ్ చేసిన వాహనాలను టోవింగ్ ద్వారా స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, వ్యాపార కేంద్రాల ఎదుట వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వ్యాపార సముదాయాల యాజమానులు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రహమత్‌నర్ లైబ్రరీ, మిడ్ లాండ్ బేకరీ, బోరబండ బస్ స్టాప్ ప్రాంతాల్లో సమస్య తీవ్రంగా ఉందని, ఆయా ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున్‌రావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కార్మిక సంఘాలకు స్థలం ఇప్పించండి



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

బంజారాహిల్స్: తెలుగు టెలివిజన్ డిజిటల్ మీడియా టెక్నీషియన్స్ అండ్‌వర్కర్స్ ఫెడరేషన్‌లో అనుబంధ సంఘాలుగా ఉన్న 24 విభాగాల కార్మిక సంఘాల నాయకులు మంగళవారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను కలిసి కార్మిక సంఘాల కార్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని ఇప్పించాలని కోరారు. అన్ని విభాగాల కార్యాలయాలు ఒకే భవనంలో ఉండేలా తెలుగు టెలివిజన్ భవన్ నిర్మించుకోవాలన్నది తమ చిరకాలవాంఛ అని పెడరేషన్ అధ్యక్షుడు రాకేష్ అన్నారు.ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, కోశాధికారి కే.నరేందర్‌రెడ్డి. గిరిరాజ్, ఖుద్దూస్, ఇరిగి నర్సింగరావు, మోహన్‌రాజ్, సత్య మాస్టర్, యాదగిరి, మహిపాల్, రాజేష్,, చంద్రశేఖర్ వర్మ.. మురళీ పాల్గొన్నారు.

ఎన్‌బీటీనగర్ స్కూల్‌కు స్థలం కేటాయింపు



ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ అనితారెడ్డి

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌రోడ్ నెం 12లోని ఎన్‌బీటీనగర్ ప్రభుత్వ పాఠశాలను అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో అదనపు తరగతుల నిర్మాణం చేపట్టేందుకు అంగీకారం తెలపడంతో పాటు సదరు స్థలాన్ని షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డి మంగళవారం పాఠశాల హెడ్‌మాస్టర్‌కు పంచనామా చేసి అప్పగించారు. ఇటీవల ఈ స్థలాన్ని స్కూల్ కోసం కేటాయించాలంటూ గ్రేటర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కోరారు. ఈ మేరకు స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్ అందుకు సంబంధించి ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంగళవారం అధికారులు పంచనామా చేసి స్థలాన్ని అప్పగించారు. స్కూల్‌లో చాలా కాలంగా తరగతి గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఊరట లభించనుంది. అదనపు గదుల నిర్మాణం కోసం ఎంపీ కేశవరావు తన బడ్జెట్‌నుంచి రూ.2 కోట్లు కేటాయించనున్నట్లు ప్రకటించారు. తరగతి గదుల నిర్మాణానికి అంచనాలు రూపొందించాల్సిందిగా కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

వైభవంగా లక్ష నాగవల్లి అలంకారం

బంజారాహిల్స్: శ్రావణ మాసంలోని మూడో మంగళవారం సందర్భంగా బంజారాహిల్స్ రోడ్‌నెం 14 నందినగర్‌లోని శ్రీ అంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి లక్ష నాగవల్లి అలంకరణ మహోత్సవాన్ని ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశేషపూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, లక్ష తమలపాకుల అర్చన తర్వాత తాడ్‌బండ్ అంజనేయస్వామి ఆలయం నుంచి ప్రత్యేకంగా వచ్చిన 11మంది బృందంతో 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మోటుపల్లి శేషశయనాచార్యులు, కిరణ్‌కుమారాచార్యుల ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి.



శ్రావణ పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది



లక్డీకాపూల్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, భావి పౌరులను తీర్చిదిద్దే ఓ బృహత్ కార్యాన్ని నిర్వహించడం స్ఫూర్తిదాయకమని నిజాం వైద్య విజ్ఞాన సంస్థ డీన్ డాక్టర్. లిజా రాజశేఖర్ అన్నారు. మంగళ వారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిమ్స్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లిజా రాజశేఖర్ పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో గొప్ప స్థానం ఉందన్నారు. అసోసియేట్ డీన్ డా. సాయి సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు తమ గురువుల పట్ల ప్రేమాభిమానాలు, గౌరవం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్ , మైక్రో బయాలజీకో ఆర్డినేటర్ భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్ మేళాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు అక్బర్ ఆలీ, గంగాధర్ తెలిపారు. ఈ మేళాలో దేశంలోని రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు తయారు చేసిన చేనేత వస్త్రాలు మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బగల్పూర్ చీరలు, డిజైనర్ చీరలు, హ్యాండ్, బ్లాక్ ప్రింటెడ్ చీరలు, కలంకారీ, బెంగాల్ చీరలు, ఫ్యాన్సీ టాప్స్ డిజైనర్స్ బ్లౌజ్ లక్నో చికెన్ బనారస్ చీరలు ఖాదీ మెటీరియల్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు ప్రదర్శన అందుబాటులో ఉంటుందన్నారు. అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు.



ఉదయనిధి వ్యాఖ్యలు అనైతికం

బోరబండ పీఎస్‌లో బీజేపీ నేతల ఫిర్యాదు

రహమత్‌నగర్ : హిందూ ధర్మాన్ని కించపరిచేలా ఎవరు మాట్లాడినా సహించేది లేదని బోరబండ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ అన్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్ కుమారుడు ఉదయనిధి హిందుమతాన్ని కించ పరుస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం బోరబండ బస్‌స్టాప్ వద్ద ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ హిందు మతానికి ఎంతో విశిష్ట చరిత్ర ఉందని, ప్రపంచదేశాల ప్రజలు హిందు సంస్కృతి సంప్రదాయాలను గౌరవిస్తుండగా ఒక ముఖ్యమంత్రి తనయుడు హిందు మతాన్ని కించ పరిచేలా మాట్లాడటం దారుణమన్నారు. తక్షణమే ఉదయనిధి పై కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజ్‌కుమార్, శ్రీనివాస్, శరణ్ రెడ్డి, కుమార్‌నాయక్, అన్నపూర్ణ, గణేష్‌రెడ్డి, కృష్ణమోహన్, సోను, సతీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నేతలు

బాబు బంగ్లాకే ముడుపులు..

మళ్లీ ఆ ముగ్గురే

అమరావతి కాంట్రాక్టుల తరహాలోనే 'స్కిల్' స్కామ్.. సూత్రధారి చంద్రబాబు

- 'సీమెన్స్'కి తెలియకుండా ఆ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు మాయ
- కాగితాలపై రూ.3,300 కోట్ల ప్రాజెక్టును చూపించి మోసం
- ప్రభుత్వ వాటా పేరుతో డిజైన్ టెక్ కంపెనీకి నిధుల మళ్లింపు
- నకిలీ ఇన్వాయిస్‌లతో డ్రా చేసి పార్థసానికి అందించిన యోగేశ్
- వాటిని హైదరాబాద్‌కు తరలించి చంద్రబాబు పీఎస్‌కు అందించిన పార్థసాని
- ఆ కొల్లగొట్టిన నిధులు చివరకు చేరింది చంద్రబాబు నివాసానికే!
- మనోజ్ పార్థసాని, యోగేశ్ గుప్తా, బాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ నోటీసులు
- విచారణకు హాజరు కావాలని ముగ్గురికీ ఆదేశం
- 'స్కిల్' కుంభకోణం కేసు దర్యాప్తు వేగవంతం



సాక్షి, అమరావతి: తీగ లాగితే డొంకంతా కదులుతోంది! ముడుపుల చిట్టాలన్నీ చంద్రబాబు బంగ్లాకే దారితీస్తున్నాయి!! అమరావతిలో తాత్కాలిక నిర్మాణాలు, టిడ్కో ఇళ్ల కాంట్రాక్టుల్లో ప్రజాధనాన్ని లూటీ చేసిన వ్యవహారంలో ఆదాయపన్ను (ఐటీ) శాఖ తీగ లాగితే... చంద్రబాబు కనుసన్నల్లో సాగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్‌ఎస్‌డీసీ) కుంభకోణం పునాది బయటపడుతోంది. కుంభకోణాలు వేర్వేరైనా కొల్లగొట్టిన ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా తరలించడంలో పాత్రధారులు మాత్రం వారే. ఆ అక్రమార్జన అంతా చివరకు చేరింది సూత్రధారి చంద్రబాబు చెంతకే అన్నది స్పష్టమవుతోంది. టీడీపీ హయాంలో భవన నిర్మాణ ప్రాజెక్టుల కాంట్రాక్టులను కట్టబెట్టడంలో అక్రమార్జనకు సంబంధించి చంద్రబాబుకు ఐటీ శాఖ నోటీసుల ప్రకంపనలు కొనసాగుతున్నాయి. ఆ కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్న మనోజ్ వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్, యోగేశ్ గుప్తా ఏపీఎస్ఎస్‌డీసీ అవినీతి బాగోతంలోనూ కీలకంగా వ్యవహరించారని వెల్లడైంది. ఇప్పటికే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం కేసు దర్యాప్తులో కీలక ప్రగతి సాధించిన సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తాజా పరిణామాలతో తక్షణం రంగంలోకి దిగింది. ముడుపుల తరలింపులో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ వాసుదేవ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లను విచారించాలని నిర్ణయించింది. ఈమేరకు వారికి నోటీసులు జారీ చేసి దర్యాప్తును వేగవంతం చేసేందుకు సిద్ధమైంది.

బాబు అవినీతి 'స్కిల్'...

టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన సూత్రధారిగా ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణం జరిగినట్లు 'సిట్' ఇప్పటికే కీలక ఆధారాలు సేకరించింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి ఏమాత్రం తెలియకుండా ఆ కంపెనీ పేరుతో ఒప్పందం కుదుర్చుకున్నట్లుగా మోసగించి ప్రజాధనాన్ని కొల్లగొట్టినట్లు ఆధారాలతో సహా నిరూపించింది. రూ.3,300 కోట్ల ప్రాజెక్టును కాగితాలపై చూపించి సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు సమకూరుస్తుందని బుకాయించి రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులను కేటాయించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండానే ప్రభుత్వ వాటా 10 శాతం కింద జీఎస్టీతో కలిపి మొత్తం రూ.371 కోట్లను అడ్డగోలుగా చెల్లించేశారు. అలా నిధులు చెల్లించడం నిబంధనలకు విరుద్ధమని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావుతోపాటు మరో ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులు వారించినా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఖాతరు చేయలేదు. ఏకపక్షంగా రూ.371 కోట్లను సీమెన్స్ భాగస్వామ కంపెనీగా ఒప్పందంలో చూపించిన డిజైన్ టెక్ కంపెనీకి విడుదల చేశారు. అందులో రూ.241 కోట్లను పలు షెల్ కంపెనీలను సృష్టించి హవాలా మార్గంలో టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యనేత కొల్లగొట్టారు. ఈ కేసులో సిట్ అధికారులు 8 మందిని అరెస్టు చేశారు. హవాలా మార్గంలో నల్లధనాన్ని చలామణిలోకి తెచ్చినందున కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ కూడా రంగంలోకి దిగింది. మనీలాండరింగ్‌కు పాల్పడ్డారని నిర్ధారించి ఈ కేసులో నలుగురిని అరెస్టు చేయడంతోపాటు డిజైన్ టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్లను అటాచ్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

షెల్ కంపెనీలు.. బోగస్ ఇన్వాయిస్‌లు

టీడీపీ ప్రభుత్వంలో అమరావతిలో తాత్కాలిక నిర్మాణాల కాంట్రాక్టులను కట్టబెట్టిన కుంభకోణంలో పాత్రధారులుగా ఉన్నవారే ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలోనూ కీలకపాత్ర పోషించారని సిట్ గుర్తించింది. షాపూర్జీ- పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, షెల్ కంపెనీల సృష్టికర్త యోగేశ్ గుప్తా, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్.. ఈ ముగ్గురూ అమరావతి భవన నిర్మాణాల కాంట్రాక్టు అవినీతి సొమ్మును చంద్రబాబుకు చేర్చడంతో కీలకంగా వ్యవహరించారన్నది ఇప్పటికే నిర్ధారణ అయ్యింది. రూ.8 వేల కోట్ల విలువైన నిర్మాణాల కాంట్రాక్టుల్లో భారీ అవినీతికి పాల్పడి ఆ నల్లధనాన్ని మనోజ్ వాసుదేవ్ పార్థసాని షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు చేర్చారు. అందుకోసం షెల్ కంపెనీలను సృష్టించడంలో యోగేశ్ గుప్తా కీలక పాత్ర పోషించారు. ఆయన నివాసంలో ఐటీ శాఖ అధికారులు సోదాలు కూడా నిర్వహించారు. మరోవైపు ఆ షెల్ కంపెనీల పేరుతో మళ్లించిన నిధులను డ్రా చేసి మనోజ్ వాసుదేవ్ పార్థసాని నగదు రూపంలో చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో అందించారు. ఆ విధంగా చంద్రబాబుకు చేరిన అక్రమార్జనలో రూ.118 కోట్లకు సంబంధించి లెక్కలు చెప్పాలని ఐటీ శాఖ నోటీసులు జారీ చేయడం జాతీయస్థాయిలో చర్చనీయాంశంగా మారింది.

బాబుకు ముడుపులు చేరాయిలా..

అమరావతిలో తాత్కాలిక నిర్మాణ కాంట్రాక్టుల అవినీతి దందాలో సూత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్ ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో ప్రధాన భూమిక పోషించిన తీరు ఇదీ..

- ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టేందుకు యోగేశ్ గుప్తా పలు షెల్ కంపెనీలను సృష్టించాడు. ముంబై, పుణే కేంద్రాలుగా సృష్టించిన షెల్ కంపెనీల పేరిట నకిలీ ఇన్వాయిస్‌లను సమర్పించారు. ఆ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు ఏపీఎస్ఎస్‌డీసీ రూ.371 కోట్లను విడుదల చేసింది. దీనిపై ఆధారాలు సేకరించిన అనంతరం సిట్ అధికారులు ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో కేసులో యోగేశ్ గుప్తాను ఏ-22గా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు.
- నకిలీ ఇన్వాయిస్‌ల ఆధారంగా షెల్ కంపెనీలకు చేరిన రూ.371 కోట్లను యోగేశ్ గుప్తా డ్రా చేసి మనోజ్ పార్థసానికి అందించాడు. ఆయన అందులో రూ.241 కోట్లను ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలించాడు. రూ.241 కోట్ల నగదు మొత్తాన్ని హైదరాబాద్‌లో ఉన్న చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించాడు.
- ఆ రూ.241 కోట్ల నగదు మొత్తం పెండ్యాల శ్రీనివాస్ ద్వారా చివరకు హైదరాబాద్‌లో చంద్రబాబు నివాసానికి చేరినట్లు స్పష్టమవుతోంది.

ఆ ముగ్గురికీ సిట్ నోటీసులు

ఏపీఎస్ఎస్‌డీసీ నిధులను కొల్లగొట్టడంతో పాత్రధారులుగా వ్యవహరించిన యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసాని, పెండ్యాల శ్రీనివాస్‌లకు సిట్ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. వచ్చే సోమవారం విజయవాడలో సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరు కావాలని యోగేశ్ గుప్తా, మనోజ్ పార్థసానికి నోటీసులిచ్చారు. చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ ఈనెల 14న విచారణకు హాజరు కావాలని అందులో పేర్కొన్నారు.

'గోవింద కోటి' రాసిన వారికి బ్రేక్ దర్శనం


బోర్డు సభ్యులతో చైర్మన్ భూమన

- విద్యార్థులకు కోటి భగవద్గీత పుస్తకాల పంపిణీ
- సనాతన ధర్మం అనేది మతం కాదు.. అదొక జీవనయానం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

తిరుమల: యువతలో హైందవ సనాతన ధర్మ వ్యాప్తి కోసం శ్రీవారి ఆలయం నుంచే తొలి అడుగు వేస్తున్నామని, ఇందులో భాగంగా రామకోటి తరహాలో గోవింద కోటి రాసిన 25 ఏళ్ల లోపు వారికి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఒకసారి తిరుమల స్వామివారి బ్రేక్ దర్శనం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. 10 లక్షల 1,116 సార్లు గోవింద నామం రాసిన వారికి దర్శన సౌభాగ్యం కల్పిస్తామన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వివరించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా 20 పేజీల్లో భగవద్గీత సారాంశాన్ని పుస్తక ప్రసాదంగా కోటి పుస్తకాలు ముద్రించి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇటీవల చిరుత దాడిలో మృతి చెందిన చిన్నారి లక్షిత కుటుంబానికి టీటీడీ ద్వారా గతంలో ప్రకటించిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ముంబైలోని బాంద్రాలో రూ.1.65 కోట్లతో శ్రీవారి రెండో ఆలయం, రూ.5.35 కోట్లతో సమాచార కేంద్రాన్ని నిర్మించనున్నట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని టీటీడీ బోర్డు సభ్యులు విరాళంగా అందిస్తారన్నారు. రూ.33 కోట్లతో వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాల కోసం కేటాయించిన స్థలంలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని, ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారన్నారు. రూ.600 కోట్లతో తిరుపతి రైల్వేస్టేషన్ వెనుక వైపు ఉన్న 2,3 సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం వసతి సముదాయాలను నిర్మించనున్నట్లు తెలిపారు. టీటీడీ ఆలయాల్లో 413 పోస్టుల మంజూరు కోసం ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు చెప్పారు. తిరుపతిలో నిర్మాణం కానున్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో 300 మందిని నియమించనున్నట్లు చెప్పారు. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మగిరి, కీసరగుట్ట, విజయనగరం, ఐ.భీమవరం, కోటప్పకొండ, తెలంగాణలోని నల్లగొండ వేద విజ్ఞాన పీఠాలకు సంబంధించి అదనంగా 47 అధ్యాపక పోస్టులను మంజూరు చేసినట్లు చెప్పారు.

ఉదయనిధి మాటలను ఖండిస్తున్నాం

సనాతన ధర్మంపై తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన విమర్శలను భూమన ఖండించారు. సనాతన ధర్మం మతం కాదని, అదొక జీవన యానమని చెప్పారు. ఈ విషయం తెలియక సనాతన ధర్మానికి కులాలను ఆపాదించి విమర్శలు చేస్తే సమాజంలో అలజడి చెలరేగే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది విమర్శకులకు కూడా మంచిది కాదన్నారు.

బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి

- ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చిన ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవం సందర్భంగా దేశంలో జరిగిన అభివృద్ధి గురించి పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చర్చించనున్నట్లు కేంద్రమంత్రులు ప్రకటించారన్నారు. అయితే 76 సంవత్సరాల స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశంలోని 56 శాతం జనాభా గల బీసీ కులాల బతుకులు ఎలా బాగుపడ్డాయో, బాగుపడటానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా పార్లమెంట్‌లో చర్చ జరగాలని కృష్ణయ్య కోరారు. ఈ మేరకు ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీ బిల్లు, మహిళా బిల్లులో మహిళలకు సబ్ కోటా కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 21న చలో ఢిల్లీకి పిలుపునిచ్చారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళా బిల్లుకు సార్థకత లేదని కృష్ణయ్య తెలిపారు. మహిళా బిల్లు గురించి గొంతులు చించుకుని మాట్లాడే రాజకీయ పార్టీల నాయకులు బీసీ మహిళల గురించి, వారికి జరుగుతున్న అన్యాయాలు, అత్యాచారాల గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు.

నగర వార్తలు

పెండింగ్ రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తి చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన పెండింగ్ రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండల తహసీల్దార్లు, స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఓ నంబర్ 58, 59 లకు సంబంధించిన అంశాలపై చర్చించారు. లబ్ధిదారులు డబ్బులను వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. జిల్లాలో 754 మంది లబ్ధిదారులకు గాను 191 మంది డబ్బులు చెల్లించారని, 554 మంది లబ్ధిదారులు రెగ్యులరైజేషన్ ఫీజు చెల్లించాల్సి ఉందని తహసీల్దార్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్‌ఓ వెంకటాచారి, జీహెచ్ఎంసీ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బంగారం, విదేశీ కరెన్సీ పట్టివేత




శంషాబాద్: నలుగురు వేర్వేరు ప్రయాణికులు అక్రమంగా తరలిస్తున్న బంగారం, విదేశీ కరెన్సీని మంగళవారం కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..కువైట్‌నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు కస్టమ్స్ తనిఖీల నుంచి తప్పించుకునేందుకు దిగిన వెంటనే పురుషులల టాయిల్‌లెట్‌లోని చెత్తడబ్బాలో 1253 గ్రాముల బంగారాన్ని దాచాడు. అతడిని అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు విచారించగా వివరాలలు వెల్లడించడంతో బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. బహ్రేన్ నుంచి వచ్చిన మరో ప్రయాణికుడు లగేజీలో దాచిన 233 గ్రాములు, కువైట్ నుంచి వచ్చిన ప్రయాణికుడి నుంచి 151 గ్రాముల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురి నుంచి 1.64 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మరో కేసులో శంషాబాద్ విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళుతున్న ప్రయాణికుడు అక్రమంగా తీసుకెళుతున్న 58 వేల సౌదీ రియాల్స్, 2025 యూఏఈ దిరామ్‌లను స్వాధీనం చేసుకున్నారు. భారత కరెన్సీలో వీటి విలువ రూ.13.19 లక్షలు ఉంటుందని నిర్ధారించారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రముఖుల భద్రత 'మీ బాధ్యత'

- సీఎస్‌డబ్ల్యూ అధికారులతో కొత్వాల్
- కీలక విభాగాలను సందర్శించిన సీపీ


కొత్వాల్ ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జాగిలం పింకీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ప్రముఖులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మీదేనని సిటీ సెక్యూరిటీ వింగ్ (సీఎస్‌డబ్ల్యూ) అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. గణేష్ ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పర్వదినంతో పాటు సాధారణ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఆయన మంగళవారం సీఎస్‌డబ్ల్యూ, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సీఏఆర్), హోంగార్డ్స్, మౌంటెడ్ పోలీసు విభాగాలను సందర్శించారు. ఆయా యూనిట్లలో భద్రతా పరమైన అంశాలపై సమీక్షించారు. డాగ్ స్క్వాడ్‌కు వచ్చిన సీపీకి పోలీసు జాగిలం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికింది. ప్రతి అధికారి, సిబ్బంది తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఆయా విభాగాల్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అశ్విక దళంలో (మౌంటెడ్ పోలీసు) ఉన్న 46 గుర్రాలు, డాగ్ స్క్వాడ్‌లోని 26 జాగిలాల ఆరోగ్య పరిస్థితులు, వాటికి అందిస్తున్న ఆహారం తదితరాలపై ఆరా తీశారు. పోలీసు విభాగంలో కీలక పాత్ర పోషించే వీటి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. వివిధ సంఘటనలు జరిగినప్పుడు, అత్యవసర సమయాల్లోనూ, ట్రాఫిక్ నిర్వహణలో పోలీసులతో పోటీ పడే హోంగార్డుల పాత్ర కీలకమని కితాబిచ్చారు. సీఎస్‌డబ్ల్యూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కొత్త యూనిట్ క్యాంటీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ఎం.శ్రీనివాసులు, డీసీపీ అలెక్స్ తదితరులు పాల్గొన్నారు.

నగరం నుంచి 11వ 'భారత్ గౌరవ్' రైలు



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ నుంచి వివిధ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం దక్షిణమధ్య రైల్వే అందుబాటులోకి తెచ్చిన భారత్ గౌరవ్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఈ రైళ్లను నడుపుతున్నారు. ఈ మేరకు అధికారులు మంగళవారం 11వ రైలును ప్రారంభించారు. ఐఆర్‌సీటీసీ 'దివ్య దక్షిణ యాత్ర' అనే కొత్త టూరిస్ట్ సర్క్యూట్‌లో భాగంగా తమిళనాడు, కేరళలోని ముఖ్యమైన పర్యాటక కేంద్రాలను సందర్శించడానికి ఈ దక్షిణ యాత్ర ప్రత్యేక అవకాశాన్ని కల్పించనుంది. మంగళవారం సికింద్రాబాద్ స్టేషన్ నుంచి ఈ రైలు తన రెండో ట్రిప్పు బయలుదేరింది. యాత్రికుల్లో ఒకరైన బిహార్‌కు చెందిన రమాకాంత్ రే ఈ భారత్ గౌరవ్ రైలును ప్రారంభించారు. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి.నాగ్యా, ఐఆర్‌సీటీసీ గ్రూప్ జనరల్ మేనేజర్, పి.రాజ్‌కుమార్, ఇతర అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సేవలు ఎనలేనివి

దిల్‌సుఖ్‌నగర్: తొలి వైద్యులుగా, వాయిద్య కళాకారులుగా, క్షురకులుగా సమాజ ప్రగతిలో నాయీ బ్రాహ్మణుల పాత్ర వెలకట్టలేనిదని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. మంగళవారం కొత్తపేట, బాబూ జగ్జీవన్‌రాం భవన్‌లో నిర్వహించిన తెలంగాణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం దశాబ్ది ఉత్సవాలు, నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, వకుళాభరణం కృష్ణమోహన్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ క్షురక వృత్తి దారులుగా సేవలు అందించిన నాయీ బ్రాహ్మణులకు సమాజం రుణపడి ఉంటుందన్నారు. ఆధునిక వైద్యం, సాంకేతికత అందుబాటులో లేని రోజుల్లో అనేక మొండి వ్యాధులకు చికిత్స అందించారని, గర్భిణులకు పురుడు పోసిన ఘనత వారికి దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సెలూన్లకు ఉచితంగా 250యూనిట్ల విద్యుత్, బీసీ బంధు పథకం తో రూ. లక్ష చేయూత అందిస్తుందన్నారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రాస మల్ల బాలకిషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంబర్తి శ్రీనివాస్, గడాల రాజు, ఆనందాస్, చంద్రశేఖర్, జయసింహ, వెంకటేష్, గ్రేటర్ హైదరాబాద్ సిహెచ్ శ్రీనివాస్, విక్రమ్, త్యాగరాజు, నర్సింగ్, వినోద్ కుమార్, అశోక్ ,అంజలి , అంజయ్య, వెంకటేష్, రవికుమార్ ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.



ఓయూ ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకుల పెన్‌డౌన్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీలో కాంట్రాక్టు అధ్యాపకులు పెన్‌డౌన్ చేపట్టారు. మంగళవారం రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ నెల 10 వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాకపోతే నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీమర్ల విజేందర్‌రెడ్డి, పల్ల రేష్మారెడ్డి, అశోక్, రమేష్, హరీష్, తిరుపతి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీఓనెం.317 ను ఉపసంహరించుకోవాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల కోసం తీసుకువచ్చిన జీఓనెం .317 వల్ల తమకు తీరని నష్టం కలుగుతుందని పలువురు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం రవీంద్రభారతిలో గురుపూజోత్సవ వేడుకలకు హాజరైన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి తమ గోడును వెల్లబోసుకునేందుకు ప్రయత్నించారు. జీఓను ఉపసంహరించుకోవాలని, స్థానిక జిల్లా ఉపాధ్యాయులకే జిల్లా పోస్టులు కేటాయించాలని కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. మంత్రిని కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలువురు మహిళా ఉపాధ్యాయులు కన్నీళ్లతో పోలీసులను వేడుకున్నా వారు పట్టించుకోకుండా ఉపాధ్యాయులను బలవంతంగా బయటికి పంపించారు.

ఏఓబీ టు మహారాష్ట్ర

- కారులో గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్
- పరారీలో మరో ఇద్దరు
- 125 కిలోల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్

గచ్చిబౌలి: ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు పట్టుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుపై కొల్లూరు, మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మాదాపూర్ డీసీపీ గోనె సందీప్ తెలిపారు. మంగళవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన రాజా బాయి సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారాన్ని ఎంచుకున్నాడు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని తరలించేందుకు పథకం రూపొందించాడు. ఇందుకుగాను కార్తీక్, కమల్ సంజయ్ సిర్సాత్‌లను సంప్రదించాడు. కార్తీక్ రవి కిరణ్, కమల్ సంజయ్, రాజా బాయి ఫోర్డ్ ఎకోస్పోర్ట్స్ కారులో ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లి రాజేష్ పట్నాయక్ అనే వ్యక్తి నుంచి 125 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. 2 కిలోల చొప్పున 63 ప్యాకెట్లను కార్తీక్ రవి కిరణ్, సంజయ్ కారులో లోడ్ చేసుకొని మహారాష్ట్రకు బయలుదేరగా, ప్రధాన నిందితుడు రాజా బాయి రైలులో మహారాష్ట్రకు బయలుదేరాడు. గంజాయి అక్రమ రవాణాపై సమాచారం అందడంతో అప్రమత్తమైన కొల్లూరు, మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం కొల్లూరు సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డుపై కారును అడ్డగించారు. నిందితులు కార్తీక్ రవి కిరణ్, సంజయ్‌లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.42 లక్షల విలువైన 125 కిలోల గంజాయి, కారు, రెండు సెల్ ఫోన్లు సీజ్ చేశారు. మరో ఇద్దరు నిందితులు రాజా, రాజేష్ పట్నాయక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. డ్రగ్స్, గంజాయి రవాణాపై సమాచారం అందింతే డయల్ 100 లేదా 9490617444 వాట్సాప్ నెంబర్‌లకు సమాచారం అందించాలని డీసీపీ సూచించారు. సమావేశంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, మియాపూర్ ఏసీపీ నర్సింహా రావు, కొల్లూరు ఇన్‌స్పెక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ 'రాఖీ పౌర్ణమి' లక్కీ డ్రా విజేత రూబీనా

కాచిగూడ: ఆర్టీసీ రాఖీ పౌర్ణమి లక్కీడ్రాలో కదిరి ప్రాంతానికి చెందిన రూబీనా విజేతగా నిలిచింది. రాఖీ పండుగ సందర్భంగా ఆగస్టు 30, 31 తేదీల్లో ఆర్టీసీ సిటీ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు బంపర్ ఆఫర్‌గా లక్కీడ్రాను ప్రకటించింది.

నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్సుల్లో మహిళలు తాము ప్రయాణించిన టికెట్లపై పేరు, ఫోన్ నెంబరు రాసి బాక్స్‌ల్లో వేశారు. మంగళవారం కాచిగూడ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధా లక్కీడ్రా తీశారు. కదిరి ప్రాంతానికి చెందిన రూబీనాకు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, చెంగిచెర్లకు చెందిన నిర్మల ద్వితీయ బహుమతి రూ.15 వేలు, ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన కె.రాణి తృతీయ బహుమతి రూ.10వేల నగదు బహుమతిని గెలుచుకున్నారు. ఈ నెల 8న ఎంజీబీఎస్ బస్టాండ్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ వీసీ. సజ్జనార్ చేతుల మీదుగా విజేతలకు చెక్కులు అందజేయనున్నట్లు ఆర్టీసీ హైదరాబాద్ సిటీ ఆర్ఎం బి.వరప్రసాద్ తెలిపారు.


లక్కీ డ్రాలో పాల్గొన్న ఓయూ ప్రొఫెసర్ సుధ, ఆర్టీసీ ఆర్ఎం వర ప్రసాద్



నిదర్శన

నగర జీవనంలో ప్రతిదీ యూజ్ అండ్ త్రోగా మారుతోంది. 'ఈ కాంక్రీట్ వనంలో ప్రకృతి గురించి అర్థం చేసుకుంటున్నదెవరు' అని ప్రశ్నిస్తారు హైదరాబాద్ నల్లగండ్లలో ఉంటున్న నిదర్శన. అపార్ట్‌మెంట్ సంస్కృతిలో వ్యర్థాలను ఎలా వేరు చేయాలి, ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలనే విషయాల మీద నెలకు ఒకసారి నాలుగేళ్లుగా అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ చేస్తోంది. కార్పొరేట్ కంపెనీలో మార్కెటింగ్ కమ్యూనికేషన్స్‌లో మేనేజర్‌గా వర్క్ చేసిన నిదర్శన సస్టెయినబుల్ లివింగ్ పట్ల ఆసక్తి పెరిగి, పర్యావరణ హిత వస్తువుల వాడకాన్ని ప్రోత్సహిస్తూ, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. పర్యావరణానికి మేలు చేసే పని ఏ కొంచెమైనా ఎంతో సంతృప్తినిస్తుందని చెబుతోంది.

ప్రకృతి ప్రేమకు నిదర్శనం

''ఈ రోజుల్లో మనం ఏ పని చేసినా అది ప్రకృతికి మేలు చేసేదై ఉండాలి. ఈ ఆలోచన నాకు నాలుగేళ్ల క్రితం కలిగింది. దీనికి కారణం మన దగ్గర చేస్తున్న పెళ్లిళ్లు, పార్టీలు. ఫంక్షన్లకు వెళ్లినప్పుడు అక్కడ యూజ్ అండ్ త్రో ఏరియా చూస్తే మనసు వికలమయ్యేది. దీంతో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి, సస్టైనబుల్ లివింగ్ మార్గం పట్టాను.


వాలంటీర్లతో...

■ ఈవెంట్స్‌కి స్టీల్ గిన్నెల రెంట్

మాటీ పేరతో ఫౌండేషన్ ఏర్పాటు చేశాను. నాలాగే ఆలోచించే మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఫంక్షన్లకు స్టీల్ పాత్రలు నామమాత్రపు రెంట్‌తో ఇచ్చే బ్యాంక్ ఏర్పాటు చేశాను. ఆ తర్వాత ఇదే థీమ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాను. ఎవరింట్లో పెళ్లి, పండగ, పుట్టిన రోజులు జరిగినా మా దగ్గర నుంచి స్టీల్ పాత్రలు రెంట్‌కు తీసుకోవచ్చు. అలాగే, అపార్ట్‌మెంట్స్ వర్క్ షాప్స్ కండక్ట్ చేస్తాను. ఈ వర్క్ షాప్స్‌లో కిచెన్ గార్డెనింగ్, కంపోస్ట్, ఎకో ఫ్రెండ్లీ గిఫ్ట్ థీమ్స్.. వంటివన్నీ అందుబాటులో ఉంటాయి.

■ హస్తకళాకారుల నుంచి..

నెలకు ఒకసారి గేటెడ్ కమ్యూనిటీ ఏరియాలను చూసుకొని పర్యావరణ స్పృహ కలిగించడానికి ఎకో ఫెస్ట్ ఏర్పాటు చేయడం మొదలుపెట్టాను. ఇందుకు ఇతర స్వచ్ఛంద సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీ సభ్యులు, ఐటీ ఉద్యోగులు తమ మద్దతును తెలియజేస్తున్నారు. నా టీమ్‌లో స్వచ్ఛందంగా పనిచేసే పది మంది బృందంగా ఉన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలలోని నగరాలలోనూ ఈ ఎకో ఫెస్ట్ ఏర్పాటు చేస్తాను. ఇందులో హస్తకళాకారులు తయారుచేసిన రకరకాల కళాకృతులు, జ్యువెలరీ బాక్సులు, ఇత్తిడి, రాగి వస్తువులు, జ్యూట్ కాటన్ పర్సులు, ఇంటీరియర్ వస్తువులు .. వంటివన్నీ ఉంటాయి. హస్తకళాకారులే నేరుగా వచ్చి తమ వస్తువులు అమ్ముకోవచ్చు. ఒక్కొక్క కళాకారుడి నుంచి సేకరించిన వస్తువులను కూడా ప్రదర్శనలో ఉంచుతాను. దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆ కళాకారులకు అందజేస్తుంటాను. గ్రామీణ కళాకారులకు తమ హస్తకళలను ఎక్కడ అమ్మితే తగినంత ఆదాయం వస్తుందనే విషయంలో అంతగా



అవగాహన ఉండదు. అందుకే, ఈ ఏర్పాట్లు చేస్తుంటాను. దీని ద్వారా కళకు, కొనుగోలుదారుకు ఇద్దరికీ తగిన న్యాయం చేయగలుగుతున్నాను అనే సంతృప్తి లభిస్తుంది. 'ది బాంటిక్ కంపెనీ(పేరుతో ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా కూడా హస్తకళాకృతులను అందుబాటులో ఉంచుతున్నాను.

■ ఎకో ఫ్రెండ్లీ గిఫ్టింగ్

కార్పొరేట్ కంపెనీలలో పండగల సందర్భాలలో ఇచ్చే కానుకలకు కన్‌సల్టెన్సీ వర్క్ కూడా చేస్తాను. ఇక్కడ కూడా ఎకో థీమ్‌తో కస్టమైజ్డ్ గిఫ్ట్ బాక్స్‌లు తయారుచేసి అందిస్తుంటాను. ఇక ఇళ్లలో జరిగే చిన్న చిన్న వేడుకలకూ ఎలాంటి కానుకలు కావాలో తెలుసుకొని, వాటిని తయారుచేయించి సప్లయ్ చేయిస్తుంటాను.

■ కార్పోరేట్ కంపెనీలలో వర్క్‌షాప్స్

కార్పోరేట్ కంపెనీలలో సస్టెయినబులిటీ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తాను. అక్కడ ఉద్యోగులు పర్యావరణ హిత వస్తువులతో తమ జీవన విధానాన్ని ఎలా అందంగా తీర్చిదిద్దుకోవచ్చో, ఆరోగ్యకరంగా మార్చుకోవచ్చో కార్యక్రమాల ద్వారా తెలియజేస్తుంటాను. అంతేకాదు, కిచెన్ వ్యర్థాలను ఎలా వేరు చేయాలి, కిచెన్ గార్డెన్‌ను తమకు తాముగా ఎలా డెవలప్ చేసుకోవచ్చు అనే విషయాల మీద వర్క్‌షాప్స్ ఉంటాయి. అంతేకాదు, రోజువారీ జీవన విధానంలో ప్రతీది పర్యావరణ హితంగా మార్చుకుంటే కలిగే లాభాలనే వివరిస్తుంటాను. ఇదేమంత కష్టమైన పని కాదని వారే స్వయంగా తెలుసుకోవడం, తాము ఆచరిస్తున్న పనులు గురించి ఆనందంగా తెలియజేస్తుంటారు. మంచి జీవనశైలిని నలుగురికి పంచడంలోనే కాదు ప్రకృతికి మేలు చేస్తున్నాన్న సంతృప్తి కలుగుతుంది. అదే విధంగా గ్రామీణ కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నానన్న ఆనందమూ కలుగుతుంది' అని తెలియజేస్తారు నిదర్శన.

– నిర్మలారెడ్డి

ఫొటోలు: మోహనాచారి

కిచెన్ టిప్స్

ఉల్లిని చూసుకుందాం.. భద్రంగా

వర్షాకాలంలో ఉల్లిపాయలు త్వరగా పాడవకుండా ఉండాలంటే ఈ చిట్కాలు పాటిస్తే సరి. ఉల్లి ఎక్కువ రోజుల పాటు పాడవకుండా ఉంటుంది.



- ఇతర కూరగాయలు ఉన్న బుట్టలో ఉల్లిపాయలను ఉంచకూడదు. దుంపలు, పచ్చిమిర్చి, వెల్లుల్లి వంటి వాటితో కలిపి ఉల్లిపాయలు ఉంచడం వల్ల త్వరగా మొలకలు వస్తాయి. కూరగాయల్లో ఇథలిన్ ఉల్లిపాయలు త్వరగా మొలకెత్తడానికి దోహదపడుతుంది.
- ఉల్లిపాయలను నిల్వచేసేందుకు పేపర్ బ్యాగ్‌లనే వాడాలి. పేపర్ బ్యాగ్స్‌లో ఉల్లిపాయలు ఉంచడం వల్ల ఉల్లిపాయల్లో ఉత్పన్నమయ్యే తేమను పేపర్ పీల్చుకుంటుంది. తేమ లేకపోతే ఉల్లిపాయలు త్వరగా మొలకెత్తవు.
- రిఫ్రిజిరేటర్‌లో ఉల్లిపాయలను నిల్వచేయకూడదు. రిఫ్రిజిరేటర్‌లోని ఇతర కూరగాయల వల్ల, లోపలి తేమ వాతావరణం ఉల్లి త్వరగా మొలకెత్తేలా చేస్తాయి.
- ప్లాస్టిక్ సంచుల్లో ఉల్లిపాయలను ఎప్పుడూ నిల్వ చేయకూడదు. మార్కెట్ నుంచి తెచ్చిన ప్లాస్టిక్ సంచిలో నుంచి ఉల్లిపాయలు తీయడం మర్చిపోతుంటాము. ప్లాస్టిక్ బ్యాగ్‌లో వేడికి ఉల్లిపాయలు పాడవుతాయి.



తియ్యగా తగ్గించుకోండి

పంచదారకు బదులు అనేక స్వీట్ల తయారీలో కర్జూరాలను వాడుతుంటాము. స్వీట్‌గా ఉండే ఈ ఖర్జూరాల్లో అనేక ఆరోగ్య సుగుణాలు ఉన్నాయి. డేట్స్ తింటూ పొట్ట తగ్గించుకోవచ్చు. అది ఎలాగో చూద్దాం...

- బరువు తగ్గాలంటే ఉదయాన్నే పరగడుపున ఖర్జూరాలు తినాలి. ఉదయాన్నే క్యాలరీలు ఎక్కువగా ఉండే ఖర్జూరాలు తింటే రోజంతా ఆకలి లేకుండా యాక్టివ్‌గా ఉంటారు. రాత్రి సమయాల్లో ఖర్జూరాలు తినకూడదు. ఇవి అంత సులభంగా అరగవు. పరగడుపున ఖర్జూరాలు తినడం వల్ల శరీరానికి పోషకాలు చక్కగా అందుతాయి. దీనిలోని ఐరన్ హిమోగ్లోబిన్ స్థాయులను పెంచుతాయి.
- ఉదయాన్నే డేట్స్ తినడం వల్ల జీవక్రియలు సక్రమంగా జరిగి అధిక మొత్తంలో క్యాలరీలు ఖర్చవుతాయి. డేట్స్‌ను ఓట్స్‌తో కలిపి స్మూతీ, షేక్స్ చేసుకుని తాగితే కడుపు నిండుగా ఉండి ఆకలి వేయదు. ఫలితంగా ఇతర పదార్థాలు ఏమి తినలేం. ఫలితంగా తక్కువ క్యాలరీలతో శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.



బ్యూటిప్



టేబుల్ స్పూను పటిక పొడిలో తగినంత రోజ్ వాటర్‌ను వేసి పేస్టులా కలుపుకోవాలి. ఈ పేస్టుని ముఖానికి, మెడకు రాసుకుని మర్దన చేయాలి. పదిహేను నిమిషాలపాటు మర్దన చేసిన తరువాత నీటితో కడిగేయాలి. ముఖాన్ని తడిలేకుండా శుభ్రంగా తుడిచి, మాయిశ్చరైజర్ రాసుకోవాలి. వారానికి రెండుసార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖ సంబంధిత సమస్యలు తగ్గుముఖం పడతాయి.

విద్యార్థులే ఊపిరిగా..

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మందమతులేం కాదు, తెలివైన, చురుకైన వారు. విద్యార్థులే కాదు టీచర్లు కూడా నిరంతరం నేర్చుకుంటూనే ఉంటారు" అంటోంది నేషనల్ గుడ్ టీచర్ అవార్డు గ్రహీత మాలతీ టీచర్. దేశవ్యాప్తంగా యాభైమంది ఈ అవార్డు అందుకోగా అందులో మాలతీ టీచర్ ఒకరు.



మాలతీ టీచర్

తమిళనాడులోని సెంగోట్టైలో పుట్టి పెరిగిన మాలతి నల్లాసైతిరా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం పూర్తిచేసింది. మనస్తత్వ, రసాయన శాస్త్రాల్లో మాస్టర్స్ చేసింది. రసాయనశాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తూ టీచర్‌గా పనిచేస్తోంది. 2008లో తిరుపూర్ పెరుమతూర్ గవర్నమెంట్ హయ్యర్ సెకండరీ స్కూల్లో టీచర్‌గా చేరింది మాలతి. అక్కడ మూడేళ్ల పని చేశాక బదిలీ అవ్వడంతో తెన్కాసి గవర్నమెంట్ హయ్యర్ సెకండరీ స్కూల్లో టీచర్‌గా వెళ్లింది. ఇక్కడ ఏడాది పనిచేశాక ప్రమోషన్ రావడంతో వీరకేరళంబుదూర్ గవర్నమెంట్ హయ్యర్ సెకండరీ స్కూల్లో పోస్టుగ్రాడ్యుయేట్ సైన్స్ టీచర్‌గా చేరింది. గత పదేళ్లుగా ఇదే స్కూల్లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూ విద్యార్థులకు చక్కగా అర్థమయ్యేలా పాఠాలు చెబుతూ వారి మనసులో సుస్థిరస్థానాన్ని సంపాదించుకుంది.

నేర్చుకుంటూ.. నేర్పిస్తాను

''బోధనే నా శ్వాస, విద్యార్థులే నా ఊపిరి. డాక్టర్లు, టీచర్లకు రిటైర్మెంట్ ఉండదు. అధికారికంగా రిటైర్ అయినప్పటికీ ఆ తరువాత కూడా స్టూడెంట్స్ కోసం పనిచేస్తాను. నేను సైకాలజీ చదవడం వల్ల విద్యార్థుల్ని, వారి వైకల్యాలను అర్థం చేసుకుని పాఠాలు చెప్పగలుగుతున్నాను. ప్రతి ఒక్క టీచర్ సైకాలజీ చదివితే మరింత చక్కగా బోధించగలుగుతారు. నేషనల్ గుడ్ టీచర్ అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. నేను నేర్చుకుంటూ, విద్యార్థులకు నేర్పించడమే నా జీవితాశయం'' అని మాలతీ టీచర్ చెబుతోంది.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న మాలతీ టీచర్


తరగతి గదిలో శిక్షణ

■ అవార్డులు రికార్డులు...

విద్యార్థులను రికార్డుల బుక్‌లో చోటుదక్కించుకునేలా తయారు చేయడమేగాక మాలతీ కూడా కరోనా సమయంలో ఐదువందల రోజులు ఉచితంగా ఆన్‌లైన్ తరగతులు చెప్పి చోళన్ వరల్డ్ రికార్డు బుక్ లో చోటు దక్కించుకుంది. మాలతి కృషిని గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం 2020–2021 సంవత్సరానికిగాను డాక్టర్ రాధాకృష్ణన్ అవార్డుతో సత్కరించింది. 2022లో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఇరవై ఆరుగంటలపాటు నిరంతరాయంగా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించి వరల్డ్ రికార్డు సృష్టించింది. ఆరోతరగతి నుంచి పై తరగతులకు పాఠాలు బోధించే మాలతీ తనకు వచ్చిన నగదు బహుమతితో విద్యార్థులకు రోబోటిక్స్ కిట్స్ కొని ఇచ్చింది.

■ ఆటపాటలతో... పాఠాలు

విద్యార్థులు సైన్స్‌సబ్జెక్టుని ఇష్టపడాలని మాలతి కోరిక. అందుకే ఎంతో కష్టమైన చాప్టర్లను సైతం విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తోంది. విలువిద్య, తోలుబొమ్మలాట, పాటలు పాడడం, నృత్యం, కథలు చెప్పడం ద్వారా సైన్స్ పాఠాలను వివరిస్తోంది. కరోనా సమయంలో ఇళ్లకే పరిమితమైన విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతుల ద్వారా బోధించింది. గ్రామాల్లో మొబైల్ ఫోన్స్ లేని అంధవిద్యార్థులకు సైతం ఆడియో పాఠాలను అందించింది.

నూటపద్దెనిమిది మూలకాల పట్టికను సైతం కంఠస్థం చేయాలన్న ఆసక్తి ఉన్న వారికి చక్కగా నేర్చుకునేందుకు సాయపడుతోంది. మేధో వైకల్యాలున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వీరు కూడా మంచి ఉత్తీర్ణత సాధించేలా కృషిచేస్తోంది. ఈ విద్యార్థులకు ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించి వారి నైపుణ్యాలను మెరుగుపరుస్తోంది. ఇలా మాలతీ టీచర్ సాయంతో సైబుల్ ఇస్లాం అనే మేధోవైకల్య విద్యార్థి 25 సెకన్లలో 20 ద్రవాల పేర్లు టకటకా చెప్పి 'చోళన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు దక్కించుకున్నాడు. ఇస్లాంకు మాలతీ ఆరు నెలలపాటు శిక్షణ ఇచ్చింది. మహేశ్వరి, కరణ్, శక్తి ప్రభ వంటి విద్యార్థులు సైతం సెకన్ల వ్యవధిలో నూటపద్దెనిమిది మూలకాల పీరియాడిక్ టేబుల్‌ను అప్పచెప్పి చోళన్ వరల్డ్ రికార్డు బుక్‌లో చోటు దక్కించుకున్నారు. అరవైశాతం మేధో వైకల్యం కారణంగా సరిగా మాట్లాడలేని వారితో సైతం మూలకాల పేర్లను కంఠస్థం చేయించి, గడగడా చెప్పించడం విశేషం.

■ గేమ్‌లకు బానిసలు కాకుండా...

స్మార్ట్‌ఫోన్లు వచ్చాక విద్యార్థులంతా మొబైల్ గేమ్స్‌కు అంకితమైపోతున్నారు. వీరిని ఆడుకోనిస్తూనే పాఠాలు నేర్పించడానికి మాలతి క్విజ్‌గేమ్ వాయిస్ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్‌ను స్టూడెంట్స్‌తోనే తయారు చేయించడం విశేషం. దీనిలో పీరియాడిక్ టేబుల్ ఉంటుంది. ఈ టేబుల్‌లో విద్యార్థుల పేర్లు, ఇంగ్లిష్‌లోని కష్టమైన పదాలను వెతుకుతూ నేర్చుకోవచ్చు. విద్యార్థులకు నేర్పిస్తోన్న పాఠాలను వారి తల్లిదండ్రులు చూసేలా యూట్యూబ్‌లో పోస్టు చేస్తూ వారి ఉన్నతికి కృషిచేస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది మాలతి టీచర్.

యూత్ పల్స్

ఔరా... అవుట్ ఆఫ్ ది బాక్స్

రామ్‌గోపాల్‌వర్మ 'కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: అప్పల్రాజు' సినిమాలో రాఖీ డైలాగు...

'డైరెక్టర్ కావాలంటే ఊరకే కథలు మాత్రమే రాస్తే సరిపోదయ్యా'

కట్ చేస్తే... సినీ కలల యువతరం ఇప్పుడు ఊరకే కథలు రాస్తూ, కలలు కంటూ మాత్రమే కూర్చోవడం లేదు. చిత్రరంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న సాంకేతికతను అధ్యయనం చేస్తోంది. ఇంటర్‌నెట్‌నే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌గా చేసుకొని 'స్క్రిప్ట్ బుక్' 'ఐవా' 'మాజిస్టో'లాంటి ఎన్నో ఏఐ టూల్స్‌పై అవగాహన పెంచుకొని వినూత్నంగా ఆలోచిస్తోంది...



పుణెకు చెందిన నైనా పాటిల్ పేరుకు ఇంజనీరింగ్ చదువుతుందిగానీ ఆమె కలలన్నీ చిత్రసీమ వైపే. ఇంట్లో చెబితే ఒప్పుకోరని తెలుసు. అయితే ఆ భయమేమీ తన కలలకు అడ్డుగోడ కావడం లేదు. తీరిక వేళల్లో అత్యాధునిక సినీ సాంకేతికతకు సంబంధించిన విషయాలు, విశేషాలు తెలుసుకోవడం తనకు ఇష్టం.

కోయంబత్తూరుకు చెందిన నిఖిల్ తేజను ఒక్కసారి కదిపి చూడండి. ఫిల్మ్ ఇండస్ట్రీకి సంబంధించి లేటెస్ట్, గ్రేటెస్ట్ విశేషాలను గుక్కతిప్పుకోకుండా చెబుతాడు. సినీ సాంకేతికతపై అతని పట్టు చూస్తే 'రాబోయే రోజుల్లో కాబోయే డైరెక్టర్' అని ఢంకా బజాయించి చెప్పవచ్చు.

ఒక సినిమా హిట్ కావాలంటే కథ బాగుండాలి. బాగున్న కథను బాగా చెప్పగలగాలి. బాగా చెప్పడానికి మాటల నైపుణ్యంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ రూపంలో సాంకేతిక నైపుణ్యాన్ని కూడా తోడుగా తెచ్చుకుంటుంది సినిమా కలల యువతరం. ఏఐ టూల్స్ వల్ల కథ వినే వారికి గంటల కొద్దీ సమయం వృథా కాకపోవడం ప్లస్ పాయింట్. సినిమాలకు సంబంధించి యువతరం ఆసక్తి చూపుతున్న కొన్ని ఏఐ టూల్స్...

పెద్దగా సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా ఏఐ టూల్ 'స్క్రిప్ట్ బుక్'ను సులభంగా ఉపయోగించవచ్చు. సినిమాలు, టీవీ షోలకు స్క్రిప్ట్ క్రియేట్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. క్యాస్టింగ్, జానర్, స్టోరీ స్ట్రక్చర్‌కు సంబంధించి విశ్లేషణ చేయవచ్చు. 'డెమోక్రటైజింగ్ స్టోరీటెల్లింగ్ త్రూ ది ఆర్ట్ ఆఫ్ ఏఐ' అంటూ తనను పరిచయం చేసుకుంటుంది స్క్రిప్ట్‌బుక్. ఇది సినిమా జయాపజయాలను కూడా అంచనా వేయగలదు అంటున్నారు గానీ ఎంతవరకు నిజమో తెలియదు. డిఫరెంట్ యూజర్లను దృష్టిలో పెట్టుకొని స్క్రిప్ట్‌బుక్‌లో రకరకాల ప్యాకేజీలు ఉన్నాయి. ఇండివిడ్యువల్ రైటర్‌లు, చిన్న ప్రొడక్షన్ హౌజ్‌ల కోసం ది బేసిక్ ప్యాకేజ్, మల్టిపుల్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి స్క్రిప్ట్ ఎనాలసిస్ చేయడానికి ది స్టాండర్డ్ ప్యాకేజీ, ప్రముఖ ప్రొడక్షన్ హౌజ్‌లు, స్టూడియోల కోసం ది ప్రీమియం, నిర్దిష్టమైన అవసరాల కోసం ది ఎంటర్‌ప్రైజ్‌లాంటి ప్యాకేజీలు ఉన్నాయి.

స్టోరీ టెల్లింగ్ ఏఐ టూల్స్‌లో ప్లాట్‌గన్ ఒకటి. దీనితో యానిమేటెడ్ ఫిల్మ్ సులభంగా రూపొందించవచ్చు. యూజర్-ఫ్రెండ్లీ అడ్వాన్స్‌డ్ ఫీచర్‌లతో సినీ కథకులకు, కంటెంట్ క్రియేటర్‌లకు ప్లాట్‌గన్ దగ్గరైంది. 'ప్లాట్‌గన్'ను ఉపయోగించడానికి డ్రాయింగ్ స్కిల్క్స్ అవసరం లేదు. ఎన్నో క్యారెక్టర్‌లతో కూడిన లైబ్రరీ, ఎక్స్‌ప్రెసివ్ యానిమేషన్స్, టైమ్-సేవింగ్ యానిమేషన్, కస్టమ్ వాయిస్ వోవర్స్ అండ్ సౌండ్‌ట్రాక్స్... దీని ప్రత్యేకత.

ఏఐ ప్లాట్‌ఫామ్ 'అడోబ్ సెన్‌సే' వీడియో ఎడిటింగ్, ఆటోమేటెడ్ కలర్ కరక్షన్స్, ఆడియో ఎన్‌హాన్స్‌మెంట్ కు సంబంధించి రకరకాల టూల్స్‌ను అందిస్తోంది. 'ఎమోషన్ ఏఐ' టూల్స్‌తో ఫేషియల్ ఎక్స్‌ప్రెషన్స్, బాడీ లాంగ్వేజ్‌ను ఎనలైజ్ చేయవచ్చు. 'మాజిస్టో' అనేది ఎడిటింగ్ విధానాన్ని సరళం చేసే ఏఐ పవర్డ్ వీడియో ఎడిటింగ్ టూల్. ఫుటేజీలోని 'బెస్ట్ మూమెంట్స్' ఆటోమేటిక్‌గా ఈ టూల్ సెలెక్ట్ చేస్తుంది. మ్యూజిక్‌ను యాడ్ చేస్తుంది. విజువల్ క్వాలిటీ విషయంలో తనవంతు పాత్ర పోషిస్తుంది.

ఐవా (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వర్చువల్ ఆర్టిస్ట్) అనేది ఏఐ-పవర్డ్ మ్యూజిక్ కంపోజిషన్ టూల్. మోడ్రన్ సినిమాటిక్, ఎలక్ట్రానిక్, పాప్, రాక్, జాజ్... ఇలా రకరకాలుగా మ్యూజిక్ క్రియేట్ చేసుకోవచ్చు. స్టోరీలైన్స్, వీటితోపాటు ప్లాట్ ఐడియాలు జెనరేట్ చేయాలనుకునే వారికి ఉపయోగపడే ఏఐ టూల్స్ కూడా ఉన్నాయి.

'స్క్రిప్ట్‌బుక్' నుంచి 'ఐవా' వరకు సినిమాలకు సంబంధించి సకల సాంకేతిక విషయాలను తెలుసుకోవడానికి ఏ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లోనూ శిక్షణ అక్కర్లేదు. ఇంటర్నెట్ ఉంటే చాలు! ఏఐ జెనరేట్ స్టోరీలైన్‌లు, డైలాగులు, స్క్రిప్ట్‌లు త్వరలో మన ఫిల్మ్ ఇండస్ట్రీలోకి కూడా రావచ్చు. ఏఐ జెనరేట్ చేసిన స్టోరీలైన్‌లు, స్క్రిప్ట్‌లను నమ్ముకోవడమా, తమలోని క్రియేటివిటీని మాత్రమే నమ్ముకోవడమా.. అనే రెండు దారులు కనిపించవచ్చు.

'ఏఐ సాంకేతికత అందరికీ అందుబాటులోకి వచ్చాక ప్రత్యేకత అంటూ ఉండకపోవచ్చు. స్టోరీలైన్‌లను క్రియేట్ చేయడంలో సహజత్వం మిస్ కావచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాంకేతికత కంటే సహజత్వానికే ప్రాధాన్యత ఇవ్వాలి. సాంకేతికతపై అవగాహన ఉండడం ముఖ్యమే కాని అది మాత్రమే ముఖ్యం కాదు. సమాజాన్ని అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే కొత్త కథలు పుడతాయి' అంటుంది ఢిల్లీకి చెందిన మాస్ కమ్యూనికేషన్ స్టూడెంట్ వర్షిణి.

మనోహర ప్రపంచం

ఫిల్మ్ కెరీర్ అనేది కలలు కన్నంత సులభం కాదు. ఎన్నో గంటలు పని చేయాల్సి ఉంటుంది. అయితే అది మనకు ఇష్టమైన మనోహర ప్రపంచం కావడంతో శ్రమ తెలియదు. ఫిల్మ్‌మేకర్‌కు కఠిన తరమైన సవాలు ఏమిటంటే పనికి మనకు మధ్య, మనకు ఫ్యామిలీకి మధ్య బ్యాలెన్స్ చేసుకోవడం.

– ఆశ్రిత కామత్, అవతార్ 2 ఆర్ట్ డైరెక్టర్





అమితాబ్‌కు 'గోల్డెన్ టికెట్'

భారత్‌లో జరిగే వన్డే వరల్డ్ కప్‌నకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన 'గోల్డెన్ టికెట్'ను నట దిగ్గజం అమితాబ్ బచ్చన్‌కు బీసీసీఐ కార్యదర్శి జై షా అందజేశారు. ఈ టికెట్ ద్వారా ప్రత్యేక అతిథి హోదాలో అన్ని వేదికల్లో అన్ని మ్యాచ్‌లనూ చూసే అవకాశం ఉంటుంది. మహానటుడే కాకుండా క్రికెట్ వీరాభిమాని అయిన అమితాబ్‌కు 'గోల్డెన్ టికెట్' ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తున్నట్లు, ఎప్పటిలాగే టీమిండియాకు ఆయన మద్దతు కొనసాగాలని జై షా వ్యాఖ్యానించారు.

హిమా దాస్‌పై తాత్కాలిక నిషేధం



భారత స్టార్ అథ్లెట్ హిమా దాస్‌పై జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) తాత్కాలిక నిషేధం విధించింది. గత ఏడాది కాలంలో డోపింగ్ పరీక్షల కోసం ఆమె తన ఆచూకీ వివరాలు 'నాడా'కు ఇవ్వకపోవడంతో ఈ చర్య తీసుకున్నారు. నిబంధనల ప్రకారం హిమా దాస్ రెండేళ్ల నిషేధం ఎదుర్కోవచ్చు. అస్సాంకు చెందిన 23 ఏళ్ల హిమ 2018 జకార్తా ఆసియా క్రీడల్లో 400 మీటర్ల విభాగంలో రజతం, మహిళల 4x400 మీటర్ల రిలేలో స్వర్ణం సాధించింది.



ఆటగాడు	వివరాలు
రోహిత్ శర్మ	వయసు: 36; ఆడిన వన్డేలు: 246; చేసిన పరుగులు: 9922; అత్యధిక స్కోరు: 264; సెంచరీలు: 30; అర్ధ సెంచరీలు: 49; తీసిన వికెట్లు: 8
హార్దిక్ పాండ్యా	వయసు: 29; ఆడిన వన్డేలు: 79; చేసిన పరుగులు: 1753; అత్యధిక స్కోరు: 92; అర్ధ సెంచరీలు: 11; తీసిన వికెట్లు: 74; బెస్ట్ బౌలింగ్: 4/24
విరాట్ కోహ్లి	వయసు: 34; ఆడిన వన్డేలు: 277; చేసిన పరుగులు: 12902; అత్యధిక స్కోరు: 183; సెంచరీలు: 46; అర్ధ సెంచరీలు: 65; తీసిన వికెట్లు: 4
రవీంద్ర జడేజా	వయసు: 34; ఆడిన వన్డేలు: 179; చేసిన పరుగులు: 2574; అత్యధిక స్కోరు: 87; అర్ధ సెంచరీలు: 13; తీసిన వికెట్లు: 197; బెస్ట్ బౌలింగ్: 5/36
బుమ్రా	వయసు: 29; ఆడిన వన్డేలు: 73; తీసిన వికెట్లు: 121; బెస్ట్ బౌలింగ్: 6/19; ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు: 2; చేసిన పరుగులు: 63; అత్యధిక స్కోరు: 16
సిరాజ్	వయసు: 29; ఆడిన వన్డేలు: 26; తీసిన వికెట్లు: 46; బెస్ట్ బౌలింగ్: 4/32; ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 2; చేసిన పరుగులు: 31; అత్యధిక స్కోరు: 9
ఇషాన్ కిషన్	వయసు: 25; ఆడిన వన్డేలు: 19; చేసిన పరుగులు: 776; అత్యధిక స్కోరు: 210; సెంచరీలు: 1; అర్ధ సెంచరీలు: 7; క్యాచ్‌లు/స్టంపింగ్: 11/2
కుల్దీప్ యాదవ్	వయసు: 28; ఆడిన వన్డేలు: 86; తీసిన వికెట్లు: 141; బెస్ట్ బౌలింగ్: 6/25; ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు: 1; చేసిన పరుగులు: 168; అత్యధిక స్కోరు: 19
శార్దుల్ ఠాకూర్	వయసు: 31; ఆడిన వన్డేలు: 40; తీసిన వికెట్లు: 59; ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 4; బెస్ట్ బౌలింగ్: 4/37; చేసిన పరుగులు: 318; అత్యధిక స్కోరు: 50
శ్రేయస్ అయ్యర్	వయసు: 28; ఆడిన వన్డేలు: 44; చేసిన పరుగులు: 1645; అత్యధిక స్కోరు: 113; సెంచరీలు: 2; అర్ధ సెంచరీలు: 14; క్యాచ్‌లు: 16
శుబ్‌మన్ గిల్	వయసు: 23; ఆడిన వన్డేలు: 29; చేసిన పరుగులు: 1514; అత్యధిక స్కోరు: 208; సెంచరీలు: 4; అర్ధ సెంచరీలు: 7; క్యాచ్‌లు: 18
షమీ	వయసు: 33; ఆడిన వన్డేలు: 91; తీసిన వికెట్లు: 163; బెస్ట్ బౌలింగ్: 5/69; ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 9; చేసిన పరుగులు: 204; అత్యధిక స్కోరు: 25
అక్షర్ పటేల్	వయసు: 29; ఆడిన వన్డేలు: 52; తీసిన వికెట్లు: 58; బెస్ట్ బౌలింగ్: 3/24; చేసిన పరుగులు: 413; అత్యధిక స్కోరు: 64 నాటౌట్; అర్ధ సెంచరీలు: 2
సూర్యకుమార్ యాదవ్	వయసు: 32; ఆడిన వన్డేలు: 26; చేసిన పరుగులు: 511; అత్యధిక స్కోరు: 64; అర్ధ సెంచరీలు: 2; క్యాచ్‌లు: 15
కేఎల్ రాహుల్	వయసు: 31; ఆడిన వన్డేలు: 54; పరుగులు: 1986; అత్యధిక స్కోరు: 112; సెంచరీలు: 5; అర్ధ సెంచరీలు: 13; క్యాచ్‌లు/స్టంపింగ్: 32/2

సమరానికి మన సైన్యమిదే

వన్డే ప్రపంచకప్‌కు భారత జట్టు ప్రకటన

- కేఎల్ రాహుల్‌కు టీమ్‌లో చోటు
- తిలక్ వర్మ, ప్రసిధ్‌లకు దక్కని చాన్స్
- సంజు సామ్సన్‌కూ లభించని స్థానం
- మార్పులకు 28 వరకు అవకాశం



అనూహ్య ఎంపికలు, సంచలనంలాంటివేమీ లేవు... అంచనాలకు తగినట్లుగానే సొంతగడ్డపై టీమిండియా బృందం సిద్ధమైంది... ఆసియా కప్ బరిలో నిలిచిన 17 మందిలో ఇద్దరిని తప్పించి వరల్డ్‌కప్ టీమ్‌ను ఎంపిక చేస్తామన్న సెలక్టర్లు దానికే కట్టుబడ్డారు. కొత్తగా మరో ఆటగాడిని తీసుకొని జట్టులోకి చేర్చే ప్రయత్నం చేయలేదు... గాయం నుంచి కోలుకోవడంలో రాహుల్ ఎంపిక ఖాయం కాగా, రిజర్వ్‌గా ఉన్న సంజూ సామ్సన్ పేరును పరిశీలించనే లేదు... ఊహించినట్లుగానే తిలక్ వర్మ, ప్రసిధ్ కృష్ణ తమ స్థానాలు కోల్పోయారు. సరిగ్గా పుష్కర కాలం తర్వాత భారత్ ఆతిథ్యమిస్తున్న ఈ వన్డే వరల్డ్ కప్‌లో 2011 తరహాలోనే మన బృందం మళ్లీ మ్యాజిక్ చేస్తుందా అనేది ఆసక్తికరం.

పల్లెకెలె (శ్రీలంక): వన్డే క్రికెట్‌లో రెండు సార్లు జగజ్జేతగా నిలిచిన భారత జట్టు సొంతగడ్డపై మూడో టైటిల్ కోసం గురి పెట్టింది. టీమిండియాకు అలాంటి ఘనతను అందించే సత్తా ఉన్న 15 మందితో ఇప్పుడు జట్టు సిద్ధమైంది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని బీసీసీఐ సెలక్షన్ కమిటీ మంగళవారం పల్లెకెలెలో ఈ జాబితాను ప్రకటించింది. రోహిత్ శర్మ నాయకత్వంలోని ఈ బృందంలో ఐదుగురు స్పెషలిస్ట్ బ్యాటర్లు, ముగ్గురు స్పెషలిస్ట్ పేసర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు, ఇద్దరు వికెట్ కీపర్ బ్యాటర్లు, ఒక స్పెషలిస్ట్ స్పిన్నర్ ఉన్నారు. ఆసియా కప్‌లో ప్రస్తుతం టీమ్‌లో ఉన్న హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ, పేసర్ ప్రసిధ్ కృష్ణ, రిజర్వ్‌గా ఉన్న సంజూ సామ్సన్‌లకు మాత్రం అవకాశం దక్కలేదు. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వరల్డ్ కప్ కోసం జట్లను ప్రకటించేందుకు ఆఖరి తేదీగా ప్రకటించిన సెప్టెంబర్ 5నే అన్ని టీమ్‌లూ తమ బృందంతో సిద్ధమయ్యాయి. అయితే ఎవరికైనా గాయం లేదా ఇతర కారణాలతో జట్టులో మార్పులు చేయాల్సి ఉంటే సెప్టెంబర్ 28 వరకు కూడా అవకాశం ఉంది. ఆసియా కప్ తర్వాత వరల్డ్ కప్‌కు ముందు భారత్ ఆస్ట్రేలియాతో 3 వన్డేల సిరీస్ ఆడుతుంది.

ఎంపికకు కారణాలివీ...

టాపార్డర్‌లో రోహిత్, గిల్, కోహ్లిల విషయంలో మరో చర్చకు తావు లేదు. గాయాలపాలు కాక ముందు 4, 5 స్థానాల్లో శ్రేయస్, రాహుల్‌ల స్థానాలకు ఢోకా లేదు. కోచ్ రాహుల్ ద్రవిడ్ కూడా పదే పదే ఇదే చెబుతూ వచ్చాడు. అదే నమ్మకంతో కేఎల్ రాహుల్‌కు అవకాశం దక్కింది. మేలో ఐపీఎల్ తర్వాత మైదానంలోకి దిగకపోయినా, ఆసియా కప్‌లో తొలి రెండు మ్యాచ్‌లకు దూరమైనా అతని స్థానానికి ఇబ్బంది లేకుండా పోయింది. వన్డేల్లో మిడిలార్డర్‌లో మంచి రికార్డు ఉండటం కూడా అందుకు ఒక కారణం. ఫిట్‌గా ఉంటే ప్రధాన వికెట్ కీపర్‌గా రాహుల్‌కే మొదటి అవకాశం దక్కుతుంది. వరుసగా నాలుగు వన్డేల్లో అర్ధసెంచరీలు సాధించి మరో కీపర్‌గా ఇషాన్ కిషన్ తన స్థానం నిలబెట్టుకున్నాడు. కొద్ది రోజుల వరకు కూడా సామ్సన్‌తో పోటీ పడినా... రేసులో కేరళ బ్యాటర్ వెనుకబడిపోయాడు. వన్డే ఫామ్ గొప్పగా లేకపోయినా కొన్ని బంతుల వ్యవధిలో ఆట దిశ మార్చగలడంటూ సెలక్టర్లు సూర్యకుమార్‌పై నమ్మకముంచారు. ఆల్‌రౌండర్‌గా హార్దిక్ విలువ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అదే తరహాలో కీలక సమయాల్లో ఆదుకోగల శార్దుల్‌కూ అవకాశం దక్కింది. ప్రధాన పేసర్లుగా బుమ్రా, షమీ, సిరాజ్ విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. స్పిన్ ఆల్‌రౌండర్లుగా జడేజా, అక్షర్ జట్టులో ఉన్నారు. ఒకే తరహాశైలి గల వీరిద్దరికి ఒకేసారి తుది జట్టులో స్థానం సందేహమే. కొంత కాలంగా నిలకడగా రాణిస్తున్న కుల్దీప్ వరల్డ్ కప్ అవకాశం సొంతం చేసుకోగా... లెగ్‌స్పిన్నర్ యజువేంద్ర చహల్ మాత్రం వరల్డ్ కప్‌కు దూరమయ్యాడు. అంతా బాగున్నా మొత్తం జట్టులో ఒకే ఒక లోటు రెగ్యులర్ ఆఫ్‌స్పిన్నర్ లేకపోవడమే. భారత పిచ్‌లపై, ప్రత్యర్థి జట్లలో అగ్రశ్రేణి ఎడంచేతి వాటం బ్యాటర్లు ఎక్కువ మంది ఉండగా ఆఫ్‌స్పిన్నర్ బాగా ప్రభావం చూపగలిగేవాడు. సీనియర్ అశ్విన్ లేదంటే యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను పరిశీలించినా బాగుండేది.

రోహిత్ తొలిసారి కెప్టెన్‌గా

2019 వన్డే వరల్డ్ కప్‌లో ఆడిన 8 మంది ఈసారి కూడా టీమ్‌లో ఉండటం విశేషం. 2011 వరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కని రోహిత్ శర్మ తర్వాతి రెండు టోర్నీల్లో ఆడాడు. గత వరల్డ్ కప్‌లో ఏకంగా ఐదు సెంచరీలతో అదరగొట్టిన అతను ఈసారి సొంతగడ్డపై సారథిగా పెద్ద బాధ్యతతో బరిలోకి దిగుతున్నాడు. 2011 విజయంలో భాగమైన విరాట్ కోహ్లి ప్రస్తుత టీమ్‌లో వన్డే వరల్డ్ గెలిచిన ఒకే ఒక ఆటగాడు. గిల్, శ్రేయస్, సూర్య, కిషన్, అక్షర్, శార్దుల్, సిరాజ్‌లకు ఇదే తొలి ప్రపంచకప్. తొలి మ్యాచ్‌లో అక్టోబర్ 8న చెన్నైలో ఆస్ట్రేలియాను భారత్ ఎదుర్కొంటుంది.



"జట్టు కోసం కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. ఈ క్రమంలో కొందరికి నిరాశ కలగడం సహజం. సమతూకం కోసమే శార్దుల్, అక్షర్‌లను తీసుకున్నాం. గత కొన్నేళ్లుగా లోయర్ ఆర్డర్‌లో బలహీన బ్యాటింగ్‌తో సమస్య ఎదుర్కొన్నాం. 8వ, 9వ స్థానాల్లో ఆడేవారు కూడా కొన్ని పరుగులు చేయడం అవసరం. వారికి ఆ విషయం స్పష్టంగా చెప్పాం కూడా. పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో హార్దిక్ ఆట చూస్తే అతను ఎంత కీలకమో అర్థమవుతుంది. ఫైనల్‌తో కలిపితే 11 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది. టి20లతో పోలిస్తే వన్డేల్లో కోలుకునేందుకు, వ్యూహాలు రూపొందించుకునేందుకు తగినంత సమయం ఉంటుంది. అన్ని రకాలుగా ఈ టీమ్ అత్యుత్తమం అని మేం భావిస్తున్నాం. టీమ్ ప్రకటించేందుకు ముందు ఎంతో చర్చించి, ఎంతో ఆలోచించాం. ఎంపికతో ఎంతో సంతృప్తిగా ఉన్నాం.

–రోహిత్ శర్మ, భారత కెప్టెన్

జట్టులో ఇప్పుడు ఎవరికీ ఫిట్‌నెస్ సమస్యలు లేవు. అందరూ పూర్తిగా కోలుకున్నారు. ఎన్‌సీఏలో జరిగిన క్యాంప్‌లో రాహుల్ 50 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి 50 ఓవర్లు కీపింగ్ కూడా చేశాడు. కాబట్టి అతని గురించి ఎలాంటి ఆందోళన లేదు. ఆఫ్‌స్పిన్నర్‌పై చర్చ జరిగింది. అయితే జడేజా, అక్షర్ ఎడంచేతి వాటం బ్యాటర్లకు సమర్థంగా బౌలింగ్ చేయగలరని నమ్ముతున్నాం. వీరిద్దరి బ్యాటింగ్ కూడా అవసరం కాబట్టి ఆఫ్‌స్పిన్నర్ ఆలోచనను పక్కన పెట్టాం.

–అజిత్ అగార్కర్, చీఫ్ సెలక్టర్

సెమీస్‌లో కోకో గాఫ్



న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో అమెరికా టీనేజ్ స్టార్, ఆరో సీడ్ కోకో గాఫ్ తొలిసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో కోకో గాఫ్ 67 నిమిషాల్లో 6–0, 6–2తో 20వ సీడ్ ఒస్టాపెంకో(లాత్వియా)పై గెలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను బోల్తా కొట్టించిన 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఒస్టాపెంకో క్వార్టర్ ఫైనల్లో మాత్రం చేతులెత్తేసింది. గాఫ్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. ఒస్టాపెంకో 36 అనవసర తప్పిదాలు చేసింది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్), 12వ సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

అయ్యో అఫ్గానిస్తాన్!

- 2 పరుగులతో అనూహ్య ఓటమి
- 'సూపర్–4' దశకు శ్రీలంక



రషీద్ ఖాన్

లాహోర్: శ్రీలంకతో మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ విజయ లక్ష్యం 292 పరుగులు... అయితే 37.1 ఓవర్లలో దీనిని ఛేదిస్తేనే ఆ జట్టు 'సూపర్–4'కు చేరుతుంది. దీనిని సవాల్‌గా తీసుకొని బ్యాటర్లంతా విజృంభించారు. అందరూ దూకుడుగా ఆడి జట్టును విజయానికి చేరువగా తెచ్చారు. 37 ఓవర్లలో స్కోరు 289 పరుగులకు చేరింది. మరో బంతికి 3 పరుగులు తీస్తే గెలుపు సొంతమవుతుందనగా వికెట్ కోల్పోయింది. అయితే తర్వాతి 3 బంతుల్లో మరో 6 పరుగులు చేసినా విజయానికి లెక్క సరిపోయేది. కానీ అదీ సాధ్యం కాలేదు. చివరకు 2 పరుగులతో గెలిచిన శ్రీలంక 'సూపర్–4' దశకు అర్హత సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 291 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (92; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) టాప్ స్కోరర్. అనంతరం అఫ్గానిస్తాన్ 37.4 ఓవర్లలో 289 పరుగులకు ఆలౌటైంది. నబీ (32 బంతుల్లో 65; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), హష్మతుల్లా (59; 3 ఫోర్లు, 1 సిక్స్), రహమత్ షా (45; 5 ఫోర్లు, 1 సిక్స్), రషీద్ ఖాన్ (16 బంతుల్లో 27 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) నజీబుల్లా (బి) గుల్బదిన్ 41; కరుణరత్నే (సి) నబీ (బి) గుల్బదిన్ 32; కుశాల్ మెండిస్ (రనౌట్) 92; సమరవిక్రమ (సి) గుర్బాజ్ (బి) గుల్బదిన్ 3; అసలంక (సి అండ్ బి) రషీద్ ఖాన్ 36; ధనంజయ డిసిల్వా (బి) ముజీబ్ 14; షనక (బి) రషీద్ ఖాన్ 5; వెలలాగె (నాటౌట్) 33; తీక్షణ (బి) గుల్బదిన్ 28; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు)** 291. వికెట్ల పతనం: 1–63, 2–80, 3–86, 4–188, 5–221, 6–226, 7–227, 8–291. బౌలింగ్: ఫారూఖీ 7–1–52–0, ముజీబ్ 10–0–60–1, గుల్బదిన్ 10–0–60–4, నబీ 10–0–35–0, రషీద్ ఖాన్ 10–0–63–2, కరీమ్ జనత్ 3–0–20–0.

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) మెండిస్ (బి) రజిత 4; ఇబ్రహీమ్ (బి) రజిత 7; గుల్బదిన్ (ఎల్బీ) (బి) పతిరణ 22; రహ్మత్ (సి) పతిరణ (బి) రజిత 45; హష్మతుల్లా (సి) రజిత (బి) వెలలాగె 59; నబీ (సి) ధనంజయ (బి) తీక్షణ 65; కరీమ్ (సి) కరుణరత్నే (బి) వెలలాగె 22; నజీబుల్లా (సి) (సబ్) హేమంత (బి) రజిత 23; రషీద్ (నాటౌట్) 27; ముజీబ్ (సి) సమరవిక్రమ (బి) ధనంజయ 0; ఫారుఖీ (ఎల్బీ) (బి) ధనంజయ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (37.4 ఓవర్లలో ఆలౌట్)** 289. వికెట్ల పతనం: 1–10, 2–27, 3–50, 4–121, 5–201, 6–234, 7–237, 8–276, 9–289, 10–289. బౌలింగ్: రజిత 10–0–79–4, తీక్షణ 10–0–62–1, వెలలాగె 4–0–36–2, పతిరణ 10–0–63–1, షనక 2–0–32–0, ధనంజయ 1.4–0–12–2.

ఆసియా కప్ 'సూపర్–4' వేదికల్లో మార్పు లేదు

ఆదివారం భారత్ X పాకిస్తాన్

కొలంబో: భారీ వర్షాల కారణంగా కొలంబోలో జరగాల్సిన ఆసియా కప్ 'సూపర్–4' మ్యాచ్‌లు, ఫైనల్ వేదికను మార్చవచ్చంటూ జరిగిన చర్చకు ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) ఫుల్‌స్టాప్ పెట్టింది. ముందుగా నిర్ణయించిన ప్రకారమే ఒక మ్యాచ్ నేడు పాకిస్తాన్, బంగ్లాదేశ్ జట్ల మధ్య లాహోర్‌లో... ఫైనల్ సహా తర్వాతి 6 మ్యాచ్‌లు కొలంబోలోనే జరుగుతాయని ప్రకటించింది. మ్యాచ్‌లను హంబన్‌టోటాకు మార్చే విషయంపై ప్రసారకర్తల అభ్యంతరం సహా ఇతర సమస్యలు ఉండటంతో ఏసీసీ ఈ నిర్ణయం తీసుకుంది. కొలంబోలో రాబోయే రోజుల్లో వర్షాలు తగ్గుముఖం పట్టవచ్చని నిర్వాహకులు ఆశిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం 'సూపర్–4' దశలో ఈ నెల 10న పాకిస్తాన్‌తో, 12న శ్రీలంకతో, 15న బంగ్లాదేశ్‌తో భారత్ తలపడుతుంది.

భారత షట్లర్లకు నిరాశ



ప్రణయ్

చాంగ్జౌ: చైనా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత క్రీడాకారులకు నిరాశ ఎదురైంది. సింగిల్స్‌లో బరిలోకి దిగిన ముగ్గురు క్రీడాకారులు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్, ప్రియాన్షు రజావత్ తొలి రౌండ్‌లోనే ఓడిపోగా, డబుల్స్‌లో పోటీపడిన రెండు జోడీలు పుల్లెల గాయత్రి–ట్రిసా జాలీ, ఎంఆర్ అర్జున్–ధ్రువ్ కపిల మొదటి రౌండ్‌ను దాటలేకపోయాయి. ప్రపంచ ఆరో ర్యాంకర్ ప్రణయ్ 12–21, 21–13, 18–21తో 22వ ర్యాంకర్ ఎన్జీ జె యోంగ్ (మలేసియా) చేతిలో ఓటమి పాలయ్యాడు. 12వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–23, 21–16, 9–21తో పదో ర్యాంకర్ ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో... 28వ ర్యాంకర్ ప్రియాన్షు రజావత్ 13–21, 24–26తో 45వ ర్యాంకర్ రుస్తావిటో (ఇండోనేసియా) చేతిలో పరాజయం చవిచూశారు.

సినిమా

మురళీధరన్ అదే చేశాడు! - సచిన్ టెండూల్కర్



● జయసూర్య, సచిన్, ముత్తయ్య మురళీధరన్

''1993లో మురళీధరన్‌ని కలిశాను. అప్పట్నుంచి మా స్నేహం అలాగే ఉంది. ఎంతో సాధించినా సాధారణంగా ఉంటాడు. అతను ఏదైనా అడిగితే కుదరదని చెప్పడం కష్టం.. అందుకే పిలవగానే ఈ వేడుకకి వచ్చాను'' అన్నారు భారత క్రికెటర్ సచిన్ టెండూల్కర్. టెస్ట్ క్రికెట్ చరిత్రలో 800 వికెట్లు తీసిన ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా రూపొందిన సినిమా '800'. మురళీధరన్ పాత్రలో మధుర్ మిట్టల్ నటించారు. ఎంఎస్ శ్రీపతి దర్శకత్వం వహించారు. శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో వివేక్ రంగాచారి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ముంబైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో '800' ట్రైలర్‌ని సచిన్ టెండూల్కర్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఆటలో గెలుపోటములు ఉంటాయి. మళ్లీ నిలబడి పోటీ ఇవ్వడమే నిజమైన ఆటగాడి లక్షణం. మురళీధరన్ అదే చేశాడు.. అతని జీవితం గురించి ప్రజలు తెలుసుకోవాలి'' అన్నారు. ముత్తయ్య మురళీధరన్ మాట్లాడుతూ– ''నేను సచిన్ ఫ్యాన్‌ని. మరో వందేళ్ల తర్వాత కూడా సచిన్ లాంటి క్రికెటర్, వ్యక్తి రాలేరు'' అన్నారు. ''ఈ సినిమాను విడుదల చేయడం అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు శివలెంక కృష్ణప్రసాద్. ''800' మానవత్వంతో కూడిన కథ'' అన్నారు ఎంఎస్ శ్రీపతి. ''మురళీధరన్‌గారి పాత్ర చేయడం ఓ పెద్ద బాధ్యత'' అన్నారు మధుర్ మిట్టల్.

బాహుబలి కంటే ఎక్కువ యాక్షన్ సీన్స్ చేశాను - సత్యరాజ్

''వెపన్'లాంటి సినిమా తీయాలంటే డైరెక్టర్, ప్రొడ్యూసర్స్, సినిమాటోగ్రాఫర్, వీఎఫ్‌ఎక్స్.. ఇలా సాంకేతిక నిపుణులే కీలకం. వాళ్ల తర్వాత యాక్టర్స్‌కు ప్రాధాన్యత అని నా అభిప్రాయం. 'బాహుబలి' కంటే 'వెపన్'లో ఎక్కువ యాక్షన్ సీన్స్ చేశా. గుహన్ సరికొత్త విజన్‌తో తీశారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ అవుతుంది'' అన్నారు సత్యరాజ్. గుహన్ సెన్నియప్పన్ దర్శకత్వంలో సత్యరాజ్, వసంత్ రవి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'వెపన్'. మన్సూర్ నిర్మించిన ఈ సినిమా గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. ''సరికొత్త సూపర్ హ్యూమన్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రం రూపొందింది'' అన్నారు వసంత్ రవి. ''మా బ్యానర్‌లో వస్తోన్న తొలి చిత్రమిది'' అన్నారు మన్సూర్. ''ఈ చిత్రంలో అద్భుతమైన యాక్షన్ సీక్వెన్సులున్నాయి'' అన్నారు గుహన్ సెన్నియప్పన్.



● వసంత్ రవి, సత్యరాజ్, తాన్యా హోప్

హర్ట్ చేసేలా మాట్లాడలేను - అనుష్క



ఐదేళ్ల తర్వాత అనుష్క వెండితెరపై కనిపించనున్నారు. 'ఇక కెరీర్‌లో ఇంత లాంగ్ గ్యాప్ ఎప్పుడూ తీసుకోను' అంటున్నారామె. మహేశ్‌బాబు పి. దర్శకత్వంలో అనుష్కా శెట్టి, నవీన్ పొలిశెట్టి ముఖ్య తారలుగా యూవీ క్రియేషన్స్ పై వంశీ, ప్రమోద్ నిర్మించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. రేపు (సెప్టెంబర్ 7) ఈ చిత్రం విడుదల కానుంది. 'భాగమతి' (2018) తర్వాత అనుష్క సిల్వర్ స్క్రీన్‌పై కనిపించనున్న చిత్రం ఇది. ఇక 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అనుష్క చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.

● **'మిస్ శెట్టి..'లో చేసిన షెఫ్ అన్విత క్యారెక్టర్ గురించి...**

షెఫ్ క్యారెక్టర్ చేయడం నాకు ఇదే తొలిసారి. ఇది నా బెస్ట్ మూవీలా ఫీలవుతున్నాను. ఎందుకంటే ఐదున్నరేళ్ల థియేట్రికల్ రిలీజ్ తర్వాత ఒక కొత్త పాత్ర, సరికొత్త కథాంశం ఉన్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాను. ఈ చిత్రంలో మంచి భావోద్వేగాలు ఉన్నాయి.

● **ట్రైలర్‌లో కామెడీ, ఎమోషన్ కనిపించాయి. మీరీ సినిమా ఒప్పుకోవడానికి కారణం ఇవేనా?**

నేను కథకి ప్రాధాన్యత ఇస్తాను. నాకు, నిర్మాతలకు వినయ్‌గారు అని కామన్ ఫ్రెండ్ ఉన్నారు. మహేశ్ వద్ద ఒక స్టోరీ ఉంది వింటారా? అని అడిగారు.. అయితే సినిమా చేయమని కాదు. మహేశ్‌గారు కథ చెప్పాక అన్విత పాత్ర ఎవరు చేస్తున్నారు? అని అడిగాను. ఇంకా ఎవర్నీ అనుకోలేదని తను చెప్పగానే నేను చేస్తానన్నాను. మహేశ్ ఓ మంచి కథని కొత్తగా, క్లీన్ వేలో చూపించారు.

● **క్లీన్ వే అన్నారు. ట్రైలర్‌లో 'తల్లవ్వాలంటే గర్భవతి కావాలి కానీ పెళ్లక్కర్లేదు' అనే డైలాగ్ చెప్పారు..**

అలా ఎందుకు చెప్పాల్సి వచ్చిందనేది సినిమా చూస్తే అర్థం అవుతుంది. ట్రైలర్ అన్నది జస్ట్ గ్లింప్స్ మాత్రమే. లైఫ్‌లో ఎలా ఉంటాం? మన మైండ్ ఎలా మాట్లాడుతుంది? అనేది చెప్పాం.

● **మైండ్‌లో ఉన్నదాన్ని బయటకు చెబితే సమాజం ఒప్పుకోదు కదా?**

మన మైండ్ చాలా విషయాలు చెబుతుంది. కానీ, వాటిలోని సున్నితత్వాన్ని మనం అర్థం చేసుకొని మాట్లాడాలి. నా ఇష్టం వచ్చినది నేను చెబుతాను.. దాన్ని అర్థం చేసుకోకుంటే మీ సమస్య అనను. మనం ఏం చెప్పాలనుకుంటున్నామో దాన్ని సరైన విధానంలో చెప్పాలి. అంతేకానీ, ఎదుటి వారు హర్ట్ అయ్యేలా చెప్పడం సరికాదని నమ్ముతాను. మన మైండ్‌లో ఉన్నదాన్ని చెప్పే పద్ధతిలో చెప్పాలి.

● **18 ఏళ్ల కెరీర్‌లో నటిగా మీ గ్రాఫ్ పెరిగింది. వ్యక్తిగతంగానూ పెద్దంత వివాదాలు లేకుండా సాగిన ఇన్నేళ్ల ప్రయాణాన్ని విశ్లేషించుకుంటే..**

యాక్చువల్లీ నేను కాంట్రవర్శీలను హ్యాండిల్ చేయలేను. ఎందుకంటే నేను చాలా సెన్సిటివ్. ఇలా నాలా సెన్సిటివ్‌గా ఉండేవాళ్లకు వేరేవాళ్ల ఎమోషన్స్ అర్థమవుతాయి. దాంతో హర్ట్ అయ్యేలా మాట్లాడలేం. నాకు ఇండస్ట్రీ, ప్రేక్షకుల నుంచి బోలెడంత ప్రేమ, గౌరవం దక్కాయి. అందుకే పెద్దగా వివాదాలు కూడా లేవు.

● **అరుంధతి, దేవసేన (బాహుబలి), భాగమతి.. ఇలాంటి రేర్ క్యారెక్టర్స్ దక్కడం మీకో బ్లెస్సింగ్ అనొచ్చా..**

కచ్చితంగా.. మనకి హార్డ్‌వర్క్ చేయాలని ఉన్నా రైట్ చాన్స్ కూడా రావాలంటాను. శ్యామ్‌గారు, కోడి రామకృష్ణగారు నన్ను 'అరుంధతి'గా విజువలైజ్ చేసి, నమ్మి తీసుకున్నారు. దర్శక–నిర్మాతలు నన్ను నమ్మారు కాబట్టి నాకు హార్డ్ వర్క్ చేయడానికి చాన్స్ దొరికింది. నిరూపించుకునే స్కోప్ దక్కింది.

ఈ మధ్య మీలో భక్తి భావం ఎక్కువయినట్టుంది.. పూజలు చేస్తున్నారు... ఆలయాలు సందర్శిస్తున్నారు..

ఇప్పుడనే కాదు.. నా చిన్నప్పటి నుంచి కూడా మా కుటుంబంలో గుడికి వెళ్లడం ఒక భాగం. ప్రతి సోమవారం, శుక్రవారం పూజలు చేస్తుంటాం. అయితే కంటిన్యూస్‌గా సినిమాలు చేయడంవల్ల ఆ మధ్య గుడికి వెళ్లడానికి కుదరలేదు. ఈ మధ్య వచ్చిన లాంగ్ గ్యాప్‌లో వెళ్లడానికి కుదిరింది.

పెళ్లి కాని అమ్మాయిలు పూజలు చేస్తే.. పెళ్లి కోసమే అనే చర్చ జరుగుతుంటుంది... మీ గురించి కూడా అలాంటి ఒక చర్చ ఉంది..

ఇప్పుడనే కాదు.. నేను గుడికి వెళ్లిన ప్రతిసారీ ఏదో ఒక చర్చ జరుగుతూనే ఉంది. ఒక మంచి విషయం ఏంటంటే.. నా కూతురి గురించి అందరూ ఇంత కేర్ తీసుకుంటారని మా అమ్మానాన్న ఆనందపడతారు (నవ్వుతూ).

మరి.. పెళ్లి కబురు ఎప్పుడు చెబుతారు?

ఇప్పుడు ప్లాన్స్ లేవు. పెళ్లనేది మంచి విషయం కాబట్టి కుదిరినప్పుడు హ్యాపీగా షేర్ చేసుకుంటా.

మీ కో–స్టార్స్‌కి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చినప్పుడు మీకు సంతోషం అనిపించడం సహజం... అలా పాన్ ఇండియా స్థాయి గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ గురించి...

ప్రభాస్‌గారు నాకు 2005 నుంచే తెలుసు. అప్పుడు ఎలా ఉన్నారో ఇప్పుడు ఈ స్థాయి గుర్తింపు వచ్చాక కూడా ప్రభాస్‌గారు అలానే ఉన్నారు. ఏ మార్పూ లేదు. తను నాకు 'వెరీ వెరీ డియర్ ఫ్రెండ్'. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. అలాగే రాజమౌళిగారి ఫ్యామిలీ కూడా నాకు క్లోజ్. భైరవ (కాలభైరవ)ని తన చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. తనకు మంచి ('కొమురం భీముడో..'కి సింగర్‌గా నేషనల్ అవార్డు వచ్చిన విషయాన్ని ఉద్దేశించి) గుర్తింపు రావడం హ్యాపీగా ఉంది. మనకు క్లోజ్‌గా ఉన్నవాళ్లు ఎదుగుతుంటే చూడ్డానికి చాలా ఆనందంగా ఉంటుంది.

సాక్షి బిజినెస్
బుధవారం
6-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	152	65,780
నిఫ్టీ ▲	46	19,575

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	14,034	▲	2
డోజోన్స్	34,716	▽	122
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,438	▽	15
డాక్స్	15,772	▽	53
షాంఘై	3,154	▽	23
నికాయ్	33,037	▲	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,356
బంగారం (99.5 స్వచ్ఛత)	59,118
వెండి (కిలో)	72,231

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.03	83.70
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	87.84	90.96
€	యూరో	ఎస్‌బీఐ	102.85	106.28
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.61	57.34
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.16	54.46
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.09	62.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	22.81
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.25	12.32

పాత కారుకే ప్రాధాన్యత

- 70% కస్టమర్లు యూజ్డ్ కార్ల వైపు
- వ్యవస్థీకృతం అవుతున్న మార్కెట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పాత కారు.. పేరులో పాత ఉందని చిన్నచూపు చూడకండి. దేశంలో అమ్ముడవుతున్న పాత కార్ల సంఖ్య తెలిస్తే నోరెళ్లబెడతారు. 2022–23లో దేశవ్యాప్తంగా 15 శాతం వృద్ధితో 50 లక్షల యూనిట్ల యూజ్డ్ కార్లు చేతులు మారాయి. ఇందులో అవ్యవస్థీకృత రంగం వాటా 70 శాతం కాగా వ్యవస్థీకృత (ఆర్గనైజ్డ్) రంగం వాటా 30 శాతం ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ 65 లక్షల యూనిట్లను తాకనుంది. ఈ రంగంలో దేశంలో ఎనిమిదవ స్థానంలో ఉన్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 8 శాతంగా ఉంది. భారత్‌లో 2030 నాటికి పాత కార్ల పరిశ్రమ కొత్త వాటితో పోలిస్తే రెండింతలకు చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. తొలిసారిగా కారును సొంతం చేసుకుంటున్న కస్టమర్లలో 70 శాతం మంది పాత కారును కొనుగోలు చేస్తున్నారంటే ఆశ్చర్యం కలగకమానదు.

వ్యవస్థీకృత రంగమే..

యూజ్డ్ కార్ల మార్కెట్‌ను వ్యవస్థీకృత రంగమే నడిపిస్తోందని కార్స్24 కో–ఫౌండర్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ గజేంద్ర జంగిడ్ సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. 'పాత కార్ల రంగంలో అవ్యవస్థీకృత మార్కెట్ వార్షిక వృద్ధి 10 శాతమే. ఆర్గనైజ్డ్ మార్కెట్ ఏకంగా 30 శాతం వృద్ధి చెందుతోంది. కొత్త కార్ల విషయంలో 75 శాతం మందికి రుణం లభిస్తోంది. అదే పాత కార్లు అయితే ఈ సంఖ్య 15 శాతమే. యూజ్డ్ కార్లకు రుణం లభించడం అంత సులువు కాదు. ఇక కారు ఉండాలనుకోవడం ఒకప్పుడు ఆకాంక్ష. నేడు అవసరంగా భావిస్తున్నారు. అందుకే కొత్తదానితో పోలిస్తే సగం ధరలో దొరికే యూజ్డ్ కారు స్టీరింగ్ పట్టుకుంటున్నారు. ఇటీవలి కాలంలో సర్టిఫైడ్ కార్లకు డిమాండ్ పెరుగుతోంది. క్వాలిటీ చెక్స్, వారంటీ, రిటర్న్ పాలసీ, ఈజీ ఫైనాన్స్.. ఇన్ని సౌకర్యాలు ఉండడంతో సర్టిఫైడ్ కార్ల పట్ల వినియోగదార్లలో నమ్మకం ఏర్పడింది' అని ఆయన వివరించారు.



రెండు నగరాల్లోనే..

భారత్‌లో యూజ్డ్ కార్ల విక్రయ రంగంలో ఉన్న కంపెనీలు, విక్రేతలు వాహనాలను కొనుగోలు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. అదే హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లలో మాత్రమే పార్కింగ్ విధానం ఉందని కార్స్24 చెబుతోంది. అంటే పాత కారు యజమానులు యూజ్డ్ కార్స్ విక్రయ కేంద్రాల్లో అద్దె చెల్లించి తమ వాహనాన్ని పార్క్ చేయవచ్చు. మంచి బేరం వస్తే యజమాని సమ్మతి మేరకు కారును విక్రయిస్తారు. కమీషన్ ఆధారంగానూ క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఇక 2015లో 100 కొత్త కార్లు రోడ్డెక్కితే అంతే స్థాయిలో పాత కార్లు చేతులు మారాయి. ఇప్పుడీ సంఖ్య 150 యూనిట్లకు చేరింది. యూఎస్, ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లో 100 కొత్త కార్లకు 400 పాత కార్లు అమ్ముడవుతున్నాయి.

సగటు ధర రూ. 6 లక్షలు..

పాత కారు కొనుగోలు సగటు ధర రూ.6 లక్షలు ఉంటోంది. అమ్ముడవుతున్న మొత్తం పాత కార్లలో హ్యాచ్‌బ్యాక్ వాటా 60 శాతం కైవసం చేసుకుంది. ఈ విభాగం వృద్ధి నిలకడగా ఉంది. 20 శాతం వాటా ఉన్న సెడాన్స్ వృద్ధి రేటు తగ్గుతూ ప్రస్తుతం 20 శాతానికి వచ్చి చేరింది. ఎస్‌యూవీల వాటా క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 20 శాతంగా ఉంది. అయితే వృద్ధి ఏకంగా 30 శాతానికి చేరింది. 2030 నాటికి ఎస్‌యూవీల వాటా పాత కార్ల కొనుగోళ్లలో 40 శాతానికి ఎగుస్తుందని పరిశ్రమ భావిస్తోందని సుధీర్‌కార్స్.కామ్ ఫౌండర్ బండి సుధీర్ రెడ్డి తెలిపారు. అదే కొత్త కార్ల విషయంలో ప్రస్తుతం ఎస్‌యూవీల వాటా 45 శాతం తాకిందన్నారు. హ్యాచ్‌బ్యాక్స్ వాటా 30 శాతముందని చెప్పారు. దేశవ్యాప్తంగా గత ఆర్థిక సంవత్సరంలో 38.9 లక్షల యూనిట్ల కొత్త కార్లు రోడ్డెక్కాయి. 2023–24లో ఈ సంఖ్య 40 లక్షల యూనిట్లు దాటుతుందన్న అంచనాలు ఉన్నాయి.

19,550 స్థాయి పైకి నిఫ్టీ

- అధిక వెయిటేజీ షేర్ల అండ
- మూడో రోజూ ముందుకే



ముంబై: అధిక వెయిటేజీ ఐటీసీ, రిలయన్స్, ఇన్ఫోసిస్ షేర్లు ఒక శాతం మేర రాణించడంతో స్టాక్ సూచీలు మూడోరోజూ ముందడుగేశాయి. ఇంట్రాడేలో 231 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 152 పాయింట్ల లాభంతో 65,780 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19,526 – 19,587 శ్రేణిలో కదలాడింది. చివరికి 46 పాయింట్లు బలపడి 19,575 వద్ద నిలిచింది. ఫైనాన్స్, ఆటో, టెలికం మినహా అన్ని రంగాలకు చిన్న, మధ్య తరహా షేర్లకు డిమాండ్ నెలకొంది. ఫలితంగా నిఫ్టీ మిడ్, స్మాల్ సూచీలు జీవితకాల గరిష్ట స్థాయిలను నమోదు చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,725 కోట్ల ఈక్విటీలను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,078 కోట్ల షేర్లను కొన్నారు. ''ప్రపంచ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు, క్రూడాయిల్ ధరల పెరుగుదల, దేశీయ సేవల రంగం ఆగస్టులో నెమ్మదించడం, ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి బలహీనత అంశాలు సూచీల లాభాలను పరిమితం చేశాయి'' అని స్టాక్ నిపుణులు తెలిపారు.

రూ.7 లక్షల కోట్ల సంపద సృష్టి

సెన్సెక్స్ 3 రోజుల్లో 949 పాయింట్లు ర్యాలీతో బీఎస్‌ఈలో రూ.7 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.316.64 లక్షల కోట్లకు చేరింది.

విష్ణు ప్రకాశ్ ఆర్... లిస్టింగ్ హిట్

విష్ణు ప్రకాశ్ ఆర్ పుంగ్లియా షేరు లిస్టింగ్ రోజే 47% లాభాలు పంచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర (రూ.99)తో పోలిస్తే 64% ప్రీమియంతో రూ.163 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 66% ర్యాలీ చేసి రూ.164 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో రూ.144 వద్ద స్థిరపడింది.

నిఫ్టీ నుంచి జియో ఫిన్ ఔట్

ఎన్‌ఎస్‌ఈ నుంచి జియో ఫైనాన్షియల్ వైదొలగనుంది. గడిచిన రెండు ట్రేడింగ్ సెషన్లలో షేరు ప్రైస్ బాండ్‌ను అందుకోలేకపోయింది. దీంతో ఈ సెప్టెంబర్ 7 నుంచి ఎక్స్ఛేంజీలోని పలు సూచీల షేరు తొలగించాలని ఎన్‌ఎస్‌ఈ ఇండెక్సుల నిర్వహణ ఉప కమిటీ నిర్ణయం తీసుకుంది. జియో ఫైనాన్స్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.63% పెరిగి రూ.255.05 వద్ద స్థిరపడింది.

రూపాయి 33 పైసలు క్షీణత

డాలర్ మారకంలో రూపాయి విలువ 33 పైసలు క్షీణించి 83.04 స్థాయి వద్ద స్థిరపడింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడం, చైనా యువాన్ బలహీనపడటం, అమెరికా బాండ్లపై అధిక రాబడుల అంశాలు దేశీయ కరెన్సీ కోతకు కారణమయ్యాయి.

ఆగస్టులో 'సేవలు' అంతంతమాత్రమే!

న్యూఢిల్లీ: భారత్ స్థూల దేశీయోత్పత్తిలో (జీడీపీ) మెజారిటీ వాటా కలిగిన సేవల రంగం ఆగస్టులో నెమ్మదించింది. జూలైలో 62.3 వద్ద ఉన్న ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ ఆగస్టులో 60.1కి తగ్గింది. అయితే సూచీకి సంబంధించి ఆశావహ దృక్పథం, కొత్త ఆర్డర్లు కొనసాగుతున్నట్లు గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్‌లో ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలీయానా డీ లిమా పేర్కొన్నారు. నిజానికి సూచీ 50పైన ఉంటే వృద్ధి ధోరణిగా, ఆ లోపునకు పడిపోతే క్షీణతగా పరిగణిస్తారు. ఈ ప్రాతిపదికన సేవల రంగం సూచీ వరుసగా 25 నెలల నుంచీ వృద్ధి బాటన కొనసాగుతోంది.



సేవలు, తయారీ కూడా కిందకే..!

మరోవైపు సేవలు, తయారీ రంగం కలగలిపిన ఎస్‌అండ్‌పీ గ్లోబల్ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూలైలో 61.9 వద్ద ఉంటే, ఆగస్టులో 60.9కి తగ్గింది.

- **యోనో యాప్‌పై ఆదాయం రూ.100 కోట్లు**
  ఎస్‌బీఐకి మొబైల్ యాప్ యోనో మంచి ఆదాయ వనరుగా మారింది. ఈ యాప్‌పై ఎస్‌బీఐ సబ్సిడరీ ఉత్పత్తులు విక్రయించడం ద్వారా ఫీజుల రూపంలో ప్రతి త్రైమాసికానికి రూ.100 కోట్ల ఆదాయం సమకూరుతున్నట్టు ఎస్‌బీఐ చైర్మన్ దినేష్ ఖరా తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	468–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
5-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	450–00
వరంగల్	452–00

మెటాకు కీలక మార్కెట్‌గా భారత్

కంపెనీ ఇండియా హెడ్ సంధ్య దేవనాథన్



న్యూఢిల్లీ: స్థూలఆర్థిక వృద్ధి, డిజిటల్ మౌలిక సదుపాయాలు తదితర అంశాల్లో భారత్‌లో అపరిమిత అవకాశాలు ఉన్నాయని సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ ఇండియా హెడ్ సంధ్య దేవనాథన్ చెప్పారు. వీటితో పాటు ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి తమ యాప్స్ గణనీయంగా ప్రాచుర్యం పొందుతున్న నేపథ్యంలో భారత్‌ను తాము కీలక మార్కెట్‌గా పరిగణిస్తున్నామని ఆమె వివరించారు. కేంద్రం కొత్తగా రూపొందించిన డిజిటల్ వ్యక్తిగత డేటా భద్రత చట్టంతో ఇటు యూజర్ల వివరాల గోప్యతను పాటించడం, అటు నూతన ఆవిష్కరణలు చేయడం మధ్య సమతౌల్యం పాటించడానికి సంబంధించి టెక్ కంపెనీలకు స్పష్టత లభించిందని సంధ్య తెలిపారు. తమ ప్లాట్‌ఫామ్‌పై తప్పుడు సమాచారాన్ని, విద్వేషపూరిత కంటెంట్‌ని క్రియాశీలకంగా కట్టడి చేసేందుకు కృత్రిమ మేధను తాము సమర్థంగా వినియోగించుకునేందుకు కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు.

పెరుగుతున్న యూజర్లు..

కీలక మార్కెట్లలో టీనేజర్లు, యువతలో ఫేస్‌బుక్‌కు ఆదరణ తగ్గుతోందన్న అభిప్రాయం సరికాదని.. మెటాలో భాగమైన ఫేస్‌బుక్‌కు భారత్‌లో 40 కోట్ల మంది పైగా యూజర్లు ఉన్నారని వివరించారు. భారత్‌లో తాము వివిధ నవకల్పనలను పరీక్షించి, అంతర్జాతీయ మార్కెట్లో విడుదల చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. 2030 నాటికల్లా 1 లక్ష కోట్ల డాలర్ల డిజిటల్ ఎకానమీగా ఎదగాలన్న భారత్ విజన్ అనేది వ్యాపారాలకు గణనీయంగా ఊతమివ్వగలదని సంధ్య చెప్పారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌కు ఏడోసారి అవార్డు



హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ వరుసగా ఏడోసారీ ప్లాటినం గిల్డ్ ఇండియా నుంచి రెండు అవార్డులు దక్కించుకుంది. ప్రతిష్టాత్మక 'బెస్ట్ చెయిన్ సోర్స్ ప్లాటినం నేషనల్' అవార్డు సొంతం చేసుకుంది. అలాగే దక్షిణాది ప్రాంతానికి 'బెస్ట్ చెయిన్ సోర్స్ ప్లాటినం' అవార్డు గెలుపొందింది. పారదర్శకతకు నిరంతర కృషికి ఈ అవార్డులు నిదర్శమని కంపెనీ ఎండీ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. ఏడోసారి ఈ అవార్డులు గెలుపొందడం సంతోషాన్నిస్తోందని మరో ఎండీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

హిటాచీ యూపీఐ ఏటీఎం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పేమెంట్స్, కామర్స్ సొల్యూషన్స్ కంపెనీ హిటాచీ పేమెంట్స్ సర్వీసెస్ భారత్‌లో తొలిసారిగా యూపీఐ యాప్‌తో మాత్రమే పనిచేసే వైట్ లేబుల్ ఏటీఎంను అందుబాటులోకి తెచ్చింది. కార్డుతో పని లేకుండా ఈ ఏటీఎం నుంచి నగదును స్వీకరించవచ్చు. బ్యాంకింగేతర సంస్థలు సొంతంగా ఏర్పాటు చేసి, నిర్వహిస్తే వైట్ లేబుల్ ఏటీఎం అంటారు.

భవిత

జాబ్ పాయింట్

చిత్తూరు జిల్లాలో 42 పారా మెడికల్ పోస్టులు

చిత్తూరు జిల్లా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 42
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్2–10, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్2–01, కౌన్సిలర్/ఎంఎస్‌డబ్ల్యూ గ్రేడ్2–01, థియేటర్ అసిస్టెంట్–09, ల్యాబ్ అటెండెంట్ –03, పోస్ట్‌మార్టమ్ అసిస్టెంట్–05, రికార్డ్ అసిస్టెంట్–01, జనరల్ డ్యూటీ అటెండెంట్–10, ఆఫీస్ సబార్డినేట్–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, డీఎంఎల్‌టీ, డీఫార్మసీ, బీఫార్మసీ, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చిత్తూరులోని హాస్పిటల్ సర్వీసెస్ జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.09.2023.
» **వెబ్‌సైట్:** https://chittoor.ap.gov.in

ఎయిమ్స్, మంగళగిరిలో 70 గ్రూప్ బి, గ్రూప్ సి పోస్టులు

మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన నాన్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి గ్రూప్–బి, గ్రూప్–సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
» **పోస్టుల వివరాలు:** సీనియర్ నర్సింగ్ ఆఫీసర్(స్టాఫ్ నర్స్ గ్రేడ్1)–58, పీఏ టు ప్రిన్సిపాల్–01, అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–01, మెడికల్ సోషల్ వర్కర్–01, అసిస్టెంట్(ఎన్ఎస్)–01, పర్సనల్ అసిస్టెంట్–01, లైబ్రేరియన్ గ్రేడ్3–01.
» **గ్రూప్–సి పోస్టులు:** ల్యాబ్ టెక్నీషియన్–02, అప్పర్ డివిజనల్ క్లర్క్–02, ల్యాబ్ అటెండెంట్ గ్రేడ్2–02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో 10+2, డీఎంఎల్‌టీ, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.09.2023.
» **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in

మేనేజ్‌మెంట్ పీజీకి.. గ్జాట్

ఇంజనీరింగ్, డిగ్రీ ఉత్తీర్ణులు ఎక్కువగా మొగ్గు చూపే కోర్సు.. ఎంబీఏ! మేనేజ్‌మెంట్ పీజీలో చేరాలనుకునే అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మరో చక్కటి మార్గం.. గ్జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్ఏటీ-గ్జాట్)!! దీన్ని గ్జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఎక్స్ఎల్ఆర్ఐ), జంషెడ్‌పూర్ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో మంచి స్కోరు సాధిస్తే.. దేశంలోని ప్రసిద్ధ బీస్కూల్స్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు. తాజాగా గ్జాట్–2024 ప్రకటన వెలువడింది. ఈ నేపథ్యంలో.. గ్జాట్ పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

» గ్జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ప్రకటన విడుదల
» గ్జాట్ స్కోర్‌తో టాప్ బీస్కూల్స్‌లో ప్రవేశాలు

అర్హత

ఏదైనా డిగ్రీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ పరీక్షకు దరఖాస్తుకు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారూ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అందిస్తున్న కోర్సులు

ఎక్స్ఎల్ఆర్ఐ అందిస్తున్న కోర్సులు.. పీజీడీఎం బిజినెస్ మేనేజ్‌మెంట్; పీజీడీఎం హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్. ఈ రెండు కోర్సుల కాల వ్యవధి: రెండేళ్లు. అలాగే మరో కోర్సు.. పీజీడీఎం–జనరల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్. దీని కాల వ్యవధి 15 నెలలు. దీంతోపాటు ఎఫ్‌పీఎం–నాలుగేళ్ల ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్‌లోనూ ప్రవేశం పొందొచ్చు.

ప్రవేశం కల్పిస్తున్న పలు ఇన్‌స్టిట్యూట్స్

గ్జేవియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, ముంబై; సెయింట్ ఫ్రాన్సిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్, ముంబై; అమృత స్కూల్ ఆఫ్ బిజినెస్; ఏషియా పసిఫిక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, న్యూఢిల్లీ; ఏషియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, భువనేశ్వర్; బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ, గ్రేటర్ నోయిడా; బీఎంఎల్ ముంజల్ యూనివర్సిటీ, గుర్‌గావ్; సీఎంఎస్ బిజినెస్ స్కూల్; ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, పుణె తదితరాలు.

ఎంపిక విధానం

గ్జాట్ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి గ్రూప్ డిస్కషన్/ఇంటర్వ్యూలకు ఎంపిక చేస్తారు. అందులో ప్రతిభ చూపిన వారికి ప్రవేశం లభిస్తుంది.

పరీక్ష విధానం

గ్జాట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో జరుగుతుంది. వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 26 ప్రశ్నలు–26 మార్కులు; డెసిషన్ మేకింగ్ 22 ప్రశ్నలు–22 మార్కులు; క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 28 ప్రశ్నలు–28 మార్కులు; జనరల్ నాలెడ్జ్ 25 ప్రశ్నలు–25 మార్కులకు ఉంటాయి. పరీక్షలో మొత్తం 101 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటల 30 నిమిషాలు.

ప్రిపరేషన్ ఇలా

అభ్యర్థులు ముందుగా గ్జాట్ పరీక్ష ప్యాట్రన్, సిలబస్ గురించి తెలుసుకోవాలి. ఆ తర్వాత ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్‌ను సేకరించాలి. విభాగాల వారీగా ప్రిపేరవ్వాలి. డెసిషన్ మేకింగ్ విభాగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్

ఈ విభాగంలో మంచి మార్కులు సాధించాలంటే.. లాంగ్వేజ్ ప్రొఫిషియెన్సీ తప్పనిసరి. ఈ దిశగా అభ్యర్థులు పత్రికల్లో వచ్చే సైకాలజీ, టెక్నాలజీ, సోషియాలజీలకు సంబంధించిన వ్యాసాలను చదవడం లాభిస్తుంది. అలాగే వేగంగా చదవడంతో పాటు, కాంప్రహెన్షన్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవాలి. రీడింగ్ కాంప్రహెన్షన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. గత ప్రశ్నపత్రాలను సాధించాలి. యాంటోనిమ్స్, సినానిమ్స్, ప్రిఫిక్స్, సఫిక్స్‌ల గురించి తెలుసుకోవాలి. వీటితోపాటు సాధ్యమైనన్ని మాక్ టెస్టులకు హాజరవ్వాలి.

క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఎంటర్‌ప్రిటేషన్

ఈ విభాగానికి సంబంధించి జామెట్రీ, మెన్సురేషన్, క్యాల్కులేషన్స్‌తోపాటుడేటా ఇంటర్‌ప్రిటేషన్స్‌పై పట్టు సాధించాలి. క్యాల్కులేషన్, అప్రాక్సిమేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి. లైన్ గ్రాఫ్స్, పైచార్ట్స్, టాబ్యులర్ గ్రాఫ్స్, ఫ్రాక్షన్ వ్యాల్యూస్‌ను ప్రాక్టీస్ చేయాలి. డేటా ఇంటర్‌ప్రిటేషన్ సెట్స్‌ను సాధన చేయాలి. మ్యాథమెటికల్ థింకింగ్‌ను పెంపొందించుకోవాలి. పేపర్‌లెస్ క్యాల్కులేషన్స్ చేయాలి. జామెట్రీ, ప్రాఫిట్ అండ్ లాస్, టైమ్ అండ్ డిస్టెన్స్, పర్సంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్స్‌పై అధిక దృష్టిపెట్టాలి. ప్రతి వారం రెండు లేదా మూడు మాక్ టెస్టులకు హాజరవ్వాలి.



డెసిషన్ మేకింగ్ అండ్ అనలిటికల్ స్కిల్స్

ఇది పరీక్షలోనే అత్యంత క్లిష్టమైన విభాగం. ఇందులో ఎక్కువ మార్కులు సాధించాలంటే.. గరిష్ట ప్రాక్టీస్ అవసరం. ఇందులో ప్రశ్నలను సాధించే సమయంలో వివక్షకు తావులేని, విలువలతో కూడిన నిర్ణయాలు తీసుకునే తరహాలో వ్యవహరించాలి. ప్రాక్టీస్, విశ్లేషణలతోనే ఇది సాధ్యమవుతుంది.

జనరల్ అవేర్‌నెస్

చరిత్ర–ముఖ్య సంఘటనలను అధ్యయనం చేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై థియరిటికల్, ప్రాక్టికల్ అవగాహనను పెంపొందించుకోవాలి. పాలిటీ, భారత రాజ్యాంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, స్పోర్ట్స్, ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించిన అంశాలపై పట్టుసాధించాలి. ఆ దిశగా హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఎకనామిక్ టైమ్స్, బిజినెస్ స్టాండర్డ్, బిజినెస్ లైన్, లైవ్ మింట్ తదితర దినపత్రికలను చదవడం లాభిస్తుంది.

ముఖ్యసమాచారం

- దరఖాసు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 30, 2023
- అడ్మిట్ కార్డులు జారీ ప్రారంభం: డిసెంబరు 24, 2023
- ఎక్స్ఏటీ నిర్వహణ తేదీ: జనవరి 07, 2024
- వెబ్‌సైట్: https://xatonline.in

హెచ్‌పీసీఎల్.. 276 ఉద్యోగాలు

బీఈ, బీటెక్, పీజీ ఉత్తీర్ణులు అర్హులు

మహారత్న సంస్థ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్).. 276 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్, సీఏ, లా ఆఫీసర్స్ తదితర విభాగాల్లో ఖాళీలున్నాయి. పోస్టును బట్టి బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), లా డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

మొత్తం పోస్టుల సంఖ్య: 276

మెకానికల్ ఇంజనీరింగ్–57, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్–16, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్–36, సివిల్ ఇంజనీర్–18, కెమికల్ ఇంజనీర్–43, సీనియర్ ఆఫీసర్–సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ అండ్ మెయింటెనెన్స్–10, సీనియర్ ఆఫీసర్–ఎల్ఎన్‌జీ బిజినెస్–2, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్/అసిస్టెంట్ మేనేజర్ –బయోఫ్యూయల్ ప్లాంట్ ఆపరేషన్స్–1, సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్–నాన్ ఫ్యూయల్ బిజినెస్–4, సీనియర్ ఆఫీసర్–ఈవీ ఛార్జింగ్ స్టేషన్ బిజినెస్–02, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్–ముంబయి రిఫైనరీ–2, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్–విశాఖ రిఫైనరీ–6, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్స్–9, చార్టర్డ్ అకౌంటెంట్స్–16, లా ఆఫీసర్స్–05, లా ఆఫీసర్స్–హెచ్ఆర్–2, మెడికల్ ఆఫీసర్–4, జనరల్ మేనేజర్–1, వెల్ఫేర్ ఆఫీసర్–1, ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మొత్తం 10 పోస్టులున్నాయి.

వయసు

పోస్టులను అనుసరించి వయోపరిమితి నిబంధనలు వేర్వేరుగా ఉన్నాయి. ఇంజనీరింగ్ పోస్టులకు గరిష్ట వయసు 25 ఏళ్లు ఉండాలి. ఆఫీసర్ కేటగిరీ పోస్టులకు 26 నుంచి 29 ఏళ్లు, జనరల్ మేనేజర్ పోస్టుకు 50 ఏళ్లు, గరిష్ట వయసులో ఎస్సీ, ఎస్టీ, ఎక్స్–సర్వీస్‌మెన్‌కు 5 ఏళ్లు, ఓబీసీ(ఎన్‌సీఎల్)కి 3 ఏళ్లు సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం


పోస్టులను అనుసరించి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు. లా ఆఫీసర్స్, హెచ్ఆర్ విభాగంలో లా ఆఫీసర్ పోస్టుల ఎంపికకు సంబంధించి మూట్ కోర్ట్‌ను నిర్వహిస్తారు.

రాత పరీక్ష విధానం

- కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించే ఈ పరీక్ష రెండు పార్ట్‌లుగా ఉంటుంది.
- పార్ట్–1లో జనరల్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ టెస్ట్ అండ్ ఇంటలెక్చువల్ పొటెన్షియల్ టెస్ట్ (లాజికల్ రీజనింగ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్) నుంచి 85 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.
- పార్ట్–2లో టెక్నికల్/ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కు సంబంధించి ఇంజనీరింగ్‌లో చదివిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఇందులోనూ 85 ప్రశ్నలకు ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. రెండు పార్ట్‌లకు కలిపి పరీక్ష సమయం 150 నిమిషాలు.

ప్రిపరేషన్ ఇలా

ప్రిపరేషన్ ప్రారంభించే ముందు పరీక్ష సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి. సిలబస్ కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. గత ప్రశ్నపత్రాలను గమనించి దానికి అనుగుణంగా సన్నద్ధత ప్రారంభించాలి. జనరల్ ఆప్టిట్యూడ్ సంబంధించి బ్యాంక్, రైల్వేల ప్రశ్నపత్రాలను కూడా సాధన చేయొచ్చు. మాక్ టెస్టులు, ప్రాక్టీస్ టెస్టులు రాయాలి. దీనివల్ల తప్పులను సరిదిద్దుకోవడానికి అవకాశం ఉంటుంది.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: 18.09.2023
- వెబ్‌సైట్: www.hindustanpetroleum.com/careers

క్లుప్తంగా...

'టెస్కాబ్'కు ఐదోసారి అవార్డు

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ సేవలను అందించిన రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్)కు ముంబైలోని రాష్ట్ర సహకార బ్యాంకు జాతీయ సమాఖ్య (నాఫ్‌స్కాబ్) అత్యుత్తమ ప్రతిభా పురస్కారాన్ని ప్రకటించింది. టెస్కాబ్‌కు ఈ అవార్డు దక్కడం ఐదోసారి. ఉత్తమ ప్రతిభ కనబరిచిన రాష్ట్ర సహకార బ్యాంకు, సహకార శిక్షణ సంస్థ, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నాఫ్‌స్కాబ్ యేటా అవార్డులు అందజేస్తున్న విషయం తెలిసిందే.

పీజీ కోర్సుల తొలి విడత కౌన్సెలింగ్ ప్రారంభం

ఉస్మానియా వర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పలు పీజీ కోర్సుల్లో ప్రవేశానికి మొదటి విడత కౌన్సెలింగ్ ప్రారంభమైనట్లు టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజు 600 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వివరించారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు ఈ నెల 15 వరకు ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు www.osmania.ac.in అనే వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.

ఫిజికల్ డైరెక్టర్ అర్హత పరీక్ష నవంబర్14కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ బోర్డు, సాంకేతిక విద్యా కమిషనరేట్ పరిధిలోని కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) ఉద్యోగాలకు సంబంధించిన అర్హత పరీక్షను తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వాయిదా వేసింది. ఈ నెల 11న జరగాల్సిన ఈ పరీక్షను నవంబర్ 14న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, తిరిగి అదేరోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు కమిషన్ కార్యదర్శి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష తేదీకి వారం రోజుల ముందు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

రేపు అర్బాయిన్ ఐచ్ఛిక సెలవు

సాక్షి, హైదరాబాద్: మహమ్మద్ ప్రవక్త మనవడు హుస్సేన్ బలిదానానికి సంస్మరణగా 40వ రోజు షియా ముస్లింలు జరుపుకునే అర్బాయిన్ సందర్భంగా ఈనెల 6న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఐచ్ఛిక సెలవును 7వ తేదీకి మార్చారు. ఈమేరకు సీఎస్ శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

వ్యాసరచన విజేతలకు 8న రాజ్‌భవన్‌లో బహుమతులు

సాక్షి, హైదరాబాద్: విద్యారంగంలో ఆర్థిక, సామాజిక అసమానతల నిర్మూలనలో జాతీయ విద్యావిధానం పాత్ర అనే అంశంపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిర్వహించిన వ్యాసరచనల్లో గెలుపొందిన విజేతల పేర్లను రాజ్‌భవన్ మంగళవారం ప్రకటించింది. 8న ఉదయం 10.30గంటలకు రాజ్‌భవన్‌లో విజేతలకు గవర్నర్ బహుమతులను ప్రదానం చేయనున్నారు. వివరాలకు రాజ్‌భవన్ www.governor.telangana.gov.inను సందర్శించాలని సూచించింది.

ఆన్‌లైన్ + ఆఫ్‌లైన్



పండుగలకు 'హైబ్రిడ్ షాపింగ్'

- గతేడాది కంటే ఈసారి షాపింగ్ బడ్జెట్‌ను పెంచామన్న 84% మంది వినియోగదారులు
- అడ్వర్టైజ్‌మెంట్ సంస్థ 'ఇన్‌మోబీ'అధ్యయనంలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్

ప్రస్తుత పండుగల సీజన్‌లో... 'హైబ్రిడ్ షాపింగ్'నకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. 'రాఖీ బంధన్'తో మొదలై వచ్చే ఏడాది ప్రథమార్థం దాకా ఈ ఫెస్టివల్ సీజన్ సుదీర్ఘంగా సాగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మొదలైన ఈ సీజన్‌లో హైబ్రిడ్ షాపింగ్‌నకే అధికశాతం మొగ్గుచూపుతున్నట్టు వివిధ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత వినియోగదారులు మరీ ముఖ్యంగా నవ, యువతరం ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడంతో పాటు డిజిటల్ టెక్నాలజీని విరివిగా ఉపయోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో...ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ షాపింగ్‌కు కస్టమర్లు సిద్ధమవుతున్నారు. కోవిడ్ తెచ్చిన మార్పుచేర్పులతో... షాపింగ్, ఇతర విషయాల్లో కొత్త కొత్త విధానాలు, పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. గతేడాదితో పోల్చితే ఈసారి 84 శాతం వినియోగదారులు తమ షాపింగ్ బడ్జెట్‌ను గణనీయంగా పెంచినట్టు అడ్వర్టయిజ్‌మెంట్ యూనికార్న్ సంస్థ 'ఇన్‌మోబీ'తాజా నివేదికలో వెల్లడైంది.

పండుగల సీజన్‌లో.. ఎంతెంత ఖర్చు

రూ.లక్షకు పైగా కొనుగోళ్లకు సిద్ధమైన వారు 9%	రూ.50 వేల నుంచి లక్ష దాకా వెచ్చించి కొనేందుకు మొగ్గు చూపిస్తున్న వారు 23%
రూ. 25-50 వేల మధ్య షాపింగ్ చేస్తామంటున్నవారు 33%	
రూ.10 నుంచి 25 వేల లోపు కొనేందుకు సై అన్నవారు 26%	రూ.10 వేల లోపు కొనేందుకు సై అన్నవారు 7%
ఎటూ తేల్చుకోని ఒకశాతం మంది కస్టమర్లు	

నివేదికలో ఏముందంటే...

చేతిలో ఇమిడిపోయే మొబైల్ ఫోన్లతోనే షాపింగ్ చేయడం, సంస్థల సైట్లను ఆన్‌లైన్‌లోనే వీక్షించి, సమీక్షించుకునే సౌలభ్యం ఉన్నందున పలువురు ఆన్‌లైన్ కొనుగోళ్లకు మొగ్గుచూపుతున్నారు. ఐతే...ఆన్‌లైన్‌తో పాటు స్వయంగా షాప్‌లకు వెళ్లి వివిధరకాల వస్తువులు, ఇతరత్రా సామగ్రి కొనేందుకు ఇష్టపడుతున్న వారి సంఖ్య గణనీయంగా ఉన్నట్టుగా... ఆ రెండింటిని సమ్మిళితం చేసి హైబ్రిడ్ షాపింగ్ చేసే వారు 54 శాతం ఉన్నట్టుగా ఈ నివేదిక వెల్లడించింది. దేశవ్యాప్తంగా మొబైల్‌ఫోన్లను వినియోగించే వారి నుంచి వివిధ అంశాల వారీగా ఈ సంస్థ సమాచారాన్ని సేకరించింది.

ఆఫర్ల సమాచారం ఎలా తెలుసుకుంటున్నారు?

➤ మొబైల్‌లో సెర్చింగ్, ప్రకటనల ద్వారా..	46%
➤ బ్రాండ్ వెబ్‌సైట్లు/ వివిధ యాప్‌ల ద్వారా..	15%
➤ ప్రత్యక్షంగా షాపులకు వెళ్లి తెలుసుకునేవారు..	11%
➤ కుటుంబం, స్నేహితుల ద్వారా..	7%
➤ టీవీ ప్రకటనలు, ఇతర రూపాల్లో..	7%
➤ వార్తాపత్రికలు, మ్యాగజైన్ల ద్వారా..	6%
➤ ఈమెయిళ్లు, బ్రాండ్ల నుంచి న్యూస్‌లెటర్లతో..	4%
➤ వాట్సాప్‌లో బ్రాండ్ల ద్వారా వచ్చే సమాచారంతో..	3%



వసుత అగర్వాల్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్, కన్స్యూమర్ అడ్వర్టయిజింగ్ ప్లాట్‌ఫామ్, ఇన్‌మోబీ

తదనుగుణంగా మార్కెటింగ్ వ్యూహాలు...

'తమ స్మార్ట్‌ఫోన్ల ద్వారానే షాపింగ్ చేయాలని 78 శాతం మంది భావిస్తున్నారు. దీనికి తగ్గట్టుగా వివిధ కంపెనీలు, సంస్థలు కూడా తమ మార్కెటింగ్ వ్యూహాలను రూపొందించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా ప్రస్తుత పండుగల సీజన్‌లో కస్టమర్లను ఆకర్షించేందుకు, వారు కోరుకున్న విధంగా ఆయా వస్తువులను అందించేందుకు, వారితో నేరుగా కనెక్ట్ అయ్యేందుకు ఇది ఉపయోగపడుతుందని భావిస్తున్నాము'

తేలియా రుమాల్.. ఇక దునియా కా మాల్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు ప్రత్యేకమైన 'తేలియా రుమాల్' ఇక ప్రపంచ ఖ్యాతి సంపాదించనుంది. అరుదైన ఈ హస్తకళా విశేషం జీ–20 శిఖరాగ్ర సమావేశాల్లో భాగం కానుండటమే దీనికి కారణం. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్‌లో జీ–20 శిఖరాగ్ర సమావేశాలు జరగనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అక్కడ భారతీయ హస్తకళల ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల హస్తకళలకు మరీ ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ''వన్ డిస్ట్రిక్ట్ -వన్ ప్రాజెక్టు''లో భాగంగా గుర్తించిన, జీఐ ట్యాగ్ పొందిన ఉత్పత్తులకు ఈ ప్రదర్శనలో చోటు లభించనుంది. దీంతో ఆదివాసీలు, మహిళలు తయారు చేసిన హస్తకళా ఉత్పత్తులను జీ–20లో పాల్గొనే విదేశీ ప్రతినిధులు కొనుగోలు చేయడానికి అవకాశం ఏర్పడింది. జీ–20 సెక్రటేరియట్, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఖాదీ గ్రామోద్యోగ్ వంటి సంస్థలు కలిసికట్టుగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనలో తెలంగాణ హస్తకళా ఉత్పత్తి అయిన తేలియా రుమాల్ కూడా ఉండటం విశేషం. డబుల్ ఇక్కత్ డిజైన్ కలిగిన ఈ రుమాల్ సాధారణంగా ఎరుపు, నలుపు, తెలుపు రంగుల్లో లభిస్తుంది. మధ్యలో డిజైన్, చుట్టూ వెడల్పాటి బార్డర్ దీని ప్రత్యేకత. వస్త్రాలను రంగుల్లో అద్దడానికి ముందుగా నువ్వులు, ఆముదం నూనెలతో శుద్ధిచేస్తారు. అందువల్లే ఈ రుమాలుకు తేలియా (తేల్= నూనె) అనే పేరు వచ్చింది.

పోలీసులు సమీక్షల్లో... దొంగలు చోరీల్లో

- వరంగల్ నగరంలో ఏకకాలంలో ఆరు చోట్ల దోపిడీ.. 178 తులాల బంగారు ఆభరణాలు, నగదు అపహరణ..

వరంగల్ క్రైం/రామన్నపేట

చోరీలు, నేరాలను ఎలా కట్టడి చేయాలా..అని పోలీసులు ఓ పక్కన సమీక్షిస్తుండగా.. మరోపక్క అదే సమయంలో దొంగలు స్వైర విహారం చేసి దర్జాగా దోచుకుపోయిన ఘటనలు వరంగల్ మహానగరంలో మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్నాయి. పోలీస్ కమిషనర్ రంగనాథ్ పోలీస్ అధికారులతో నేర సమీక్ష జరుపుతుండగా అదే సమయంలో దొంగలు మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ఆరు ఫ్లాట్లలో చోరీలకు పాల్పడ్డారు. మొత్తం 178 తులాల బంగారం, కొంత నగదు, వెండి అపహరించారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్యలో హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధి నయీంనగర్‌లోని కల్లెడ అపార్ట్‌మెంట్‌లో సుమారు 12 తులాలు, కిషనపురలోని లహరి అపార్ట్‌మెంట్‌లో 14 తులాలు, మారుతీ వాసవి అపార్ట్‌మెంట్‌లో 60 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుతీ అపార్ట్‌మెంట్‌లో ప్రకాశ్‌రెడ్డికి చెందిన 401 ఫ్లాట్‌లో తాళం పగులగొట్టి 14 గ్రాముల బంగారు గొలుసును చోరీ చేశారు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాయత్రీ అపార్టుమెంట్‌లోని ఓ ఫ్లాట్‌లో 52 తులాల బంగారంతోపాటు సుమారు రూ.40వేల నగదు ఎత్తుకెళ్లారు. దాని పక్కనే ఉన్న వద్దిరాజు అపార్ట్‌మెంట్‌లో 39 తులాల బంగారం, రూ.22వేల నగదు అపహరించారు. ముఖాలకు మాస్క్ ధరించి చోరీ చేసిన తరువాత దుండగులు దర్జాగా వెళ్తున్న దృశ్యాలు ఆయా అపార్ట్‌మెంట్ల వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్‌కు చెందిన నలుగురు దొంగలు ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. వీరంతా ఒక కారులో వచ్చినట్లు తెలిసింది.



వరంగల్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడినట్లు భావిస్తున్న దొంగలు (సీసీ ఫుటేజీ)



- దారిలేక.. అంబులెన్స్ రాక యాతన
- మూడున్నర కిలోమీటర్ల మేర మోసుకుంటూ..
- కురకట్‌పాడు అటవీ గ్రామం దుస్థితి

జట్టీ కట్టి గర్భిణి తరలింపు

చర్ల: ఆ ఆదివాసీ గ్రామానికి రహదారి లేదు. ఎటు వెళ్లాలన్నా కాలిబాటే శరణ్యం. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వాలన్నా సెల్‌ఫోన్ సిగ్నల్ ఉండదు. అత్యవసర వైద్యం అవసరమైతే జట్టీ కట్టి మూడున్నర కిలోమీటర్ల దూరంలోని బోదనెల్లి గ్రామానికి మోసుకెళ్లాల్సిందే. అదే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కురకట్‌పాడు. ఆ గ్రామానికి చెందిన కరటం కోసి అనే గర్భిణి మంగళవారం పురిటినొప్పులతో బాధ పడుతుండగా.. కుటుంబసభ్యులు జట్టీ కట్టి దట్టమైన అటవీ మార్గంలో మూడున్నర కిలోమీటర్ల దూరంలోని బోదనెల్లికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి 108 అంబులెన్స్ కోసం ఫోన్ చేస్తే.. వాహనం అందుబాటులో లేదని చెప్పారు. దీంతో టాటా మ్యాజిక్ వాహనాన్ని అద్దెకు తీసుకుని సత్యనారాయణపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ గర్భిణిని పరీక్షించిన వైద్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేయగా అంబులెన్స్‌లో భద్రాచలం తరలించారు. నిత్యం ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా కనీసం తమ గ్రామాలకు రోడ్డు నిర్మించడం లేదని, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచడం లేదని ఆదివాసీలు ఆవేదన చెందుతున్నారు. కురకట్‌పాడుతో పాటు రామచంద్రాపురం, బూరుగుపాడు, బట్టిగూడెం, రాళ్లాపురం, ఎర్రంపాడు, కిష్టారంపాడు, వీరాపురం తదితర గ్రామాల ప్రజలదీ ఇదే పరిస్థితి.

ప్రసవాల్లో సరికొత్త రికార్డు

- ఆగస్టు నెలలో 76.3% డెలివరీలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే..
- ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి ఇది నిదర్శనం: హరీశ్



సాక్షి, హైదరాబాద్: ఆగస్టు నెలలో నమోదైన ప్రసవాల్లో 76.3 శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగాయని, ఇది ప్రభుత్వ ఆస్పత్రుల చరిత్రలో సరికొత్త రికార్డు అని వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాలు, ఇప్పుడు రెట్టింపు కంటే ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో పెరిగిన విశ్వాసానికి ఇది నిదర్శనమన్నారు. ఈ ఘనత సాధించేందుకు కృషి చేసిన వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఆశాలు, ఏఎన్‌ఎంలు, మెడికల్ ఆఫీసర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా మంత్రి నెలవారీ సమీక్షను నిర్వహించారు.

అత్యధికంగా నారాయణపేట ఆస్పత్రిలో 89%

అత్యధికంగా నారాయణపేట ఆస్పత్రి 89 శాతం, ములుగు 87, మెదక్ 86, భద్రాద్రి కొత్తగూడెం 84, వికారాబాద్ 83, గద్వాల ఆస్పత్రి 85 శాతం ప్రసవాలతో మంచి పనితీరు కనబర్చాయని హరీశ్‌రావు అభినందించారు. అతి తక్కువగా డెలివరీలు అవుతున్న మంచిర్యాల (63), నిర్మల్ (66), మేడ్చల్, కరీంనగర్ (67) జిల్లాల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనితీరు మెరుగుపడాలన్నారు. మొత్తంగా మంచి సామర్థ్యపు స్కోర్ విషయంలో తొలి వరుసలో నిలిచిన మెదక్ (84.4), జోగుళాంబ గద్వాల (83.9), వికారాబాద్ (81), ములుగు (79), నాగర్‌కర్నూల్ (77) జిల్లాల వైద్య సిబ్బందిని మంత్రి అభినందించారు. చివరి స్థానాల్లో ఉన్న జగిత్యాల, కొమురంభీం, నారాయణపేట, నిర్మల్, మంచిర్యాల జిల్లాలు పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖలోని అన్ని స్థాయిల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. అత్యవసర వైద్య సేవలకు ఎక్కడా అంతరాయం కలగకుండా చూసుకోవాలన్నారు. 102, 108 వాహన సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్యాలపై దృష్టి సారించాలని, కేసీఆర్ కిట్ డేటా ఆధారంగా డెలివరీ డేట్ తెలుసుకొని ముందస్తుగా ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. శాఖ కార్యదర్శి రిజ్వీ, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇతర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

గురుకుల పరీక్షల తుది 'కీ'లు ఖరారు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి గత నెలలో నిర్వహించిన అర్హత పరీక్షల తుది 'కీ'లను గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ) ఖరారు చేసింది. ఆగస్టు చివరి వారంలో ప్రాథమిక కీలను అందుబాటులోకి తీసుకొచ్చిన టీఆర్‌ఈఐఆర్‌బీ.. వాటిపై అభ్యంతరాలను స్వీకరించింది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో వచ్చిన అభ్యంతరాలను పూర్తిగా పరిశీలించిన నిపుణుల కమిటీ వాటికి సంబంధించి టీఆర్‌ఈఐఆర్‌బీకి సిఫార్సులు చేసింది. వీటిని పరిశీలించిన అధికారులు వాటి ఆధారంగా తుది కీలను ఖరారు చేశారు. వీటిని టీఆర్‌ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టారు. మొత్తంగా 51 కేటగిరీల్లో జరిగిన పరీక్షలకు సంబంధించిన ఫైనల్ కీలు తాజాగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ప్రకటించిన తుది కీలలో ఇకపై ఎలాంటి మార్పులు ఉండవని గురుకుల బోర్డు స్పష్టం చేసింది.

రోస్టర్ పాయింట్ల మార్పులు...

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రోస్టర్ చార్ట్ కీలకంగా పనిచేస్తుంది. ఈ చార్ట్‌లో నిర్దేశించిన రిజర్వేషన్ల ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తారు. తాజాగా రోస్టర్ పాయింట్లలో కొన్ని రకాల మార్పులు చేస్తూ సవరించిన రోస్టర్ జాబితాను టీఆర్‌ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఇందులో ప్రధానంగా 13, 37 (ఎక్స్ సర్వీస్‌మెన్) రోస్టర్ పాయింట్లలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. సొసైటీ వారీగా నిర్దేశించిన పోస్టు కేటగిరీల్లో ఈ పాయింట్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇదివరకు ప్రకటించిన పాయింట్లు... తాజాగా సవరించిన పాయింట్లతో కూడిన జాబితాను టీఆర్‌ఈఐఆర్‌బీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

సానపెడితే పిల్లలు జాతిరత్నాలే!

ఇది కేవలం ఉపాధ్యాయుల వల్లే సాధ్యం

- గురుపూజా దినోత్సవంలో మంత్రి సబితారెడ్డి
- 128 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు



సాక్షి, హైదరాబాద్: సరైన రీతిలో సానబడితే ప్రతీ విద్యార్థి జాతిరత్నమేనని.. అది కేవలం ఉపాధ్యాయుల వల్లే సాధ్యమని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గురుపూజా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సబిత మాట్లాడారు. లక్షల మంది విద్యార్థులు, లక్షకుపైగా టీచర్లున్న విద్యాశాఖ ఓ పెద్ద కుటుంబమని.. గురుపూజోత్సవం తమకు ఓ పెద్ద పండుగ అని పేర్కొన్నారు. ఎవరు, ఎంత ఎత్తుకు ఎదిగినా వారికి చదువు నేర్పిన మాస్టార్లు గుండెల్లో శాశ్వతంగా ముద్ర పడిపోతారన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రతి టీచర్ అంకిత భావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్నాం: కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని హోంమంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. మనఊరు మనబడి ఓ విప్లవాత్మక పథకమని చెప్పారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. కాగా సాంకేతికపరంగా విద్యా రంగంలో వచ్చే సవాళ్లను ఎదుర్కొనే దిశగా అధ్యాపకులు అడుగులు వేయాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 128 మంది టీచర్లను సత్కరించారు.ఎమ్మెల్సీలు కూర రఘోత్తమరెడ్డి, ఏవీఎన్ రెడ్డి, సురభివాణి, వర్సిటీల వీసీలు, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వేషం.. రూ.34 కోట్లకు మోసం

- 'అవర్ ప్లేస్'పేరుతో మోసాలు
- రూ.34.34 కోట్లు మోసగించిన మద్దూరి ఉమాశంకర్ అరెస్టు

సాక్షి, హైదరాబాద్: ఆధ్యాత్మిక గురువు వేషంలో ధార్మిక సేవా కార్యక్రమాలు, ఆశ్రమాలు, గోశాలలు నిర్మిస్తామని చెప్పి కోట్లు దండుకున్న ఆర్థిక నేరస్థుడిని సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలను సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ మంగళవారం మీడియాకు వివరించారు. హైదరాబాద్‌లోని కొత్తపేట్ ప్రాంతానికి చెందిన మద్దూరి ఉమాశంకర్ ఆధ్యాత్మిక గురువునని చెప్పుకుంటూ 'అవర్ ప్లేస్'పేరుతో నిరాశ్రయులకు నైట్ షెల్టర్లు, గోశాలలు, వృద్ధాశ్రమాలు, పేద విద్యార్థులకు ఉచితవిద్య కల్పించనున్నట్లు ప్రచారం చేసుకున్నాడు. ఈ ప్రచారాన్ని నమ్మిన పలువురు 2006 నుంచి ఉమాశంకర్‌కు సుమారు రూ.34.34 కోట్లను విరాళాలుగా ఇచ్చారు. ఏళ్లు గడుస్తున్నా సేవా కార్యక్రమాలు కార్యరూపం దాల్చకపోవడంతోపాటుగా ఇచ్చిన విరాళాలను ఉమా శంకర్ తన వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు బాధితులు తెలుసుకున్నారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు తీవ్రత దృష్ట్యా 2015లో సీఐడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. నిందితుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్లు రెండు జారీ అయ్యాయి. అయితే 2020 నుంచి పరారీలో ఉన్న ఉమాశంకర్‌ను సీఐడీ బృందం అరెస్ట్ చేసింది. నిందితుడిని అరెస్ట్ చేసిన బృందాన్ని సీఐడీ చీఫ్ మహేశ్ భగవత్ అభినందించారు.

రాష్ట్రం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులకు రాష్ట్రపతి పురస్కారాలు ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ, ఏపీ సహా దేశవ్యాప్తంగా 75 మంది ఉపాధ్యాయులకు మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము 2023కుగాను ఢిల్లీలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందించారు. ప్రాథమిక విద్యాశాఖ విభాగం కేటగిరీలో తెలంగాణ నుంచి మంచిర్యాల జిల్లాకు చెందిన అర్చన నూగురి, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సంతోష్ కుమార్ భేడోద్కర్‌లు అవార్డులు అందుకోగా కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్–ఆంట్రప్రెన్యూర్‌షిప్ శాఖ అందించే ఉత్తమ ఉపాధ్యాయ కేటగిరీలో హైదరాబాద్ ఎన్‌ఐఎంఎస్‌ఎంఈ ఫ్యాకల్టీ డాక్టర్ దిబ్యేందు చౌదరి కూడా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. అలాగే ఏపీ నుంచి ప్రాథమిక విద్యాశాఖ విభాగం కేటగిరీలో నెల్లూరుకు చెందిన మేకల భాస్కర్‌రావు, విశాఖపట్నం శివాజీ పాలెంకు చెందిన మురహరరావు ఉమా గాంధీ, రాయచోటికి చెందిన సెట్టెం ఆంజనేయులు అవార్డులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సైతం పాల్గొన్నారు.



రాష్ట్రపతి నుంచి అవార్డు స్వీకరిస్తున్న అర్చన, సంతోష్ కుమార్, దిబ్యేందు చౌదరి, ఆంజనేయులు, మురహరరావు ఉమా గాంధీ, మేకల భాస్కర్‌రావు. చిత్రంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్





'పడకే'సిన వసతులు

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో పడకలు సరిపోక రోగులు నానా తిప్పలు పడుతున్నారు. రిమ్స్ అధికారులు ఒకే పడకపై ఇద్దరు, ముగ్గురు రోగులను ఉంచుతున్నారు. దీంతో వ్యాధులు మరింతగా విజృంభించే ప్రమాదం ఉందని రోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రిమ్స్ పిల్లల వార్డులో మంగళవారం ఒక్కరోజే 100 సీజనల్ వ్యాధుల కేసులు నమోదవగా.. పురుష, మహిళా వార్డులలో 50 కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

9999@ రూ.9,99,999

రవాణా శాఖకు ఒక్కరోజే రూ.18 లక్షల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: ఆర్టీఏ ఈస్ట్‌జోన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో నచ్చిన నంబర్లను రూ.లక్షలు వెచ్చించి సొంతం చేసుకున్నారు. టీఎస్ 11 ఈజెడ్ 9999 నంబర్‌ను చర్చ్ ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.9,99,999 చెల్లించి సొంతం చేసుకుంది. టీఎస్ 11 ఎఫ్‌ఏ 0001 నంబర్‌ను కామినేని సాయి శివనాగ్ రూ.3.5 లక్షలు చెల్లించి దక్కించుకున్నారు. అలాగే టీఎస్11 ఎఫ్‌ఏ 0011 నంబర్ కోసం సామల రోహిత్‌రెడ్డి రూ.1.55 లక్షలు చెల్లించారు. టీఎస్ 11 ఎఫ్‌ఏ 0007 నంబర్‌కు ఎస్.కవిత రూ.80,100 చెల్లించారు. టీఎస్ 11 ఈజెడ్ 9990 నంబర్‌ను ఎం.సంధ్య అనే మరో వాహన యజమాని రూ.55,990 చెల్లించి సొంతం చేసుకున్నారు. టీఎస్ 11 ఎఫ్‌ఏ 0027 నంబర్‌ను శ్రీరాజ్ రూ.36,059 చెల్లించి సొంతం చేసుకున్నారు. టీఎస్ 11 ఈజెడ్ 0015 నంబర్‌కు రూ.16,111 ఆదాయం లభించింది. మొత్తంగా మంగళవారం నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో ఈస్ట్ జోన్ నుంచి రూ.18,02,970 లభించినట్లు హైదరాబాద్ జేటీసీ పాండురంగ్ నాయక్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.